ఫిబ్రవరి, 2011

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 1 పేజీలు: 64 వెల: రూ. 20/-



## గణతంత్ర వైభవం ఘనమైన త్యాగం





# అపార్డులో గణతంత్ర దినోత్సవ వేడుకలు



# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 1

ఫిబ్రవరి, 2011



ఛీఫ్ ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

ఎడిటర్

**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**జి. గంగాధరం**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**ప్రొ. పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**సి. వెంకటేశ్వర రావు**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**

**ఎమ్. విజయలక్ష్మి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com


# విషయ సూచిక


సంపాదకీయం ........................................ 2

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంతోనే రాష్ట్ర అభివృద్ధి ............ 3

అపార్డ్ న్యూస్ ........................................ 5

'సాక్షర భారత్' గురించి తెలుసుకుందాం ........................ 10

భూగర్భ జలాన్ని రక్షించుకోవాలి ........................ 14

మహనీయుల చతురోక్తులు ........................ 16

మరో వివేకానందుడు కావాలిప్పుడు ........................ 17

గ్రామసభే - గ్రామీణాభివృద్ధి ........................ 19

రాష్ట్రస్థాయి అప్నా సమీక్షా సమావేశం.. ........................ 21

గ్రామీణ ఆరోగ్య పథకం మరో ఐదేళ్లపాటు అమలు ........................ 22

పగటి వేషగాళ్ళు ........................ 24

గంగనీళ్ళు తాగినంత తృప్తి - ఫ్లోరైడ్ నుండి విముక్తి ........................ 25

జీవని (కథ) ........................ 26

విపత్తును ఎదుర్కొనే సంసిద్ధత ........................ 27

సూక్ష్మ ఋణ సంస్థల నియంత్రణ బిల్లు ఆమోదం -
త్వరలో అమలులోనికి రానున్న చట్టం ........................ 29

సూక్ష్మ ఋణ సంస్థలను అరికట్టడంలో గ్రామ పంచాయతీల పాత్ర .... 30

గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవలలో ఐ.టి. ........................ 31

అమ్యూల్యమైన క్రికెట్ క్రీడారత్నాలు ........................ 32

గ్రామీణాభివృద్ధిపై ఒక సమగ్ర అవగాహనను
కల్పిస్తున్న అపార్డ్ - టిస్ సర్టిఫికెట్ కోర్సు ........................ 36

పారశాల పారిశుధ్యం - వ్యక్తిగత పారిశుధ్యం ........................ 38

గుడిపల్లి శ్రీవరి సేద్యం - అందరికీ ఆదర్శం ........................ 40

పంటల్ని కాపాడుకుందాం ........................ 41

కన్నడ వేమన - సర్వజ్ఞుడు ........................ 44

శ్రీరమణ పేరడీలు ........................ 47

నాట్ జస్ట్ ఫర్ ఎ పీస్ ఆఫ్ క్లాత్ ........................ 50

రైతులు కూడా వినియోగదారులే ........................ 52

పర్యావరణ పరిరక్షణ - మన తక్షణ కర్తవ్యం ........................ 54

శాంతి దూత, ఆదర్శ మూర్తి మహమ్మద్ ........................ 57

గాలివాన (కథ) ........................ 59

నూతన అకౌంటింగ్ విధానంతో పంచాయితీరాజ్
సంస్థలకు పునరుజ్జీవనం ........................ 60

ఫిబ్రవరి, 2011

# సంపాదకీయం..

## గణతంత్ర వైభవం – ఘనమైన త్యాగం

దేశ రాజధాని న్యూఢిల్లీలో, రాష్ట్రాల రాజధానుల్లో 62వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకలు, కవాతులు, ప్రదర్శనలు మన దేశ వైభవాన్ని కళ్లకు కట్టాయి. అంతేకాదు, మన భిన్నత్వంలో ఉన్న అరుదైన ఏకత్వాన్ని, రాష్ట్రాల బహుళ సంస్కృతులను, వాటితో పాటు సుసంపన్నమైన భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెప్పే గొప్ప ఉత్సవం మన గణతంత్ర దినోత్సవం. మన సాయుధ దళాల సత్తాను, సామర్థ్యాలను, మన సరికొత్త సాయుధ సంపత్తిని కూడా ఆవిష్కరించే ఘనమైన జాతీయ పండుగ ఈ గణతంత్ర దినం. మన అత్యద్భుతమైన జీవన వైవిధ్యాన్ని కమనీయంగా చాటే ఈ రోజే మనకు అపురూపమైనది.

అంతేకాక, దేశ సార్వభౌమత్వానికి, స్వేచ్ఛకు, లౌకికతత్వానికి, ప్రజాస్వామ్యానికి నిలువెత్తు ప్రతీక గణతంత్ర దినం. ఈ రోజున జరిగే వేడుకల్లో రాష్ట్రాల భిన్న భిన్న సంస్కృతులు ఆనంద తాండవం చేస్తాయి. సరికొత్త ఆయుధాలు గర్జిస్తాయి. వివిధ రంగాల్లో దేశం సాధించిన అభివృద్ధిని చాటుతూ శకటాలు హొయలు పోతాయి. దేశం కోసం మేమున్నామంటూ త్రివిధ దళాలు కవాతు చేస్తాయి. విద్యార్థులూ తమ ఆనందోత్సాహాలను ప్రకటిస్తారు. మొత్తానికి మన భాషలు, సంస్కృతులు, కళలు, సంప్రదాయాలు, సామాజిక పద్ధతులు, విభిన్న మతాలు, వాటి సమిష్టి జీవనం, వైవిధ్యత, ప్రత్యేకతలు ఆవిష్కృతమవుతాయి. మన దేశ గొప్పదనాన్ని కళ్లముందు నిలుపుతాయి.

వీటన్నిటికంటే ముఖ్యమైన మన రక్షణ దళాల త్యాగాలను కూడా స్మరణకు తెస్తుందీ గణతంత్ర దినం. యుద్ధ సమయంలోనూ, శాంతి పరిస్థితులోనూ దేశాన్ని, ప్రజలను కంటికి రెప్పలా కాపలా కాస్తూ, ఆ క్రమంలోనే అశువులు బాస్తున్న అనేకమంది వీరులకు నివాళి అర్పిస్తుందీ గణతంత్ర దినం. అటువంటి వారికి మరణానంతరం దేశ అత్యున్నత పురస్కారాలైన శౌర్య పతకాలను ప్రదానం చేసేది ఈ గణతంత్ర దినోత్సవ వేదిక పైనే. పరమవీరచక్ర, వీరచక్ర, మహావీరచక్ర, అశోకచక్ర వంటి పురస్కారాలు పొందిన వీరులలో ఒక్కో వీరునిదీ ఒక్కొక్క అరుదైన త్యాగం.

ఈ త్యాగ వీరుల బలిదానాలు మాసిపోయేవి కావు. అవెప్పుడూ మన గుండెల్లో దీపంలా వెలుగుతూనే ఉంటాయి. ఆ వీరులు కూడా అమరులై మన మనస్సుల్లో కాంతి నింపుతూనే ఉంటారు. చరిత్ర వీరి త్యాగాలను సువర్ణాక్షరలతో లిఖిస్తుంది. ఇటువంటి త్యాగవీరుల వీరోచిత పోరాటాల గురించి ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా తలచుకోవటం మనందరికీ స్ఫూర్తిదాయకం. వీరిలో మరణానంతరం అశోక చక్ర పురస్కారం పొందిన ఒక యువకిశోరం కొన్నేళ్ల క్రితం జరిపిన పోరాటం ఎన్నటికీ మరపురాదు.

ఐదురోజులలో పెళ్ళి పీటల మీద కూర్చోవలసిన ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ త్రివేణీ సింగ్ మిలిటెంట్ల తూటాలకు బలి అయిన సంఘటన జనవరి 2, 2004న జరిగింది. జమ్ము మరియు కాశ్మీర్ 5వ లైట్ ఇన్‌ఫాన్ట్రీలో లెఫ్టినెంట్‌గా పని చేస్తున్న త్రివేణీ సింగ్ (25 సం.లు) జనవరి రెండవ తేదీన జమ్మూ రైల్వే స్టేషనుపై ఇద్దరు టెర్రరిస్టులు ఎ.కె. 47 తుపాకులతో విచక్షణా రహితంగా కాల్పులకు దిగారన్న విషయాన్ని తెల్లవారు జామున తన కమాండింగ్ ఆఫీసర్ ద్వారా తెలుసుకొన్న వెంటనే క్విక్ రియాక్షన్ టీమ్‌ను తానే ముందుండి నడపటానికి సంసిద్ధుడై జమ్మూ రైల్వే స్టేషనుకి బయలుదేరాడు. వాస్తవానికి ఈ మిషన్‌ను అప్పటికే విధులలో ఉన్న ఇతర సహచరులు పూర్తి చేయవలసి ఉన్నప్పటికీ వారికి ఈ వార్తను తెలియపర్చే లోపల రైల్వే స్టేషనులో టెర్రరిస్టుల ఘాతుకానికి అమాయక ప్రజలు ప్రాణాలుకోల్పోతారనే ఉద్దేశ్యంతో తానే స్వచ్ఛందంగా కదన రంగంలోకి దూకి టెర్రరిస్టులను ఎదుర్కొన్నాడు. ఈ సందర్భంగా జరిగిన కాల్పులలో త్రివేణి సింగ్ మొదట ఒక టెర్రరిస్టును హతమార్చగా, రెండవ టెర్రరిస్టు త్రివేణి సింగ్‌పై గ్రెనేడ్‌ను విసిరి తీవ్రంగా గాయపర్చాడు. తీవ్రమైన గాయాలతో నెత్తురోడుతూ లెఫ్టినెంట్ త్రివేణి సింగ్ రెండవ టెర్రరిస్టును కూడా హతమార్చి ఈ సమాచారాన్ని తన కమాండింగ్ అధికారికి "టాస్క్ కంప్లీటెడ్ సర్" అని తెలియచేసి వీరమరణం పొందాడు. తన ఒక్కగానొక్క కుమారుడి మరణ వార్త తెలిసిన అతని తండ్రి కెప్టెన్ జనమేజ్ సింగ్ తనకు మిగిలిన పుట్టెడు దు:ఖాన్ని దిగమింగుకొని, ఎందరో అమాయకుల ప్రాణాలను కాపాడిన తన కుమారుడు అమర వీరుడని కొనియాడాడు. ఐదురోజుల్లో త్రివేణి సింగ్‌ను పెళ్ళాడవల్సిన పెండ్లికూతురు కూడా ఈ సంఘటనతో కృంగిపోయినప్పటికీ, తననుతాను నిగ్రహించుకొని "శారీరకంగా తాము ఏకం కానప్పటికీ, ఏ నాడయితే తమ వివాహ నిశ్చితార్థం జరిగిందో ఆనాడే తాను మానసికంగా త్రివేణి సింగ్‌కు భార్యను అయ్యానని, వివాహం కానప్పటికీ, అమర వీరుడు త్రివేణి సింగ్‌కు భార్య అన్పించుకోవటమే తనకు గర్వకారణం" అని అమె అన్నమాటలు చిరస్మరణీయం. త్రివేణి సింగ్ త్యాగం ఒక ఎత్తయితే, ఈ యువతి తీసుకున్న నిర్ణయం కూడా మరెంతో గొప్ప త్యాగం. ఇటువంటి వేలాదిమంది త్యాగాలు మన త్రివర్ణ జాతీయ పతకాన్ని సమున్నతంగా నిలబెడుతున్నాయి. మరెప్పటికీ నిలబెడతాయి. ఇటువంటి ఎందరో అమర వీరుల త్యాగఫలం వల్ల మనం స్వేచ్ఛగా మన పనులను మనం చేసుకుంటూ, మన కుటుంబ సంక్షేమం కోసం సమయాన్ని వెచ్చించ గల్గుతున్నాం. అందుకే, అమరవీరులందరికీ ప్రతి భారతీయుడు నివాళులర్పించాలి.

భిన్నత్వంలో ఏకత్వాన్ని, మనకే సొంతమైన లౌకికతత్వాన్ని చాటుతున్న మన త్రివర్ణ జాతీయ పతాకాన్ని, వేలాది అమరవీరుల త్యాగాలకు శిరస్సు వంచి వందనం. అభివందనం.

( కె. చంద్రమౌళి )

# జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంతోనే రాష్ట్ర అభివృద్ధి

**రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విజయవంతంగా అమలు చేయుటంపై ఆధారపడి ఉందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీలో జనవరి 11, 2011న జరిగిన నీటియాజమాన్య సంస్థల ప్రాజెక్టు డైరక్టర్లు, అదనపు ప్రాజెక్టు డైరక్టర్ల సమీక్షా సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న గ్రామీ ణాభివృద్ధి శాఖామంత్రి మాట్లాడుతూ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రాష్ట్రంలో రానున్న 3 సంవత్సరాలలో ఎస్.సి, ఎస్.టి.లకు చెందిన 25 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొని రావాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోవటం జరిగిందని, దీనికి గాను సుమారు 12000 కోట్ల రూపాయలు ఖర్చు చేయటానికి గ్రామీణాభివృద్ధి శాఖ ప్రణాళికలు రూపొందించటం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమం జలయజ్ఞం కన్నా మహత్తరమైన కార్యక్రమమని, పనుల నిర్వహణకు గాను సంఘాలకు పనులను కేటాయించేందుకుగాను టి.సి.యస్ వారు యాధృచ్ఛిక ప్రక్రియను అనుసరిస్తారని, ఈ ప్రక్రియను అనుసరించి శ్రమశక్తి సంఘాలకు పనులను కేటాయించే ప్రక్రియను వెంటనే చేపట్టాలని పిడి/ఎపిడిలను ఆదేశించారు. ఈ విధానంపై శ్రమశక్తి సంఘాలను చైతన్యవంతం చేసేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టి వెంటనే పూర్తి చేయాలన్నారు. క్షేత్ర సహాయకులను వారంలో కేవలం బుధవారం మాత్రమే మండల ప్రధాన కార్యాలయానికి పిలవాలని, ఇతర దినాల్లో ఎట్టి పరిస్థితులలో వారు గ్రామంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి పథకం సక్రమంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పి.డి/ఎ.పి.డి లను కోరారు. క్షేత్రస్థాయిలో అవినీతికి పాల్పడే వారెవ్వరినీ ఉపేక్షించరాదని, ఎటువంటి వత్తిడులకు తలవంచకుండా మనస్సాక్షి ప్రకారం చిత్తశుద్ధితో పనిచేయాలని పి.డి/ఎ.పి.డి.లకు ఆయన ఉద్భోధించారు.

అంతకుముందు సమీక్షా సమావేశాన్ని ప్రారంభించిన ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రెడ్డిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, గ్రామస్థాయిలో రూపొందించిన ప్రణాళికల ప్రకారం ఉపాధి హామీ పనులను జనవరి 17 నుంచి ప్రారంభించాలని కోరారు. మండలస్థాయిలో ఉన్నత అధికారుల క్షేత్రపర్యటనలు చేసి గుర్తించిన పనులు జరిగే ప్రదేశాన్ని చూసి సంతృప్తి చెందిన పిదపనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామపంచాయితీలో వార్షిక శ్రామిక బడ్జెట్‌ను అనుసరించి పనుల షెల్ఫ్‌ను రూపొందించి సిద్ధంగా ఉంచుకోవాలని, ఏ గ్రామపంచాయితీలోనూ పనుల షెల్ఫ్ అందుబాటులో లేకపోవటం అన్న సమస్య ఉత్పన్నం కారాదని ఆయన పిడి/ఎపిడిలను కోరారు. ఉపాధి హామీ పథక నిర్వహణను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దటానికి, శ్రామికులకు వేతనాలు 15 రోజులలోపు అందించేలా చూడటానికి పథక నిర్వహణలో ఇప్పటివరకూ అనుసరిస్తున్న పద్ధతుల స్థానంలో ఎలక్ట్రానిక్ మస్టర్ మెజర్‌మెంట్ సిస్టంను, ఎలక్ట్రానిక్ చెక్ మెజర్‌మెంట్ సిస్టంను రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తీసుకొని వస్తున్నట్లు తెలియచేసారు. అదేవిధంగా శ్రమశక్తి సంఘాల ద్వారా

పథక నిర్వహణలో సంస్కరణలు అవసరమని, అట్టడుగు స్థాయి నుంచి సంస్కరణ రావాలని - పై స్థాయిలో బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని, ఇదే మంచి పరిపాలనకు ప్రాథమిక సూత్రమని ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీరెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మేట్‌లందరికీ చక్కని శిక్షణ ఇచ్చి సంసిద్ధపరచాలని సూచించారు. అన్ని గ్రామాలలో స్మార్ట్‌కార్డ్ విధానం ద్వారా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బినామీ పేర్లు లేకుండా 100 శాతం పారదర్శకతతో పనులు జరిగేలా చూడాలన్నారు.

సామాజిక తనిఖీ ఉపాధి హామీ పథకంలో ఒక ముఖ్యమైన అంశమని, పథక నిర్వహణలో జవాబుదారీతనాన్ని పెంపొందిస్తుందని, ఇది అధికారులకు వ్యతిరేకంగా నిర్వహించే ప్రక్రియ కాదని అర్థం చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో విజిలెన్స్ విభాగాలను ప్రత్యేకించి సీనియర్ అధికారులతో ఏర్పాటు చేయటం జరిగిందని, విజిలెన్సు విభాగంతో సమన్వయంతో పనిచేయాలన్నారు. సామాజిక తనిఖీ నివేదికలపై ఎటువంటి చర్యలను తీసుకుంటున్నామన్నది ప్రజలు గమనిస్తున్నారని, చర్యలు తీసుకోవటంలో ఎటువంటి పక్షపాతం చూపరాదని, బాధ్యులైన వారిని ఏ ఒక్కరినీ వదలరాదని ఆయన అన్నారు.



SthanikaPalanaTel_February_2011_Colour_2.pmd 20 2/1/2011, 10:17 PM



అపార్డు కమిషనరు శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శప్రాయంగా ఉందని, పథకం నిర్వహణలో క్షేత్రస్థాయిలో పిడి/ఎపిడిల పాత్ర శ్లాఘనీయమైని ఐతే, అధికారులు తమ విద్యుక్త ధర్మాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, అధికారులు ప్రజాసేవలో ఏవిధంగా నిమగ్నం కావాలో క్రీ.పూ. 3వ శతాబ్దంలోనే చాణక్యుడు తన అర్థశాస్త్రంలో వివరించాడని, దీని ప్రకారం "ఏ అధికారి ప్రతిరోజూ ప్రజలకు చేరువలో కన్పిస్తూ, ప్రజారంజకంగా తన విధులను నిర్వర్తిస్తాడో అటువంటి అధికారి ప్రజలమన్నలను అందుకుంటాడు" అని అన్నారు. పేదప్రజలకు జీవనోపాధి భద్రత కలగచేసే బృహత్తర కార్యక్రమాల్ని చిత్తశుద్ధితో అమలుచేసేందుకు నాయకత్వం వహించాలన్నారు.

గ్రామీణాభివృద్ధి కమీషనరు శ్రీమతి జయలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి పనికీ జి.పి.ఎస్.కో ఆర్డినేట్లు తప్పనిసరిగా సేకరించాలని అన్నారు. ఉపాధిహామీ పథకంలో రాష్ట్రంలో భూగర్భజలాల పునరుజ్జీవనం కోసం అమలు చేసే ప్రాజెక్టు, మొక్కల పెంపకం కార్యక్రమాలను ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలుగా గుర్తించటం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం జూలై 20న 30 కోట్ల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమం చేపట్టనున్నామని, అందుకుగాను 3000 నర్సరీలు తక్షణం ప్రారంభించాలన్నారు. ఇందుకుగాను అటవీశాఖ - గ్రామీణాభివృద్ధి శాఖ ముందు నుంచే సమన్వయంతో పనిచేయాలన్నారు.

రాష్ట్ర సామాజిక తనిఖీ సొసైటీ డైరక్టరు కుమారి సౌమ్య మాట్లాడుతూ, రెగ్యులర్‌గా మండలస్థాయి అధికారులు మస్టరు వెరిఫికేషను చేయాలన్నారు. టి.ఎ. మెజర్‌మెంటు బుక్ నందు సమాచారం కరెక్టుగా నమోదు చేసి నిర్వహించాలన్నారు. కూలీలకు కోరగానే పని ఇచ్చేందుకు, వారి హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ యంత్రాంగం స్పందన అవసరం అని అన్నారు.

జనవరి 11, 12వ తేదీలలో అపార్డులో జరిగిన పిడి/ఎపిడిల సమావేశంలో పథక నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించటానికి తీసుకోవాల్సిన పలుచర్యల గూర్చి విస్తృతంగా చర్చించారు. చర్చించిన అంశాలలో ప్రధానంగా...

2) మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం అమలుపై జిల్లాలవారీ పనితీరును, చెల్లింపులు, పనుల ముగింపు, పనుల షెల్ఫ్ నిర్వహణ, పనుల ఇ-వెరిఫికేషన్, మండల ప్రణాళికల జెనరేషను, పనుల ఆమోదం, శ్రమశక్తి సంఘాల వారీగా పనులను అప్పగించడం, ఇ-మస్టరు మెజరుమెంటు, హార్టీకల్చరు నందు లబ్దిదారుల ఎంపిక, నర్సరీల పెంపకం, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, స్మార్ట్ కార్డుల జారీ, సామాజిక తనిఖీలపై విస్తృత చర్చ జరిగింది.

అలాగే వాటర్‌షెడ్, ఇందిరప్రభ (సిఎల్‌డిపి) అమలుపై విశ్లేషణ జరిగింది.

3) నగరీకరణ వల్ల కూడా కొన్ని ప్రాంతాలలో పనులు గుర్తింపు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. బావుల డీ సిల్టింగ్, డీపెనింగ్ (త్రవ్వడం) వంటి పనులకు ముందు, తరువాత కొలతలు తీసి రికార్డు చేసుకోవాలని సాంకేతిక నిపుణులు సూచించారు.

4) వాటర్‌షెడ్ పథకం అమలుపై చర్చ జరుపుతూ, 'వినియోగదారుల సంఘాలను' రైతులతో ఆ భూమిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ వారితో ఏర్పాటుచేసి ఉత్పాదకత పెంపుదల, జీవనోపాధుల నిర్వహణను ఆ గ్రూపులకు అప్పజెప్పాలని చర్చించడం జరిగింది. పథకం అమలును జిల్లాలవారీగా పర్యవేక్షించడం జరిగింది.

ఇందిరప్రభ నందు విద్యుత్ సరఫరా, బోర్ల త్రవ్వకాలకు ఆమోదాలు పొందడం, బోర్లు త్రవ్వడం వంటి కీలక అంశాలపై ప్రగతిని జిల్లాల వారీ పరిశీలించి, నివేదిక తనకు ఇవ్వవలసినదిగా జిల్లా యంత్రాంగాన్ని ముఖ్య కార్యదర్శి గారు కోరారు. ఆయా శాఖలతో సమీక్ష జరిపి పథక అమలును పటిష్టపరచాలని కోరడం జరిగింది.

ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధిగా ప్రత్యేక కమీషనరు శ్రీ విద్యాసాగర్, అడిషనల్ కమీషనరు శ్రీప్రసాద్, ఛీఫ్ విజిలెన్సు అధికారిణి శ్రీమతి సుధారాణి, క్వాలిటీ కంట్రోల్ సెల్ ఇన్‌ఛార్జి శ్రీకృష్ణమూర్తి, వాటర్‌షెడ్ స్పెషల్ కమీషనర్ శ్రీమతి సువర్ణ, ఇందిరప్రభ జాయింట్ కమీషనర్ శ్రీ మూర్తి పాల్గొని ఎన్నో విలువైన సలహాలు, సూచనలు అందచేసారు. మొత్తం మీద రెండు రోజులపాటు అపార్డులో జరిగిన పిడి/ఎపిడిల సమావేశం వారికి దిశానిర్దేశం చేసి, పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలుచేసేలా కార్యోన్ముఖుల్ని చేసిందనే చెప్పవచ్చు. ✰





SthanikaPalanaTel_February_2011_Colour_2.pmd 4 2/1/2011, 10:17 PM

వార్తల్లో 'అపార్డ్'

# అపార్డును సందర్శించిన రాజస్థాన్ పంచాయితీ రాజ్ ప్రతినిధులు


రాజస్థాన్ ప్రజాప్రతినిధుల బృందంతో చర్చిస్తున్న గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ సంస్థలలోని ప్రజాప్రతినిధులకు, అధికారులకు సామర్థ్యాల పెంపుదల కోసం అందచేసే శిక్షణా కార్యక్రమాల గూర్చి తెలుసుకోవటానికి, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ రాజ్ సంస్థల పనితీరుని పరిశీలించటానికి రాజస్థాన్ రాష్ట్రం నుండి పంచాయితీ రాజ్ శాఖ అధికారులు, ఐక్య రాజ్య సమితి సామర్థ్యాల పెంపుదల ప్రాజెక్టు సమన్వయ కర్తలతో కూడిన 23 మంది సభ్యుల బృందం జనవరి 18 నుంచి 22 వరకూ ఐదు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించింది.

ఈ బృందం 18, 19 తేదీలలో అపార్డును సందర్శించి పంచాయితీ రాజ్ సంస్థలలో పనిచేసే ప్రజాప్రతినిధులు, అధికారుల కోసం అపార్డు అందించే శిక్షణా కార్యక్రమాల గూర్చి తెలుసుకుంది. అపార్డ్‌లో రాజస్థాన్ బృంద సభ్యులకు స్వాగతం పలికిన అపార్డు కమీషనరు శ్రీ చంద్రమౌళి, ఐ.ఏ.యస్. అపార్డ్ శిక్షణా వ్యూహాల గూర్చి బృంద సభ్యులకు వివరించారు.

రాష్ట్రంలో ఉన్న సుమారు 2.61 లక్షల ప్రజాప్రతినిధుల సామర్థ్యాలు పెంపొందించటానికి అపార్డు బహుముఖ వ్యూహాలు అవలంబిస్తోందని, అందులో భాగంగా అపార్డు, ఇ.టి.సి., మండల కేంద్రాలలో ముఖాముఖి శిక్షణలు, దూర విద్యా మాధ్యమం సాఫ్ట్‌నెట్ - మన టివీ ద్వారా ప్రతి గురువారం వీడియో కార్యక్రమాలు, ప్రశ్నలు- జవాబులు ప్రత్యక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని తెలియచేసారు. సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఇంటర్‌నెట్ ఆధారిత ఇ-లెర్నింగ్ పద్ధతి ద్వారా పెద్ద సంఖ్యలో ఉన్న ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి శిక్షణ అందచేయటానికి అపార్డు కృషి చేస్తోందని అన్నారు. www.apard.gov.in లో అపార్డుకి చెందిన వివిధ శిక్షణా కార్యక్రమ వివరాలు ఉంచటం జరిగిందన్నారు.

అపార్డు రూపొందించిన వీడియోలన్నీ అపార్డ్ యూ-ట్యూబ్ ఛానెల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. నాలెడ్జ్ కామెన్స్ పోర్టల్ ద్వారా కంప్యూటర్ ఆధారిత పాఠ్యాంశాలను అందచేస్తున్నామని అపార్డు కమీషనరు తెలియచేశారు. ప్రజా ప్రతినిధుల పరిజ్ఞానాన్ని పెంపొందించటానికి 'స్థానికపాలన' మాస పత్రికను అన్ని గ్రామ పంచాయితీలకు పంపుతున్నామని తెలియచేసారు.

రాజస్థాన్ పంచాయితీ రాజ్ శాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రీ డి.పి. గుప్తా, మాట్లాడుతూ, పంచాయితీ రాజ్ వ్యవస్థ పనితీరుని పరిశీలించటానికి తమ రాష్ట్రం నుండి కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను 4 బృందాలు సందర్శిస్తున్నాయని చెప్పారు. ఈ పర్యటనలో తమ బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంచాయితీ రాజ్ సంస్థల పనితీరు, గ్రామ సభ పనితీరు, పంచాయితీ రాజ్ సంస్థలకు బదలాయించిన అధికారాలు గూర్చి, మహిళా స్వయం సహాయక సంఘాల పనితీరు గూర్చి ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టంలోని బలాలు, బలహీనతల గూర్చి అధ్యయనం చేస్తుందన్నారు. రాజస్థాన్ బృందం మహబూబ్‌నగర్ జిల్లా లోని షాద్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామపంచాయతీని సందర్శించి భూగర్భ మురుగునీటి పారుదలకు గ్రామపంచాయతీ తీసుకున్న చర్యలు ఇతర అభివృద్ధి కార్యక్రమాల గూర్చి తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాపరిషత్‌ను సందర్శించి జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ కె. దామోదర్‌రెడ్డి, ఇతర జిల్లా పరిషత్ సభ్యులతో, అధికారులతో చర్చించారు. జిల్లాల్లో తమ పర్యటనను ముగించుకొని రాజస్థాన్ బృంద సభ్యులు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం గారిని కలిసి తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరి శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం రాజస్థాన్ బృంద సభ్యులకు ఐ.కె.పి. పనితీరు ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.యస్ పథకంలో పారదర్శకత తీసుకురావటానికి తీసుకుంటున్న చర్యలను గూర్చి వివరించారు.


రాజస్థాన్ ప్రజాప్రతినిధుల బృందంతో చర్చిస్తున్న అపార్డ్ కమిషనర్ శ్రీ కె. చంద్రమౌళి

ఈ కార్యక్రమాన్ని అపార్డులోని సి.డి.పి.ఏ. సెంటర్‌హెడ్ ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి సమన్వయ పరిచారు. రెండు రోజులపాటు అపార్డులో జరిగిన వర్క్‌షాపులో రాజస్థాన్ ప్రజాప్రతినిధులు, ఐక్యరాజ్య సమితి సామర్థ్యాల పెంపుదల ప్రాజెక్టు కో-ఆర్డినేటరు ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ వ్యవస్థకు సంబంధించిన పలు అంశాలను నిపుణుల నుండి తెలుసుకున్నారు.



SthanikaPalanaTel_February_2011_Colour_2.pmd 2/1/2011, 10:17 PM

# ప్రజా ప్రతినిధులతో ప్రజా ప్రతినిధులకు శిక్షణ

పంచాయితీరాజ్ ప్రజా ప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలకు అపార్డ్ అనుసరిస్తున్న బహుముఖ వ్యూహంలో భాగంగా ప్రజాప్రతినిధులతో ప్రజా ప్రతినిధులకు శిక్షణ అందచేసే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అపార్డ్ కమిషనరు శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ రూపొందించిన జాతీయ సామర్థ్యాల పెంపుదల నిర్మితిని అనుసరించి 5 సంవత్సరాల కాల వ్యవధిలో కనీసం 3 సార్లయినా ప్రజాప్రతినిధులకు వివిధ అంశాలపై శిక్షణ అందచేయాల్సిన ఆవశ్యకత దృష్ట్యా మండలపరిషత్తు అధ్యక్షులకు 3వ విడత శిక్షణా కార్యక్రమాన్ని అపార్డులో 20/01/2011 తేదీ నుండి 26/02/2011 వరకూ 7 బ్యాచ్‌లలో నిర్వహిస్తామన్నారు.

ఇప్పటికే ప్రజాప్రతినిధులు $4^{1/2}$ సంవత్సరాలు పూర్తి చేసుకొన్నందున వివిధ పథకాల నిర్వహణలో క్రొత్తగా వచ్చిన మార్పులు చేర్పుల గూర్చి విషయపరిజ్ఞానాన్ని అందచేయటంతో పాటు క్షేత్ర స్థాయిలో ఉత్తమ ఆదరణ పద్ధతులను అవలంబిస్తున్న గ్రామ పంచాయితీ సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్తు అధ్యక్షులతో పరస్పర చర్చలు ఏర్పాటు చేయటం ద్వారా ప్రజాప్రతినిధుల దృక్పథంలో మార్పులు తీసుకొని రావటానికి అపార్డు కృషిచేస్తోంది అని ఆయన అన్నారు.

జిల్లా ప్రణాళికీకరణలో నల్గొండ జిల్లాలో అవలంబించిన పద్ధతులు, ఎదురైన అడ్డంకులు అధిగమించగలిగిన తీరుని నల్గొండ జిల్లా ప్రజా పరిషత్తు ఛైర్మన్ శ్రీ కసిరెడ్డి నారాయణ రెడ్డి మండల పరిషత్తు అధ్యక్షులకు వివరించారు. ప్రజా భాగస్వామ్యంతో గ్రామంలోని సమస్యలను ఏ విధంగా అధిగమించవచ్చో అన్న విషయంపై గంగదేవిపల్లి సర్పంచ్ శ్రీ కూసం రాజమౌళి వివరించారు. అధికారాల వికేంద్రీకరణకు దేశ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలు, ప్రతిబంధకాల గూర్చి మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీ సోలిపేట రామచంద్రారెడ్డి వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ దామోదర్‌రెడ్డి కూడా తన అనుభవాలను మండల పరిషత్ అధ్యక్షులతో పంచుకొన్నారు. మొత్తం మీద ఈ ప్రయోగం విజయవంతమైనదనే భావించవచ్చు.

ఈ కార్యక్రమాన్ని సి.డి.పి.ఏ. సెంటర్‌హెడ్ ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి నేతృత్వంలో కన్సల్టెంట్ శ్రీపతిరావు సమన్వయపరుస్తున్నారు.



# ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం కోసం సి.బి.టి.ల విడుదల

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీలోని సి.ఎన్.ఆర్.ఎం. సెంటరు రూపొందించిన కంప్యూటర్ ఆధారిత పాఠాల సి.డి.లను తేది : 21.1.2011న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ నితేన్ చంద్ర, ఐ.ఏ.ఎస్. విడుదల చేసారు. ఈ సందర్భంగా శ్రీ నితేన్ చంద్ర మాట్లాడుతూ 'ల్యాబ్ టు ల్యాండ్' కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలోని సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్గించటంకోసం అపార్డు రూపొందించిన ఈ స్వీయబోధనా కంప్యూటర్ ఆధారిత పాఠాలు అద్భుతంగా ఉన్నాయని అన్నారు.

అపార్డును ఆదర్శంగా తీసుకొని మిగిలిన యస్.ఐ.ఆర్.డి.లు కూడా ఇ-లెర్నింగ్ సిబిటిలను అపార్డు సహకారంతో రూపొందించుకోవాలని ఆయన సూచించారు. జనవరి 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ హైదరాబాద్‌లో జరిగిన 17 రాష్ట్రాల యస్.ఐ.ఆర్.డి. అధిపతులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు, బి.డి.ఓ.లతో నిర్వహించిన సమావేశంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖచే అమలు చేయబడే ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ఏ విధంగా అమలు చేస్తే ప్రభుత్వ కార్యక్రమ ఉద్దేశ్యాలను ప్రజల దరిచెంతకు చేర్చగల్గుతామనే విషయంపై విస్తృతంగా చర్చించి వ్యూహాలు ఖరారు చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అపార్డ్ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్గించటానికి అందుబాటులో ఉన్న అన్ని మాధ్యమాలనూ వినియోగించుకుంటూ, గ్రామస్థాయిలో భారత్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా కార్య కర్తల ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి అన్ని అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలియచేసారు. సి.బి.టి.లను రూపొందించి సి.ఎన్.ఆర్.యం. సెంటర్‌హెడ్ శ్రీ కూర్మారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఆర్.డి. డైరెక్టరు జనరల్ శ్రీమాత్యూ సి. కున్నమ్‌కల్, ఐ.ఏ.ఎస్., ఎన్.ఐ.ఆర్.డి., డిప్యూటీ డైరెక్టరు జనరల్ శ్రీ ఎం.వి. రావ్, ఐ.ఏ.ఎస్., వివిధ రాష్ట్రాల యస్.ఐ.ఆర్.డి. అధిపతులు, ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.



**సి.బి.టి.లను విడుదల చేస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ నితేన్‌చంద్ర, ఐ.ఎ.ఎస్**



SthanikaPalanaTel_February_2011_Colour_2.p13d 2/1/2011, 10:17 PM

# పంచాయితీ రాజ్ వార్షిక క్యాలెండర్ విడుదల

పంచాయితీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 2011 వార్షిక క్యాలెండరును రాష్ట్ర పంచాయితీ రాజ్ మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖామంత్రి శ్రీ కె. జానారెడ్డి జనవరి 1 న ఆవిష్కరించారు.

దేశంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గ్రామ సభల సంవత్సరాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫీల్డ్ పబ్లిసిటీ వారు నిర్వహించిన చిత్ర లేఖన పోటీల నుండి ఉత్తమమైన చిత్రాలను ఎంపిక చేసి ప్రత్యేకంగా ఈ క్యాలెండరును అపార్డ్ సహకారంతో రూపొందించటం జరిగిందని పంచాయితీ రాజ్ కమీషనరు శ్రీమతి పూనం మాల కొండయ్య ఈ సందర్భంగా మంత్రి శ్రీ జానారెడ్డికి వివరించారు. మంత్రి శ్రీ జానారెడ్డి మాట్లాడుతూ, పంచాయితీ రాజ్ క్యాలండర్ చాలా స్ఫూర్తి దాయకంగా ఉందనీ, చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని అన్నారు. పంచాయితీరాజ్ శాఖ చరిత్రలో మొదటిసారిగా క్యాలండర్‌ను రూపొందించి అందంగా ముద్రించినందుకు అందరినీ అభినందించారు.

ఈ క్యాలండర్లు అన్ని గ్రామ పంచాయితీలకు, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులకు అపార్డ్ ద్వారా పంపిణీ చేయనున్నట్లు పంచాయితీరాజ్ కమీషనరు పూనం మాలకొండయ్య తెలియచేసారు.




పంచాయతీరాజ్ వార్షిక క్యాలెండర్ 2011 ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామాత్యులు శ్రీ కె. జానారెడ్డి.

చిత్రంలో పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీమతి పూనం మాలకొండయ్య, అదనపు కమిషనర్ శ్రీ శంకరరెడ్డి




పంచాయతీరాజ్ వార్షిక క్యాలెండర్ ను తిలకిస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణ నీటి సరఫరా శాఖామంత్రి శ్రీ కె. జానారెడ్డి, కమిషనర్ శ్రీమతి పూనం మాలకొండయ్య




SthanikaPalanaTel_February_2011_Colour_2.p14d 2/1/2011, 10:17 PM

# 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో రాష్ట్ర ప్రణాళికలో అంతర్భాగం కానున్న జిల్లా అభివృద్ధి ప్రణాళికలు



12వ పంచవర్ష ప్రణాళికా కాలానికి (2012-17) మన రాష్ట్రంలో ప్రజాభాగస్వామ్య పద్ధతిలో గ్రామ, మండల, మున్సిపాలిటీలు స్థాయి నుండి రూపొందించబడిన అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా జిల్లా ప్రణాళికలను రూపొందించే ప్రకియలో భాగంగా జిల్లా ప్రణాళికా కమిటీలకు సాంకేతిక మద్దతు ఇచ్చేందుకు దేశ వ్యాప్తంగా పేరెన్నికగన్న 5 స్వచ్ఛంద సంస్థలను కేంద్ర ప్రభుత్వ పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసిందని పంచాయతీ రాజ్ కమీషనరు శ్రీమతి పూనం మాలకొండయ్య తెలియచేసారు.

అపార్డులో ది : 10.1.2011న ఎంపిక చేయబడిన సాంకేతిక మద్దతు సంస్థలతో (టి.ఎస్.ఐ.) నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పంచాయితీరాజ్ కమీషనర్ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ 2012-17 మధ్యకాలానికి జిల్లా ప్రణాళికలను, వార్షిక ప్రణాళికలను రూపొందించటానికిగాను జిల్లా ప్రణాళికా కమిటీలకు మార్గనిర్దేశం చేసే బాధ్యత సాంకేతిక మద్దతు సంస్థలపై ఉందన్నారు. జిల్లా ప్రణాళికల రూపకల్పనలో శ్రీ వి. రామచంద్రన్ కమిటీ సిఫారసులను అనుసరించి భారత ప్రణాళికా సంఘం జారీ చేసిన నియమ నిబంధనలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కూడా దృష్టిలో ఉంచుకొని గ్రామ, మండల, మునిసిపాలిటీల ప్రణాళికలను క్రోడీకరిస్తూ, అన్ని ప్రణాళికలనూ సమీకృతపరిచి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించే బాధ్యత టి.ఎస్.ఐ.లపై ఉందన్నారు. వివిధ పంచాయితీ రాజ్ సంస్థలకు / మునిసిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, సర్వశిక్షా అభియాన్, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, భారత నిర్మాణ్ వంటి ఫ్లాగ్‌షిప్ కార్యరక్రమాల ద్వారా వచ్చే నిధులు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల ద్వారా వచ్చే నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుండి శాఖాపరంగా విడుదల అయ్యే నిధులు, పంచాయితీ రాజ్ సంస్థల స్వంత నిధులు పరిగణనలోకి తీసుకుంటూ ప్రణాళికలు రూపొందించే సమయంలో గుర్తించిన కీలక అంతరాలను భర్తీ చేసేందుకు బి.ఆర్.జి.ఎఫ్. నిధులను వినియోగించే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



బి.ఆర్.జి.ఎఫ్. కార్యక్రమం అమలు అవుతున్న 13 జిల్లాల్లో ప్రణాళికీకరణ ప్రక్రియకు అనుసరించే వ్యూహాలను ఖరారు చేసుకొని సవివరమైన నివేదికను, కార్యాచరణ ప్రణాళికను సమర్పించాల్సినదిగా కమీషనరు పూనం మాలకొండయ్య అన్ని టి.ఎస్.ఐ.లను కోరారు.

అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో జిల్లా ప్రణాళికల రూపకల్పనలో అపార్డు కీలక భూమిక వహించిందని, ప్రణాళికీకరణపై గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ అవగాహన కలుగచేయటానికి పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించిందని అన్నారు. 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో కూడా టి.ఎస్.ఐ. ల సామర్థ్యాల పెంపుదల నుంచి, గ్రామ స్థాయిలో భాగస్వామ్య ప్రణాళికల రూపకల్పనకు అవసరమైన సహాయ సహకారాలను అపార్డు అందచేస్తుందని తెలియచేసారు.

జిల్లా ప్రణాళికీకరణలో జిల్లా విజన్ రూపొందించటానికి అవలంబించాల్సిన పద్ధతులు, వివిధ స్థాయిల్లో భాగస్వామ్య పద్ధతిలో అనుసరించాల్సిన ప్రక్రియలను గూర్చి బి.ఆర్.జి.ఎఫ్. కన్సల్టెంటు శ్రీ డి. రామకృష్ణ, ఐ.ఏ.ఎస్.(రిటైర్డ్) వివరించారు.

ఈ కార్యక్రమాన్ని అపార్డులో సి.డి.పి.ఏ.సెంటర్ హెడ్ ప్రొ. ఆర్. సూర్యనారాయణరెడ్డి సమన్వయ పర్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో అపార్డు కన్సల్టెంట్లు శ్రీ సి.వి.రావు, ప్రొ. ఎం.ఎల్.కాంతారావు, ప్రొ. బలరాములు, శ్రీపతిరావు, పంచాయితీరాజ్ డిప్యూటీ కమీషనర్లు, శ్రీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



SthanikaPalanaTel_February_2011_Colour_2.p15d 2/1/2011, 10:17 PM

# శ్రమ శక్తి సంఘాల ద్వారా ఉపాధి హామీ పథక నిర్వహణలో పారదర్శకత పెంపొందింపు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో దేశానికే తలమానికంగా ఉన్న మన రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా అమలు జరిగేలా చూడటంలో అప్నా స్వచ్ఛంద సంస్థలు శ్రమశక్తి సంఘాలను చైతన్యపరచాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీరెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. 28.12.2010న అపార్డులో జరిగిన అప్నా ప్రతినిధుల రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, జాబ్‌కార్డుదారులందరినీ శ్రమశక్తి సంఘాలలోకి తీసుకువచ్చే పనిని త్వరితగతిన పూర్తి చేయాలనీ, ఇప్పటి వరకూ శ్రమశక్తి సంఘాలలోకి రాని వారిని గుర్తించి, అందుకు గల



కారణాలను అన్వేషించి, వారిని కూడా సంఘాలలోకి చేర్పించేలా అప్నా ప్రతినిధులు కృషిచేయాలన్నారు. వికలాంగులు, ఒంటరి స్త్రీలు, హెచ్.ఐ.వి./ ఎయిడ్స్ బాధితులకు జాబ్‌కార్డులు సత్వరమే జారీ చేయాలని వికలాంగుల శ్రమశక్తి సంఘాల ఏర్పాటు కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

జనవరి 17 నుంచీ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పనులను ప్రారంభించనున్నామని, పనుల అమలులో అవినీతికి ఆస్కారం లేకుండా చూసేలా శ్రమశక్తి సంఘాలను చైతన్య పర్చాలని, పనుల నాణ్యతపై ప్రధానంగా దృష్టి పెట్టాలని అన్నారు. శ్రమశక్తి సంఘాలలోని శ్రామికులకు వారి హక్కులను గూర్చి తెలియచేయాలన్నారు. అప్నా సంస్థల పని విధానాన్ని పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకుని రానున్నట్లు తెలియచేసారు. అప్నా సభ్యత్వం కోసం ఇకపై ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుందని, అప్నా సంస్థల పని పరిధి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నెలవారీ సమావేశ నివేదికలు తప్పనిసరిగా యం.సి.సి.లలో ఏ.పి.ఓ. ద్వారా, డి.సి.సి.లో ఎ.పి.డి.ల ద్వారా నమోదు చేయాలని సూచించారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన అప్నా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. డైరక్టర్ శ్రీ మురళి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీమతి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పథకంలో వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలుచేయటంలో దేశంలోని పలు రాష్ట్రాలకు మన రాష్ట్రం మార్గదర్శిగా ఉంటోంది. ఉపాధి హామీ పథకంలో వికలాంగులను కూడా భాగస్వాములను చేసి వారి జీవనోపాధులలో మెరుగుదల తీసుకునిరావటానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ చేస్తున్న కృషిలో భాగంగా వికలాంగుల కొరకు ప్రత్యేకంగా కొన్ని రాయితీలను, సౌకర్యాలను ప్రకటించింది.

ఇప్పటివరకూ రాష్ట్రం మొత్తం మీద 1.68 లక్షల జాబ్‌కార్డులు వికలాంగులకు జారీ చేయగా వీరికి 18 లక్షల పనిదినాలు కల్పించబడ్డాయి. సుమారు రూ. 17.38 కోట్లు వేతనాల రూపంలో చెల్లించబడ్డాయి. 3247 మంది మేట్‌లుగా పనిచేస్తున్నారు.

**రాయితీలు / సౌకర్యాలు**

- వికలాంగులకు సంవత్సరంలో 150 పనిదినాల కల్పన
- 18 సంవత్సరాలపైబడి, 40% వికలాంగత్వం ఉన్న వారికి ఈ సౌకర్యం వర్తిస్తుంది.
- వికలాంగుడైన వ్యక్తి ఒక్కడే నివశిస్తున్నప్పటికీ, అతనినే ఒక కుటుంబంగా గుర్తించి జాబ్‌కార్డ్ మంజూరు చేయవచ్చు.
- సాధారణ శ్రామికులు చేసే పని కన్నా వికలాంగులు 30% శాతం తక్కువ పనిచేసినా, వీరికి 100% వేతనం చెల్లించవచ్చు. ఐతే ఈ సౌకర్యం శ్రమశక్తి సంఘంలోని శ్రామికులందరూ వికలాంగులు అయినప్పుడు మాత్రమే వర్తిస్తుంది.
- సాధారణ శ్రమశక్తి సంఘాలకు, వికలాంగుల ప్రత్యేక శ్రమశక్తి సంఘాలకు మేట్‌లుగా వికలాంగులైన వ్యక్తులను కూడా నియమించవచ్చు.
- ఉపాధి హామీ పనులను చేయటానికి వికలాంగుల శ్రమశక్తి సంఘ సభ్యులు చేసిన ప్రయాణం నిమిత్తం రూ. 10/- ప్రతీవ్యక్తికి అదనంగా ఇస్తారు. ఒక వేళ పని ప్రదేశం గ్రామం నుండి 5 కి.మీ కన్న ఎక్కువ దూరంలో ఉన్నప్పుడు ప్రతీవ్యక్తికి 20/-లు చొప్పున ప్రయాణభత్యం చెల్లిస్తారు.
- ఆయాలుగా నియామకం చేయటానికి వికలాంగులైన మహిళలకు ప్రాధాన్యత ఇస్తారు. ☆



SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 2/1/2011, 8:33 PM



# 'సాక్షర భారత్' గురించి తెలుసుకుందాం

**భారతదేశం చాలా కాలం నుండి నిరక్షరాస్యత, పేదరికం, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నది. ఎక్కడ నిరక్షరాస్యత ఎక్కువ ఉందో అక్కడ పేదరికం, అనారోగ్యం ఎక్కువగానే ఉంది. నిరక్షరాస్యత నిర్మూలనతో పేదరికం, అనారోగ్య సమస్యలను అధిగమించ వచ్చుననే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం 1978లో జాతీయ వయోజన విద్యా కార్యక్రమం చేపట్టి 15-35 సంవత్సరాల వయస్సు గల వయోజనులలోని అందరు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలను 1978 నుండి 1990 వరకు వయోజన విద్యా కేంద్రాలు నిర్వహించి నిరక్షరాస్యత నిర్మూలన ప్రాజెక్టు విధానంలో కృషి చేసింది.**

ఈ విధానం ద్వారా మొత్తం నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేయడానికి చాలా కాలం పడుతుందని, 1990 నుండి రాష్ట్రంలో దశల వారీగా సంపూర్ణ అక్షరాస్యతా కార్యక్రమం, అక్షరాస్యతా అనంతర కార్యక్రమం, నిరంతర విద్యా కార్యక్రమాలు పెద్ద ఎత్తున ప్రారంభించి మంచి ఫలితాలు సాధించింది.

దేశంలో వయోజన విద్యా కార్యక్రమాలు / ఫార్మల్ విద్యా విధానం ద్వారా 1981 జనాభా లెక్కల ప్రకారం ఉన్న 43.57% అక్షరాస్యత 65.38%కి పెరిగింది. అదే విధంగా రాష్ట్రంలో 35.66% నుండి 61.11% కి పెరిగింది. రంగారెడ్డి జిల్లాలో 29.4% నుండి 66.31% కి పెరిగింది.

నిరక్షరాస్యులు, అక్షరాస్యులుగా అయిన నూతన అక్షరాస్యుల లబ్ది కోసం 1987 నుండి 30-09-2009 వరకు నిరంతర విద్యా కార్యక్రమాలు నిర్వహించి వారు పొందిన, చదివిన చదువును మరచి పోకుండా, దానిని పెంపొందించుకోవడానికి, ఇతర కార్యకలాపాలు కూడా చేపట్టారు. అయితే పురుషుల అక్షరాస్యతను, స్త్రీల అక్షరాస్యత గమనించినట్లయితే సుమారు 20% స్త్రీలు అక్షరాస్యతలో వెనుకబడి ఉన్నారు.

ఈ అంతరాన్ని తగ్గించడానికి భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ సెప్టెంబర్ 8, 2009న సాక్షర భారత్ మిషన్ -2012ని ప్రారంభించింది.

### సాక్షరభారత్ లక్ష్యాలు

- అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం లేని వారికి అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానము కల్పించడం.
- నూతన అక్షరాస్యులు చదువును కొనసాగించడానికి నియత విద్యకు సమానమైన విద్యను అందించడం (సమతుల్య కార్యక్రమం ఓపెన్ స్కూల్ ద్వారా).
- నూతన అక్షరాస్యులు సంపాదన, జీవన పరిస్థితులు మెరుగు పరచడానికి వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పరిచే కార్యక్రమం నిర్వహించడం.
- నూతన అక్షరాస్యులకు, ఇతరులకు నిరంతర విద్యా కార్యక్రమాలు అందజేసి అభ్యాసన సమాజాన్ని ఇవ్వడం.

### లబ్ధిదారులు

- సాక్షర భారత్ మిషన్ -2012 కార్యక్రమంలో లబ్ధిదారులు 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులు.
- స్వయం సహాయక సంఘాల సభ్యులు, జాతీయ ఉపాధి హామీ పథకంలోని నిరక్షరాస్యులు, ఇతర లబ్ధిదారులు (మహిళలు 85%, పురుషుల 15%)

### అక్షరాస్యత ఎందుకు?

(1) ఏ ప్రాంతమైన ఆర్థికంగా ముందడుగు వేయాలంటే అక్కడి ప్రజలలో నూటికి కనీసం 40 మంది అయినా అక్షరాస్యులై ఉండాలన్నది ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక శాస్త్రవేత్తలందరూ అంగీకరించిన విషయం (2) అధికోత్పత్తి సాధించడం (3) జనాభా పెరుగుదలను అరికట్టడం (4) ప్రభుత్వ యంత్రాంగం పటిష్టంగా పనిచేయడం (5) శిశు మరణాల రేటు తగ్గడం (6) గ్రామ సమైక్యత సాధించడం (7) ప్రజాస్వామ్య





Sthanka_FebBW.indd 26 01/02/11 10:14 PM

పరిరక్షణ, చైతన్యవంతమైన సమాజం ఏర్పడడం (8) దేశ సంస్కృతి, నాగరికతను కాపాడుకోవడం, రాజకీయ సుస్థిరతను సాధించడం (9) స్త్రీ శక్తి సమీకరణ (10) అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం.

### ప్రజల జీవన ప్రమాణం పెరగడం, వ్యక్తికి అక్షరాస్యత సహాయపడే తీరు

(1) కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహించగలగడం (2) సంతానాన్ని తీర్చిదిద్దడం (3) అన్యాయం, దోపిడి నుండి విముక్తి (4) ఇతరుల మీద ఆధారపడకుండా ఉండడం (5) ఓటు హక్కును సద్వినియోగపరుచుకోవడం (6) ఆరోగ్యం కాపాడుకోవడం (7) ఆదాయం పెంచుకోగలగడం (8) అభివృద్ధి కార్యక్రమాలలో పాలు పంచుకోవడం (9) మూఢనమ్మకాలకు దూరంగా ఉండడం. (10) తన హక్కులు, బాధ్యతలు తెలుసుకోవడం (11) వృత్తి నైపుణ్యం పెంచుకోగలగడం (12) సామాజిక మార్పును ఆమోదించగలగడం (13) ఆత్మస్థైరం అలవడడం.

### మనవంతు కర్తవ్యం

(1) అందరికీ విద్య అవశ్యకతను / ప్రాముఖ్యతను గురించి వివరించడం (2) సాక్షరతా కార్యక్రమం గురించి ప్రజలలో అవగాహన కల్పించడం (3) అక్షరాస్యతా కేంద్రాలను తరచుగా సందర్శించడం (4) కేంద్రాలలో చదువుకుంటున్న వారిని ప్రోత్సహించడం (5) కేంద్రాలు బాగా నడిచే విధంగా తగిన సూచనలు, సలహాలు అందించడం (6) నిరక్షరాస్యులను చైతన్యవంతులను చేయడం (7) నిరక్షరాస్యులను క్రమం తప్పకుండా కేంద్రానికి వచ్చేటట్లు ప్రోత్సహించడం / ప్రేరేపించడం (8) ప్రతి ఇంట్లోను చదివే అలవాటు చేయడం (9) స్వచ్ఛంద సంస్థలను, నాయకులను, పెద్దలను, యువతీ, యువకులను కలసి వయోజన విద్యా కార్యక్రమానికి వారు సహాయ పడేటట్లు చూడడం.



### మహిళలు విద్యావంతులైతే...

- ఒక పురుషుడు చదువుకుంటే అది అతనికే పరిమితమవుతుంది. అదే ఒక స్త్రీ చదువుకున్నట్లయితే మొత్తం కుటుంబానికి విద్య అందించినట్లవుతుంది.
- జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖ నిర్వహించిన ఒక సర్వేలో అక్షరాస్యులైన స్త్రీలకు, నిరక్షరాస్యులైన స్త్రీల విషయాలలో వారి అవగాహనల పట్ల ఎంతో వ్యత్యాసం ఉన్నట్లు వెల్లడయింది. ఆడవారి చదువు ఆరోగ్యానికి మెరుగు అన్న సత్యాన్ని తేల్చింది.
- నిరక్షరాస్యులైన స్త్రీలలో కేవలం 54.7% మంది మాత్రమే గర్భిణీగా ఉన్నప్పుడు టి.టి. ఇంజక్షన్లు తీసుకుంటున్నారు. అక్షరాస్యులయిన మహిళలయితే 91.2% దాకా తీసుకుంటున్నారు.
- నిరక్షరాస్యులైన స్త్రీలు సగటున 3 నుంచి 4 గురు పిల్లలకు జన్మనిస్తే అక్షరాస్యులైన స్త్రీలు ఒక్కరు లేక ఇద్దరికి మాత్రమే జన్మనిస్తున్నారు.
- కుటుంబ సంక్షేమ కార్యక్రమాల గురించి అక్షరాస్యులైన స్త్రీలు 76.4% దాకా అవగాహన కల్గి ఉంటే, నిరక్షరాస్యులైన స్త్రీలలో కేవలం 42.4% మాత్రమే వీటి గురించి అవగాహన కల్గి ఉన్నారు.
- శిశు మరణాల విషయంలో చదువుకున్న స్త్రీలలో ప్రతి 1000 జనాలకు 33 మంది శిశువులు మరణించగా, నిరక్షరాస్యులైన స్త్రీలలో 1000 జనాలకు 87 మంది శిశువులు చనిపోతున్నారు.
- అందుకే సమాజంలో ప్రతి స్త్రీ చదువుకున్నప్పుడే అభివృద్ధి అనేది సాధ్యమవుతుంది.
- సాక్షరతా కార్యక్రమం లక్షలాది మంది స్త్రీలకు ఒక ఆశాకిరణం కావాలి.
- ప్రస్తుతం జిల్లాలో స్త్రీ, పురుషుల అక్షరాస్యతా శాతంలో సుమారు 25% వ్యత్యాసం ఉంది.

### సాక్షర భారత్ మిషన్ - 2012

'సాక్షర భారత్ మిషన్ - 2012' పథకాన్ని ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ సెప్టెంబర్ 8, 2009న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా ప్రారంభించారు.

- రంగారెడ్డి జిల్లాలో 3,73,232 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడం సాక్షర భారత్ మిషన్ - 2012 ద్వారా మన ప్రధాన లక్ష్యం.
- సాక్షర భారత్ మిషన్ -2012 కార్యక్రమం రంగారెడ్డి జిల్లాలో మూడు దశలుగా చేపట్టబడుతుంది. ముఖ్యంగా స్త్రీలలో అక్షరాస్యత సాధించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.
- స్త్రీలలో, పురుషులలో గల అక్షరాస్యత అంతరాన్ని తగ్గించడం.
- నిరక్షరాస్యులైన మహిళలను ప్రోత్సహించడానికి మహిళా కార్యకర్తలను, వాలంటీర్లను ఎక్కువ సంఖ్యలో తీసుకోవడం జరుగుతుంది.
- సాక్షర భారత్ మిషన్ - 2012 కార్యక్రమం పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారా అమలు చేయబడుతుంది.
- స్త్రీలలో అక్షరాస్యత 50% కన్నా తక్కువ గల జిల్లాలలో సాక్షర భారత్ మిషన్ - 2012 కార్యక్రమం ప్రారంభమగుచున్నది.
- రంగారెడ్డి జిల్లా అక్షరాస్యత 63.3%, పురుషులు 75.02%, స్త్రీలు 57.03%.
- పురుషులలో, స్త్రీలలో అక్షరాస్యతా శాతం వ్యత్యాసం 18%గా ఉంది.
- జిల్లాలోని గ్రామీణ ప్రాంతం వరకు మహిళల అక్షరాస్యత శాతం 49.02%.

### పథకం అమలు విధానం

- సాక్షర భారత్ మిషన్ - 2012 కార్యక్రమం జిల్లా స్థాయి, మండల స్థాయి, గ్రామ పంచాయితీ స్థాయిలలో కమిటీల పర్యవేక్షణలో నిర్వహించబడుతుంది.


Sthanka_FebBW.indd 27 01/02/11 10:14 PM






- భారత ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాకు సాక్షర భారత్ మిషన్ - 2012 కార్యక్రమం మంజూరు చేస్తూ 31-03-2012 వరకు 15 సంవత్సరాలు పైబడిన 3.73 లక్షల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి లక్ష్యంగా నిర్దేశించింది.
- గ్రామ గ్రామాన సర్వే కార్యక్రమం చేపట్టి గుర్తింపబడిన నిరక్షరాస్యుల లో 1/3 వంతు మందిని మొదటిదశలో అక్షరాస్యులుగా చేయడం లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది.

## జిల్లా, మండల గ్రామ పంచాయితీ స్థాయిలలో కమిటీల ఏర్పాటు

*జిల్లా స్థాయి కమిటీ నిర్వహించవలసిన కార్యక్రమాలు / విధులు :*

- జిల్లా స్థాయిలో అక్షరాస్యత ప్రణాళికలు తయారు చేయడం.
- గ్రామ పంచాయితీ అధికారులకు కార్యక్రమ వివరాలు తెలియజేయడం.
- సామాజిక చైతన్యం రావటానికి, అనుకూల వాతావరణం ఏర్పడటానికి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం.
- జిల్లా, మండల స్థాయిలలో సభలను నిర్వహించి 'మహిళా అక్షరాస్యత' గురించి కార్యక్రమ నిర్వహణలో పాల్గొనే సంస్థలకు, వ్యక్తులకు (అభ్యాసకులు, కార్యకర్తలు / మూల్యాంకన చేసేవారు / పంచాయితీలు) వారి విధులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించడం,
- పంచాయితీలకు బోధన, అభ్యసన సామాగ్రి సరఫరాను పరిశీలించడం.
- స్వయం సహాయక సంఘాలు (ఎస్.హెచ్.జిలు), ఉపాధి హామీ పథక క శ్రామిక సంఘాల ద్వారా అదనపు కార్యక్రమాలను ఏర్పాటు చేయడం.
- గౌరవ వేతనం ఇవ్వడం, సాక్షరతా పురస్కారాలను ప్రకటించడం.
- కార్యక్రమానికి సంబంధించిన అన్ని వివరాలు ప్రజలందరికీ అందుబాటులో ఉండేటట్లు పెట్టడం.

## మండల స్థాయి కమిటీ నిర్వహించవలసిన కార్యక్రమాలు / విధులు

- మండల స్థాయి అక్షరాస్యత ప్రణాళికను రూపొందించడం.
- అక్షరాస్యతా కేంద్రాల పర్యవేక్షణ.
- గ్రామ పంచాయితీకి, జిల్లా సమితికి మధ్య సత్సంబంధాలు నెలకొల్పడం.
- మండల స్థాయిలో అక్షరాస్యత కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయడం.

## గ్రామ పంచాయితీ స్థాయి కమిటీ నిర్వహించవలసిన కార్యక్రమాలు / విధులు

- లోక్ శిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి గ్రామ పంచాయితీ వార్డులలో నిరంతర విద్యా కార్యక్రమాన్ని నిర్వహించడం.
- గ్రామ పంచాయితీలో ఉన్న నిరక్షరాస్యులను, కార్యకర్తలను గుర్తించడం.
- బోధన అభ్యసన సామాగ్రిని సమీకరించడం, భద్రపరచడం, గుర్తించిన వాలంటీర్‌లకు అందజేయడం.
- సూక్ష్మ ప్రణాళికలు గ్రామ పంచాయితీ స్థాయిలో చేయడం, అక్షరాస్యతా కేంద్రాలను పర్యవేక్షించడం.
- జాతీయ స్థాయి మూల్యాంకన / అభ్యాసకుల మూల్యాంకనకు కావలసిన మార్గదర్శకాలు సూచించడం.
- అక్షరాస్యతా కార్యకర్తలకు (లిటరసీ ఎడ్యుకేటర్స్) గౌరవ వేతనం ఇవ్వడం.
- మూల్యాంకనము చేయడం.
- మహిళలు సంపూర్ణ అక్షరాస్యత సాధించిన ప్రాంతాల నుండి "మహిళా సాక్షరతా పురస్కార్" (మహిళా అక్షరాస్యతా పురస్కారానికి) అభ్యర్థులను పంపించడం.

## లోక్ శిక్ష కేంద్రాలు (వయోజన విద్యా కేంద్రాలు)

- ప్రతి గ్రామ పంచాయితీకి ఒక లోక్ శిక్ష కేంద్రం (వయోజన విద్యా కేంద్రం) ఏర్పాటవుతుంది. ఇది నిరంతర విద్యా కేంద్రము మాదిరిగా పనిచేస్తుంది.
- వయోజన విద్యా కేంద్రాలలో అక్షరాస్యతతో పాటు వృత్తి నైపుణ్యత కల్పిస్తారు.
- గ్రామ స్థాయి కో -ఆర్డినేటర్లు లోక్ శిక్ష కేంద్రాన్ని నిర్వహిస్తారు.

## అక్షర కేంద్రం (లిటరసీ సెంటర్)

- ప్రతి లోక్ శిక్ష కేంద్రం పరిధిలో అభ్యసన కేంద్రాలు (అక్షరాస్యత కేంద్రాలు) నిర్వహించడం.



Sthanka_FebBW.indd 28 01/02/11 10:14 PM

* ప్రతి అక్షరాస్యతా కేంద్రంలో 8-10 మంది నిరక్షరాస్యులను నమోదు చేసుకుంటారు.
* ప్రతి 8-10 మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్‌ను ఎంపిక చేస్తారు.
* అక్షరాస్యతా కేంద్రాలలో పనిచేసే వాలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేయాలి.
* ప్రతి అక్షరాస్యతా కేంద్రం 300 గంటలు లేక 6 నెలలలోపు నిర్వహించబడుతుంది.
* అక్షరాస్యతా కేంద్రాలలో నమోదు చేసుకొనిన అభ్యాసకులకు బోధన, అభ్యాసన సామాగ్రి ఉచితంగా అందజేయబడుతుంది.
* అక్షరాస్యత కేంద్రాన్ని ప్రతి రోజు గంటన్నర / రెండు గంటల సమయం నిర్వహిస్తే అందరూ అక్షరాస్యులవుతారు.

ప్రజల భాగస్వామ్యంతో కేంద్రం ప్రారంభించడమైనది. ఈ కార్యక్రమానికి జాతీయ అక్షరాస్యత మిషన్ డైరెక్టర్ జనరల్ శ్రీ జగ్‌మోహన్ సింగ్ రాజు, డి.జి., యన్.యల్.యం, న్యూఢిల్లీ, డైరెక్టర్, వయోజన విద్య, శ్రీ పి. జనార్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీమతి సునీతా మహేందర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

ఈ వయోజన విద్యా కేంద్రం పరిధిలో 7 సాక్షరభారత్ కేంద్రాలు ప్రారంభమైనాయి. ఇందులో మొత్తం 70 మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులవ్వటానికి నమోదు అయ్యారు.

ఇదేవిధంగా సెప్టెంబర్ 9, 2010న జిల్లా అంతటా సాక్షర భారత్ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. చాకలిపల్లి గ్రామం కుల కచర్ల మండలంలో మొత్తం 10 కేంద్రాల్లో ప్రారంభమై 100 మంది నిరక్షరాస్యులు ఈ కేంద్రాల్లో నమోదు అయ్యారు.



*పెద్దంబర్‌పేట్ గ్రామం, హియత్‌నగర్ మండలంలో సాక్షరభారత్ కేంద్రం వయోజన విద్య, ఉపసంచాలకులు, హయత్‌నగర్, యం.పి.డి.ఓ, యం.పి.టి.సి, సర్పంచ్, వార్డు మెంబర్లు, అభ్యాసకులు*

* ప్రతి విద్యావంతుడు, యువతీ, యువకులు స్వచ్ఛంద సంస్థల వారు వాలంటీర్లుగా ముందుకు వచ్చి పనిచేయాలి.
* సాక్షరభారత్ మిషన్ - 2012 కార్యక్రమాన్ని పైన తెల్పిన విధంగా అమలు పరిచినట్లయితే సాక్షరతా సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.

## రంగారెడ్డి జిల్లాలో సాక్షరభారత్ కార్యక్రమం

రంగారెడ్డి జిల్లాలో సాక్షరభారత్ కార్యక్రమం సెప్టెంబర్ 9, 2010 ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి శ్రీమతి దగ్గుబాటి పురంధరీశ్వరి ప్రారంభించారు.

## వయోజన విద్యాకేంద్రం ప్రారంభం

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సెప్టెంబర్ 9, 2010న గ్రామ సర్పంచ్ శ్రీ పెంటయ్య సౌజన్యంతో రంగారెడ్డి జిల్లా ముచ్చింతల గ్రామం, శంషాబాద్ మండలం నందు ఒక 'వయోజన విద్యా కేంద్రాన్ని' కూడా శ్రీమతి పురంధరీశ్వరి ప్రారంభించారు. ఇది దేశంలోని మొదటి అక్షర కేంద్రం.

## సాక్షరభారత్ కేంద్రంలో చదువుచున్న అభ్యాసకులు

జిల్లాలో మొత్తం 7,500 సాక్షర భారత్ కేంద్రాలు ప్రారంభమై 75,000 మంది నిరక్షరాస్యులను నమోదు చేసుకోవడమైనది. వీరికి బోధన, అభ్యసన సామాగ్రి ఉచితంగా పంపిణీ చేయడమైనది. జిల్లాలో 705 వయోజన విద్యా కేంద్రాలు ప్రతి గ్రామ పంచాయితీకి ఒక్కటి చొప్పున ప్రారంభించనైనది.

ఇట్టి కేంద్రాలను మండల కో-ఆర్డినేటర్స్, వయోజన విద్యా సిబ్బందితో పాటు మండల / జిల్లా అధికారుల కేంద్రాల పనితీరును పర్యవేక్షణ చేస్తూ తగిన సూచనలు ఇస్తారు.

జిల్లాలో తదుపరి దశలో సాక్షరభారత్ కార్యక్రమం నిర్వహించటానికి కుటుంబ సర్వే చేసి మొత్తం నిరక్షరాస్యుల సంఖ్య ఎంతో తెలుసుకొనడానికి కార్యక్రమం చేపట్టమైనది.

*- డా॥ సి. హెచ్. నారాయణరెడ్డి, ఉపసంచాలకులు, కార్యదర్శి జిల్లా లోక్ శిక్షా సమితి, రంగారెడ్డి జిల్లా*



Sthanka_FebBW.indd 29 01/02/11 10:14 PM

**ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను మానవ ఉపయోగానికి అనుగుణంగా వాడడంలో నిర్లక్ష్యం, ఉదాసీనత పెరిగితే ఆ తప్పు మానవులదే కాని ప్రకృతిది కాదు అని గుర్తించాలి!**

**గొట్టపు బావుల ద్వారా భూగర్భ జలాల వినియోగం అనేది ప్రకృతిపై నిరంతర దాడిగా భావించవచ్చు! ఫలితంగా భూగర్భజలాలు రోజు రోజుకు తరిగిపోతున్నాయి. అదుపు తప్పి పెరిగిపోతున్న జనాభా, అడవుల నరికివేత, అభివృద్ధిలో అసమతుల్యాలు, నగరాభివృద్ధి, వివిధ రకాల కాలుష్యాల కారణంగా నీటి వనరులు క్రమంగా క్షీణించిపోతున్నాయి.**

రకాలుగా మనం ఉపయోగించుకుంటున్నాం. ఇక మిగిలిన 20,588 యం.సి.యం.ల నీరు వృథా అవుతోంది. ఆర్థిక వనరుల అవసరం, పర్యావరణ ఇబ్బందుల వలన నీటి వనరులను పూర్తిగా వాడుకలోనికి తేవడం కష్టతరమవుతోంది.

భూగోళంపై 70 శాతం పైగా నీరే వుంది. అందులో కేవలం 3.5 శాతం మాత్రమే మంచినీరు వుంది. ఈ మంచినీటిలో దాదాపు 70 శాతం అంటార్కిటికా, గ్రీన్ ల్యాండులలో మంచు రూపం వుంది.

ప్రపంచంలోని నీటిలో ఒక్క శాతం కంటే తక్కువ అనగా 0.007 శాతం నీరు మాత్రమే మానవులు ఉపయోగించుకునేందుకు అందుబాటులో వుంది

# భూగర్భ జలాన్ని రక్షించుకోవాలి !



నవంబర్ 27, 2009 మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రపంచ గడియారం ప్రకారం, ప్రపంచ జనాభా 6871189000 వుంది. అది 2025వ సంవత్సరం నాటికి 830.30 కోట్లకు పెరగవచ్చని అంచనా. ప్రస్తుత నీటి అవసరం ప్రతి ఏటా 2.4 శాతం పెరుగుతోంది. 31.5 కోట్ల జనాభా గల 28 దేశాలు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. 2025వ సంవత్సరం నాటికి భారతదేశంతో సహా 50 దేశాలు నీటి కొరతలో వున్న 28 దేశాల చెంతకు చేరుతాయని అంచనా!

మనదేశంలో నదీ జలాల మూలంగా వార్షిక భూతల జల లభ్యత 1869 బిలియన్ ఘనపు మీటర్లు, భూగర్భజలాలు 432 బిలియన్ ఘనపు మీటర్లు. వెరసి 2301 బిలియన్ ఘనపు మీటర్లు స్థిరంగా వుండి, పెరిగే జనాభాకు అనుగుణంగా పెరగడం లేదు.

### నీటి ఆవశ్యకత పెరిగింది

ఆకాశంలో పక్షిని చూచి మసాల నూరితేను, దాహం వేసినప్పుడు బావుల త్రవ్వకం చేయాలని భావిస్తేను నిరాశపడక తప్పదు.

అత్యధికంగా వానలు, వరదలతో దేశం మునిగిపోతున్నప్పటికినీ, భూగర్భజల మట్టాలు నానాటికీ తగ్గిపోతూ ప్రమాద ఘంటికలు మ్రోగుతున్నాయి. ఈ నేపథ్యంలో జల పరిరక్షణ ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించక తప్పదు.

మన రాష్ట్రానికి అందుబాటులో వున్న నీటి వనరులు ముఖ్యంగా భూగర్భజలాలు, స్థానిక, అంతర్రాష్ట్ర నదులే! తద్వారా మనకు లభ్యమయ్యే భూగర్భ జలాలు 34,700 యం.సి.యం. లు కాగా, అందులో కేవలం 14,112 యం.సి.యం.ల నీటిని మాత్రమే వివిధ

### ఆంధ్రప్రదేశ్‌లో నీటి పరిస్థితి

- ★ 777 మండలాల్లో నీటి సమస్యలేదు.
- ★ 160 మండలాల్లో నీటి సమస్య పరిమితంగా వుంది.
- ★ 60 మండలాల్లో నీటి కరవు వుంది.
- ★ 111 మండలాల్లో నీటి కరువు అపరిమితంగా వుంది.
- ★ 1108 మొత్తం మండలాలు.

### ప్రపంచ జనాభాను వేధిస్తున్న నీటి సమస్య

- ★ 59.3 శాతం జనాభాకు నీటి సమస్యలేదు.



Sthanka_FebBW.indd 24 01/02/11 10:14 PM

★ 32.6 శాతం జనాభాకు నీటి సమస్య పరిమితంగా వుంది.

★ 5.3 శాతం జనాభాకు నీటి కరువు వుంది.

★ 2.8 శాతం జనాభాకు నీటి సమస్య అపరిమితంగా వుంది.

## 2025వ సంవత్సరం నాటికి నీటి అవసరాల అంచనా

| | | | |
|---|---|---|---|
| 1 | త్రాగునీరు | 3-5 | బి.సి.యం.లు |
| 2 | సాగునీరు | 108.0 | బి.సి.యం.లు |
| 3 | పరిశ్రమలకు నీరు | 1-4 | బి.సి.యం.లు |
| 4 | విద్యుత్ ఉత్పత్తికి నీరు | 0-1 | బి.సి.యం.లు |
| | **మొత్తం నీరు** | **113-0** | **బి.సి.యం.లు** |

ప్రస్తుతం లభ్యమౌతున్న 1122 బి.సి.యం.ల నీరు, 2025 నాటికి 748 బిసియంల నీరు తగ్గిపోవచ్చని అంచనాలు చెప్తున్నాయి.

2003వ సంవత్సరం మార్చి నెలలో, టోక్యో నగరంలో జరిగిన మూడవ ప్రపంచ జల వేదిక అనగా ప్రపంచ నీటివనరుల సంస్థ (World Water Forum) లో అంతర్జాతీయ సమాజానికి ఐక్యరాజ్యసమితి సమర్పించిన నివేదికలో, ''ఈనాడు మనం ఎదుర్కొంటున్న అన్ని సామాజిక, జాతీయ సంక్షోభాలలో, మన మనుగడకు, మన భూగోళం మనుగడకు మూలమైంది జల సంక్షోభమే'' అని పేర్కొంది.

మతం లాగే నీరు కూడా మానవులను చైతన్యవంతులను చేయగల శక్తి కలిగి వుంది. నీటికి దగ్గరగా జీవిస్తారు. నీటికోసం తగాదాలు పడ్తారు. ప్రతిరోజు, ప్రతిచోట, ప్రతిఒక్కరికి నీరు కావలసిందే! నీటికోసమే పొలాల మధ్య, రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య తగాదాలు!

భారతదేశంలో 2050 వ సంవత్సరం నాటికి పెరగబోయే జనాభా అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం వార్షిక తలసరి 240 గ్రాముల ఆహార ధాన్యాల అవసరం ప్రకారం, సుమారు 400 మిలియన్ టన్నుల ఆహారధాన్యోత్పత్తి కావలసి వుంటే, ప్రస్తుత ఆహార ధాన్యోత్పత్తి కేవలం 200 మిలియన్ టన్నులే వుంది.

అనగా ఇంకా 40 సంవత్సరాలలో మన ఆహార ధాన్యోత్పత్తి రెట్టింపు కావలసివుంది. ఇది సాధ్యమా? సాధ్యం చేయడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేయక తప్పదు.

గత కాలంలో చెరువులలో పూడిక తీతవలన (Tank Management) భూగర్భజల వృద్ధి జరిగేది. తీసిన పూడికతీత పొలాలకు సహజ ఎరువుగా ఉపయోగపడి పంటలు బాగా పండేవి. ఈ చెరువుల గ్రామీణ సంస్కృతులు అంతర్భాగంగా పరిఢవిల్లాయి.

2005-06వ సంవత్సరంలో వర్షాలు విపరీతంగా పడ్డాయి. 25 శాతం అధిక వర్షపాతం నమోదైంది. భూగర్భజల మట్టం బాగా పెరిగింది. ఈ సంవత్సరం కూడా అన్ని ప్రాంతాలలో భారీగా వానలు పడ్డాయి. 32 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. ఫలితంగా భూగర్భ జల మట్టాలు గణనీయంగా పెరిగాయి. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది కోస్తా ఆంధ్రలో 2.62 మీటర్లు, రాయలసీమలో 1.23 మీటర్లు, తెలంగాణాలో 3.12 మీటర్లు జల మట్టాలు పెరగగా, చిత్తూరు జిల్లాలో



మాత్రం 0.56 మీటర్లు తగ్గింది. కానీ ఈ సెప్టెంబరు నెలలో పడిన భారీ వర్షాల మూలంగా చిత్తూరు జిల్లా పరిస్థితి కూడా మెరుగయినట్లు తెలుస్తోంది. జలసిరులు పెరగడం హర్షదాయకం!

ఇట్టి సమయంలో జలవనరులను పటిష్టం చేయడం, శాస్త్రీయ పద్ధతులను భూగర్భజలాల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2002వ సంవత్సరంలో 'వాల్టా' చట్టం(Water, Land And Tree Act) అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ముఖ్యోద్దేశం జల సంరక్షణ అందరి బాధ్యత కావాలి. ఉపరితల, భూగర్భజల వనరుల వినియోగం క్రమబద్ధీకరణ జరగాలి. బోరుబావుల త్రవ్వకం క్రమబద్ధీకరించాలి. డ్రిల్లింగు యంత్రాలను నమోదు చేయించాలి.

భూగర్భజల శాఖ సిఫార్సుల మేరకు యం.ఆర్.ఓ (తహసిల్దారు) లు బోరుబావుల త్రవ్వకానికి అనుమతించాలి. రాజకీయాలకు అతీతంగా వాల్టా చట్టాన్ని అమలు పరచిన నాడే భావితరాలకు నీటి సంక్షోభం తగ్గుతుంది.

భూగర్భజల శాఖ సాంకేతిక నిపుణుల సలహాలకు ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా విలువలనివ్వాలి. జల, పర్యావరణ వ్యవస్థలను ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా బలోపేతం చేయడానికి, సురక్షితమైన జల భవిష్యత్‌లో రాష్ట్రంలో వున్న జల వనరులన్నిటిని వినియోగంలోనికి తేవాలి.

ఉన్నతమైన సాంకేతిక పరిజ్ఞానం, ఖచ్చితమైన సమాచారం, పటిష్టమైన పరిశోధనా కార్యక్రమాల సహాయంతో సాంప్రదాయబద్ధంగా నీటి నిర్వహణా పద్ధతులు, సుస్థిరమైన నీటి నిర్వహణకు బలమైన పునాదులు వేయాలి.

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, జల సంబంధ సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రతిపౌరుడు, వీరందరి సంయుక్త అకుంఠిత దీక్ష, కృషిల సమన్వయంతో జలసమస్య పరిష్కారమవుతుంది. అందుకు అంకిత భావం ముఖ్యం.

జల సిరుల సంరక్షణ దిశగా మన జైత్రయాత్ర సాగాలి.

**- ఎ.వి.రాజా,** *ఆంధ్రప్రదేశ్ భూగర్భ జలశాఖ*



Sthanka_FebBW.indd 25 01/02/11 10:14 PM

# మహనీయుల చతురోక్తులు

*– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి*

## కరుణశ్రీ గారింట్లో కిడ్నేప్!

**కరుణశ్రీ అన్వర్థ నామధేయులైన శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు ఎంత సరళ స్వభావులో మధుర మంజుభాషణా విశారదులో, అంత చతుర వచో విలాసులు కూడా. తరచు కాకపోయినా, అప్పుడప్పుడు చమత్కారంగా మాట్లాడేవారు.**

చాలాకాలం క్రితం సంగతి.

వాళ్ళ అబ్బాయి బాపూజీ అనుకుంటా -చంటివాడిగా వున్నప్పటి మాట.

ఓ రోజు పేరడీకింగ్‌గా పేరు వడసిన జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారనబడే జరుక్‌శాస్త్రిగారు, ఊళ్ళోంచి వెడుతున్నాం కదా అని పాపయ్యశాస్త్రి గారిని చూడ్డానికి వెళ్ళారు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఇంట్లో మనుష్యులు చప్పుళ్ళు చెయ్యకుండా మరబొమ్మల్లా కదులుతూ ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. పాపయ్యశాస్త్రి గారేమో గంభీరంగా కూర్చున్నారు. జరుక్ శాస్త్రి గారిని చూసి 'రండి -కూర్చోండి' అని కళ్ళతోటే సంజ్ఞచేసి చెప్పారు.

జరుక్‌శాస్త్రిగారు ఏదో అనబోతే 'ఉష్' అంటూ పెదిమలకి వేలు అడ్డం పెట్టి 'శబ్దం చెయ్యకండి' అన్నట్లు సూచించారు. జరుక్‌శాస్త్రిగారు దగ్గరగా వెళ్ళి చెవిలో నెమ్మదిగా "ఏమిటి? ఏం జరిగింది?" అని కంగారుగా అడిగారు.

పాపయ్యశాస్త్రిగారు నెమ్మదిగా, గంభీరంగా 'కిడ్నేప్' అన్నారు.

"ఆ!" అని జరుక్ శాస్త్రిగారు "ఎవరిని? ఎప్పుడు?" అని ఆదుర్దాగా అరవబోయారు.

వెంటనే పాపయ్య శాస్త్రిగారు "గట్టిగా అరవకండి. కిడ్నేప్ అంటే ఎవరినీ ఎత్తుకెపోలేదు. కిడ్ అంటే మా పిల్లవాడు, నేప్ అంటే కునుకుతీస్తున్నాడు. అంతే" అంటూ చిన్నగా నవ్వారు. పాపయ్యశాస్త్రిగారి ఆ ఆంగ్లభాషా చమత్కారం గురించి జరుక్ శాస్త్రి,గారు, ఎన్నిమార్లు మిత్రులకి చెప్పి నవ్వారో లెక్కలేదు.

## కవిత్వానికి కలికితురాయి పెట్టిన కంపోజిటర్

**ప్రఖ్యాత కవి శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు, అమరావతి ఉద్యోగం విడిచిపెట్టి, గుంటూరు ఎ.సి. కాలేజిలో పండిట్‌గా జేరిన రోజులు... ఆయనతో బాటు అక్కడ తెలుగు డిపార్ట్‌మెంట్‌లో డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులుగారు పనిచేస్తున్నారు.**

ఇద్దరూ ఆప్తమిత్రులు, అంతేకాక, నూనూగు మీసాల నూత్నయౌవనంలో వుండి, అటు జాషువా, ఇటు దువ్వూరి రామిరెడ్డి కవిత్వాలకి దీటుగా కవిత్వం రాస్తూ, సర్ సి.ఆర్. రెడ్డిగారి నుండి Neo-Classists అని మెచ్చుకోలు తెచ్చుకున్న దిట్టలు. అప్పటికే, ఒకరికి ఉదయశ్రీ, మరియొకరి తారాతోరణం, వందయేళ్ళకి సరిపడ్డ కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. వయస్సులో వున్నారేమో, మన పుస్తకాల్లో అచ్చు తప్పు రాకూడదని ప్రతిన బట్టారు. కరుణశ్రీగారి విజయ శ్రీ, నండూరి వారి అజ్ఞాత కౌంతేయం అచ్చు అవుతున్నాయి. ప్రూఫ్‌లు వచ్చాయి.

కుంతిని కర్ణుడు ఓదారుస్తూ "అమ్మా, రేపటి కురుక్షేత్ర సంగ్రామంలో యోధులు ఇద్దరే. ఒకటి - నేను, రెండు-అర్జునుడు. ఈ ఇద్దరం నీ పుత్రులమే" అనే సందర్భంలో ఓ పద్యం వుంది. చివరి పాదం కంపోజింగ్‌లో కంపోజిటర్ చిన్న పొరబాటు చేశాడు.

"వీరలిద్దరు నీ తనయులైరి" అని కంపోజ్ చెయ్యడానికి బదులు "వీరు లిద్దరును నీ తనయులైరి" అని కంపోజ్ చేశాడు.

ఈ కవులిద్దరూ అది చూసుకోకుండా స్టైక్ ఆర్డరు ఇచ్చారు. తర్వాత చూసుకున్నారు. అయ్యో మన ప్రతిజ్ఞ పోయిందే అని తలలు పట్టుకున్నారు. తర్వాత మళ్ళీ ఒకమారు నిదానించి చూశారు. ఎగిరి గంతేశారు. "శాస్త్రిగారూ! 'వీరలు' కంటే 'వీరులు' అర్థవంతంగా వుందండీ! మన కవిత్వానికి కంపోజిటర్ కలికితురాయి పెట్టాడు. ఓ శాలువా పట్రండి. ప్రెస్ కెళ్ళి ఆ కంపోజిటర్‌ని సన్మానిద్దాం" అంటూ హర్షంతో ఓ కేక పెట్టారు నండూరివారు.

## మా యింటి పేరే 'టీ'

**నిండుగా తొంభైయేళ్ళు సార్థక జీవనం సాగించి, మధుర గంభీర కావ్య మంజీరాల్ని ఆంధ్ర సరస్వతికి కైసేసి, అచ్చపు తెనుగు పూలతో సాహితీ సమార్చన సాగించి 21-3-1990న కన్ను మూసిన కవితా కృషీవలుడు శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారు మితభాషీ, సరస మృదు భాషణాచతురుడూను. సన్నగా కనిపించీ కనిపించని చిరునవ్వు వెన్నెలతో ఓ చిన్న ఛలోక్తిని మాట మధ్యలో తళుక్కుమని మెరిపించడం, ఆయన మాట్లాడే తీరులో ఓ సొగసు.**

అప్పికట్ల నుంచి బాపట్ల వస్తే, మధ్యలో ఖాళీ చేసుకుని మా ఇంటికి వచ్చి 'ఎలా ఉన్నారు సాహితీ దంపతులు?' అని నన్నూ, రాజ్యలక్ష్మీనీ పలకరించి వెళ్ళడం ఆయన సౌజన్యానికి ఒక తార్కాణం.

అప్పుడప్పుడు మంచి ఎండలో వచ్చేవారు. "ఎండలో శ్రమపడి వచ్చారు కబురు చేస్తే నేనే వచ్చేవాడిని కదా" అంటే, తెల్లని గుబురు మీసాల వెనక నుంచి అంతకంటే తెల్లని చిరునవ్వు చిందిస్తూ,

'అప్పికట్లకి బాపట్ల ఐదు మైళ్ళు'

అంటూ ఓ పద్యపాదం, అలవోకగా అనేవారు.

సాధారణంగా టీ, కాఫీలు ఆయన పుచ్చుకునేవారుకాదు.

"కాదూ కూడదు, మీరు ఏదో ఒకటి తీసుకోవాలి. కాఫీ పెట్టమంటారా టీ పెట్టమంటారా?" అని ఓ మారు రాజ్యలక్ష్మి గట్టిగా పట్టుబట్టినప్పుడు, ఆయన కొంచెం సేపు ఆగి, తర్వాత తన సహజమైన పద్ధతిలో పెదిమలు విడీ విడకుండా నవ్వి "సరే కానివ్వండి - మా యింటి పేరే 'టీ' కదా - అదే పుచ్చుకుంటే 'టీ' కి 'టీ' సరిపోయి పెద్ద గడబిడ లేకుండా సర్దుకుపోతుంది" అన్నారు. అంతలో ఆగకుండా "నయం, నన్ను ఒక టీతో పోనిచ్చారు. టీ. టీ. కృష్ణమాచార్యులు వారు వస్తే రెండు టీలు త్రాగవలసి వచ్చేది" అన్నారు. ఉళ్ళో ఉన్న మరో సాహితీ మిత్రుని తలచుకొని అందరికీ నవ్వుతో 'టీ' పాలమారింది.

☆



Sthanka_FebBW.indd 12 01/02/11 10:14 PM



**స్వామి వివేకానంద 19వ శతాబ్దం చివరి దశకంలో ప్రస్తావించిన ఎన్నో విషయాలు నేటి ఆధునిక దేశ పరిస్థితులకు కూడా వర్తిస్తాయని నిస్సందేహంగా చెప్పకోవచ్చు. ఉదాహరణకు పతనమవుతున్న నైతిక విలువల గురించీ, యువతలో నైతిక విలువలను పెంపొందించడం గురించి ఆయన అనేక చోట్ల చేసిన ప్రసంగాల్లో చెప్పిన మాటలను ప్రముఖంగా చెప్పకోవాలి.**

ప్రభుత్వం అందించే సహాయంగానీ, సేవలు గానీ వారికి అరకొరగానే లభిస్తున్నాయి. అవినీతి జడలు విప్పి చివరకు తినే ఆహారం, మందుల్లో సైతం కల్తీ చేస్తున్నారు.

'ఇంతింతై వటుడింతై...' అన్నట్టు ఈ అవినీతి జాఢ్యం రక్షణ శాఖ మొదలు న్యాయవ్యవస్థ వరకు అన్ని ప్రభుత్వ శాఖలనూ పట్టి పీడిస్తోంది. నేడున్న పరిస్థితులు వివేకానందుడు జీవించి ఉన్న కాలంలో లేనప్పటికీ, దిగజారే మానవవిలువలకు అడ్డుకట్ట వేయాల్సింది యువకులేనని ఆయన ఆనాడే ప్రబోధించాడు. అందుకే, యువకులు నైతికంగా, మానసింకంగా, శారీరకంగా బలమైన వారిగా

# మరో వివేకానందుడు కావాలిప్పుడు...

ముఖ్యంగా దేశాధినేతలుగా, ప్రజా నాయకులుగా చెలామణి అయ్యేవారిలో నైతిక విలువలు అధ:పాతాళానికి దిగజారడంతో అవినీతి దేశమంతటా విలయతాండవం చేస్తోంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ మన దేశంలో సేకరించిన లెక్కల ప్రకారం ఏటా వెయ్యి కోట్ల రూపాయలు లంచాల రూపంలో చేతులు మారినట్లు అంచనా.

ప్రజానాయకులు, అధికారులు తిన్న లంచాలలో మూడో వంతు (దాదాపు రూ. 300 కోట్లకు పైగా) దారిద్ర్యరేఖకు దిగువనున్న నిరుపేదలు చెల్లించినవే అంటే మరింత ఆశ్చర్యం కలుగక మానదు. ఈ నిరుపేద వర్గాల వారు అంత సొమ్మును అధికారులకూ, ప్రజానాయకులకూ లంచాలుగా చెల్లించినా, తయారవ్వాలనీ, వారు మాత్రమే దేశానికి దిశానిర్దేశనం చేయగలరని వివేకానందుడు చెప్పాడు. ''యువకుల నైతిక, మానసిక బలమే ప్రపంచంలో రుగ్మతలన్నింటికీ మందు'' అని కూడా పలుమార్లు ఆయన ప్రసంగాల్లో చెప్పేవారు.

### శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల ద్వారానే ప్రగతి

భారతదేశం ఎన్నో రంగాలలో అభివృద్ధి సాధిస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతున్నా, పేదరికాన్ని రూపుమాపడంలో మన నేతలు హోరంగా విఫలమయ్యారు. దేశప్రజల్లో ఇంకా 65 శాతం మంది

## జాతీయ యువజనోత్సవం - నెహ్రూ యువకేంద్రం

స్వామి వివేకానంద జన్మించిన జనవరి 12వ తేదీని ''జాతీయ యువజన దినం''గా పాటించాలని కేంద్ర ప్రభుత్వం 1984లో ప్రకటించింది. దాదాపు పదేళ్ల తర్వాత, నెహ్రూ యువకేంద్ర సంఘటన, జాతీయ సేవా పథకం (ఎన్నెసెస్) వంటి ప్రభుత్వ అనుబంధ సంస్థలతో కలిసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవం జరుపుకోవడం ప్రారంభమైంది.

ఏటా యువజనోత్సవం జరుపుకోవడం ద్వారా జాతీయసమైక్యత, మతసామరస్యం, సోదరభావం, ధైర్యసాహసాలను యువతలో ప్రచారం చేయాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమాల మాదిరిగానే, రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిల్లో కూడా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

ఈ కార్యక్రమాలు యువతలో ఉన్న సాంస్కృతిక, ప్రతిభా పాటవాలు ప్రదర్శించుకోవటానికి వేదికగా ఉపయోగపడుతున్నాయి.

నెహ్రూ యువకేంద్రాల ద్వారా అనేక చోట్ల వృత్తినైపుణ్యం పెంచుకొనే శిక్షణ కార్యక్రమాలలో, సామాజిక రంగ కార్యక్రమాల్లో యువజనులకు శిక్షణనిస్తున్నారు. వివేకానంద ఆదర్శాల ప్రాతిపదికగా యువజన, స్పోర్ట్సు క్లబ్‌లకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అవార్డులనిచ్చి ప్రోత్సాహిస్తున్నారు. కూడా.

కొన్ని జిల్లాలలో శ్రమదానం, రక్తదానం వంటి కార్య క్రమాలను యువకులు చేపడుతున్నారు. యువజనోత్సవం సందర్భంగా సాంస్కృతిక, కళా కౌశల్యాలను వెలికి తీసే ప్రయత్నాల ను కూడా నెహ్రూ యువ కేంద్రం చేపడుతోంది. ట్రెక్కింగ్ వంటి సాహస క్రీడల్లో యువజనులకు శిక్షణా శిబిరాలనుకూడా అనేక చోట్ల నిర్వహిస్తున్నారు.



Sthanka_FebBW.indd 16 01/02/11 10:14 PM

దారిద్ర్యంలో మగ్గుతూనే ఉన్నారు. స్వామీజీ గ్రామాల్లో పర్యటించి పేదరికాన్ని కళ్లారా చూసి చలించిపోయారు. దేశ సంపదను కొల్లగొడుతున్న బ్రిటిష్ పాలకులపై ఆయన ఎంత ద్వేషభావాన్ని పెంచుకొన్నారో, సాటి భారతీయుల దీనస్థితిని గమనించకుండా, స్వార్ధపరత్వంతో సంపన్నులైన ఉన్నత వర్గాల వారిపట్ల కూడా ఆయన అంతే ద్వేషభావాన్ని ప్రకటించారు. అదే ఉద్దేశ్యంతో ఆయన చనిపోవడానికి ముందు కొన్నేళ్లు సంపన్నుల సాహచర్యాన్ని కూడా నిరాకరించారు.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల ద్వారానే పేదరికాన్ని నిర్మూలించ గలమని ఆయన ప్రగాఢ విశ్వాసం. భారతదేశం పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకొని పారిశ్రామిక విప్లవాన్ని సాధించాలని ఆయన యువకులకు ప్రబోధించారు. కొన్ని దేశాలు శాస్త్రసాంకేతిక విజ్ఞానాల ద్వారా పేదరిక సమస్యను ఎలా అధిగమించాయో ఆయన స్వయంగా చూశారు. జపాన్ అదే మార్గంలో నడిచి అభివృద్ధి సాధించిన విషయాన్ని అనేకసార్లు తన ప్రసంగాలలో ప్రస్తావించేవారు.

### స్త్రీల పట్ల వివక్షపై....

రోజూ ఉదయం వార్తా పత్రిక తెరవగానే, వరకట్న వేధింపులు, మహిళలపై అత్యాచారాలు, స్త్రీల హత్యలు వంటి వార్తలు మన మనస్సులను వికలం చేస్తూ ఉంటాయి. స్వామి వివేకానంద 19వ శతాబ్దంలోనే స్త్రీ జనోద్ధరణపై చేసిన వ్యాఖ్యానాలు ఇప్పటికీ వర్తిసాయనడంలో సందేహం లేదు. భారతదేశానికి ఏదైనా మంచి జరగాలంటే స్త్రీ జనోద్ధరణ, జనచైతన్యం జరిగి తీరాలి. స్త్రీలకు సముచిత గౌరవ స్థానం ఇవ్వడం వల్లనే ప్రపంచ జాతులు అనేకం ఔన్నత్యాన్ని సాధించాయి. ఏ దేశమైతే స్త్రీలను గౌరవించదో ఆదేశం ఉచ్ఛస్థితిని పొందలేదని ఆయన అప్పుడే చెప్పారు. స్త్రీ జాతి వివక్షకు గురవుతున్నారని ఆ కాలంలో చెప్పిన మొట్టమొదటి వేదాంతి వివేకానంద మాత్రమే. అమెరికాలో స్త్రీలు ఉచిత స్థాయిలో గౌరవాన్ని పొందుతారు. అందువల్ల అక్కడ స్త్రీలు విజ్ఞానవంతులై, పూర్తి స్వేచ్ఛను అనుభవిస్తారు. మనదేశంలో దానికి విరుద్ధంగా, స్త్రీలు దాస్యంలో జీవచ్ఛవాలుగా మగ్గుతున్నారు.

ప్రపంచ దేశాల్లో మనం వెనుకబడి ఉండటానికి కారణం స్త్రీ శక్తికి సముచితస్థానం ఇవ్వలేకపోవడమేనని స్వామి అనేకసార్లు తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. ప్రస్తుతం మన దేశంలో లక్షలాదిమంది యువతులు విద్యా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తున్నా, కోట్లాది మంది ఇంకా పురుష దురహంకార, దాస్యశృంఖలాలలో మగ్గుతున్నారనేది నిర్వివాదాంశం.

### విద్య గురించి ....

దేశంలో కొన్ని శతాబ్దాలుగా శ్రమజీవులు నిర్లక్ష్యానికి గురయ్యారు. విద్య వారికి అందుబాటులో లేకుండాపోయింది. అందుకని వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకత ఉంది. పేద విద్యార్థులకు ఉచిత విద్యా సౌకర్యం సమకూర్చడం మాత్రమే కాకుండా ఉచిత విద్యతో పాటు వారికి మరికొన్ని ఉత్పాదకాలు సమకూర్చాలని వివేకానందుడు ఆనాడే చెప్పాడు. విద్యకు స్వామిజీ విశేష ప్రాధాన్యాన్నిచ్చారు. దేశ సమస్య లన్నింటికీ విద్య సర్వరోగ నివారణ కాగలదని ఆయన భావించారు. విద్య అనేది పుస్తక పఠనం, పరీక్షల్లో ఉత్తీర్ణత, డిగ్రీ సర్టిఫికెట్లు సంపాదించడమే కాదు. విద్య అర్థవంతంగా ఉండి వ్యక్తిత్వాన్ని ప్రసాదించాలి. మనిషిని సద్గుణ సంపన్నునిగా తీర్చిదిద్దాలని ఆయన ఉద్బోధించారు. పాశ్చాత్య విజ్ఞాన పరిపక్వతను భారతదేశ ఆదర్శాలతో మేళవింపజేసిన నూతన విద్యావిధానం మనకుండాలని ఆయన వాంఛించారు.

### యువనాయకత్వానికి వివేకానంద సందేశం

యువకుల మీదా, వారి ఆధునికత మీదా స్వామీజీకి ఎనలేని విశ్వాసం ఉండేది. సమస్యలను సింహబలులై ఎదుర్కొనే శక్తిని వారు కలిగి ఉంటారు. యువకులకు కావలసింది మూడే విషయాలు 1. ప్రేమ, 2. నిజాయితీ 3. సహనం.

జీవితమంటే అభ్యున్నతి లేదా విస్తరణ లేదా ప్రేమ. ప్రేమమయయే జీవితం. అదే జీవిత పరమార్థం. స్వార్థపరత్వమే మరణం. ఇది ఇప్పటికే కాదు ఎప్పటికైనా సత్యమే. మనకు భావిలేదనుకున్నా, ఇతరులకు మంచి చేయడమే జీవితం. హాని చేయడం మరణంతో సమానం. నిరుపేదల కొరకు, అమాయక ప్రజల కొరకు, అణచివేతకు గురైన వారికోసం సానుభూతితో స్పందించండి. దానివల్ల మీకు అజేయమైన శక్తి సామర్థ్యాలు, సహకారం సమకూరుతాయి.




అలాగే పిరికితనాన్ని విడనాడండి. ధైర్యంగా ఎదుర్కొంటే దేన్నైనా సాధించవచ్చు. సంపద వల్ల ప్రయోజనం లేదు. పేరు, కీర్తితో మనకు పనిలేదు. కానీ ప్రేమ అమూల్యమైనది. ప్రధానంగా నడతను నమ్ముకోండి. అదే దుర్భేద్యమైన కష్టాల నే గోడలను కూడా ఛేదించి ప్రవేశాన్ని సాధించ గలుగుతుంది. నూతన భారతదేశం ఉద్భవించడానికి యువతే పూనుకోవాలని స్వామీజి మనందరికీ ఇచ్చిన సందేశం. అది యువకులందరికీ శిరోధార్యం కావాలి.

*- కె.ఎస్. రెడ్డి*




Sthanka_FebBW.indd 17 01/02/11 10:14 PM

# గ్రామసభే గ్రామ స్థాయి పార్లమెంట్

**గ్రామసభ - గ్రామీణాభివృద్ధి-1**



వి కేంద్రీకృత ప్రజాస్వామ్యమంటేనే విధాన నిర్ణయాంలో ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి ఫలాలను సమానంగా పంచుకోవడం అని నడుస్తున్న చరిత్ర చెప్తుంది. అయితే విధాన నిర్ణయంలో ప్రజలకు భాగస్వామ్యం, అభివృద్ధి ఫలాలను సమానంగా పంచుకోవడంలోనే అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలు ప్రధానంగా చారిత్రక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, అంశాలకు సంబంధించినవి. ఇటువంటి సమస్యలను అధిగమించేందుకు భారతదేశ చరిత్ర పొడవునా అనేక సామాజిక, రాజకీయ ఉద్యమాలు జరిగాయి. ఇటువంటి ఉద్యమాలకు స్పందిస్తూ సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రభుత్వ విధానాలను ప్రకటిస్తుంది. ఇటువంటి సామాజిక వైరుధ్యాలు, రాజకీయ సంక్షోభం నుండి పుట్టుకొచ్చిందే గ్రామ సభ.

గ్రామ సభలంటే పటణాలలో, నగరాలలో వున్న వారికి అదో అర్థంకాని జడ పదార్థంలాగ వుంటుంది. నిజానికి గ్రామ సభ అంటే; పార్లమెంట్, రాష్ట్రస్థాయి శాసనసభ ఎంత ప్రాధాన్యత సంతరించుకున్నాయో, అంతటి ప్రాధాన్యాన్ని సంతరించుకున్న రాజ్యాంగ బద్ధమైన సభ. దేశ పార్లమెంట్, రాష్ట్రస్థాయి శాసనసభలు ప్రజలచేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులతో నడిస్తే, గ్రామసభ గ్రామ పంచాయితీకి ఎన్నుకోబడిన ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొని తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించి విధాన నిర్ణయాలకు తోడ్పడేదే గ్రామసభ.

గ్రామసభకు సంబంధించి ఒక్కసారి వెనుతిరిగి భారతదేశ చరిత్రలోకి చూస్తే, ఇదేమీ ఈ దేశ ప్రజలకు క్రొత్త కాదు అని తెలుస్తుంది. సుప్రసిద్ధ ప్రాచీన భారతదేశ చరిత్రకారులైన రొమిల్లా థాపర్ (Romilla Thaper) రాసిన తరతరాల భారత దేశ చరిత్ర (A History of India), ఎ.యల్. భాష్యం' రాసిన వండర్ దట్ వాజ్ ఇండియా' (Wonder that was India), డాక్టర్ కె.బాలగోపాల్ అనువదించిన 'ప్రాచీన భారతదేశ చరిత్ర, డి.డి. కోశాంబి పరిచయ వ్యాసాలు' అనే పుస్తకాలలో ప్రాచీనకాలంలో 'సభా', 'సమితి' అనే రెండు సంస్థలు గ్రామ స్థాయిలో పనిచేసినట్లు ఆధారాలతో నిరూపించారు.

అయితే ఈ సంస్థలు మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా మార్పుచెందాయి. మధ్యయుగ భూస్వామ్య రాజరిక వ్యవస్థలో మరుగున పడినట్లు సుప్రసిద్ధ చరిత్రకారులు సతీష్ చంద్ర, ఇర్ఫాన్ హబీబ్ విశ్లేషించారు. అదే విధంగా బ్రిటిష్ సామ్రాజ్యవాద వలస పాలకుల కాలంలో స్థానిక సంస్థలను విదేశీ పాలకుల ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్టు చరిత్రకారులు బిపిన్‌చంద్ర, సుమిత్ సర్కార్ వంటివారు విమర్శనాత్మక విశ్లేషణ చేశారు.

భారత జాతీయోద్యమాన్ని గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకు తీసుకుని వెళ్తున్న క్రమంలోనే జాతిపిత మహాత్మగాంధీ 'గ్రామ స్వరాజ్యాన్ని' ప్రవచించాడు. స్వాతంత్రానంతరం గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం నిజమవ్వాలంటే 'గ్రామ సభ నుంచి లోక్‌సభ వరకు అవినాభావ సంబంధం వుండాలని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రి వర్గంలో తొలి సాముదాయక అభివృద్ధి శాఖమంత్రి శ్రీ యస్.కె డే (S.K Dey) అన్నారు.

స్వాతంత్రాననంతరం అనుసరించిన అభివృద్ధి విధానాలవల్ల, ముఖ్యంగా భూసంస్కరణలు, హరిత విప్లవం, తరతరాలుగా వ్యవసాయ కార్మికులుగా పనిచేస్తున్న వారు కౌలుదార్లుగా, చిన్న సన్నకారు రైతాంగంగా తయారవడం వల్ల గ్రామ రాజకీయాలలో 1970వ దశకం నుంచి మౌలిక మార్పులు రావడం ప్రారంభమైంది. గ్రామ పంచాయితీ స్థాయి రాజకీయాలలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయాధికారాలు ఏమిటో తెలిసి వచ్చింది. స్థానిక రాజకీయాలలో నూతన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం చారిత్రక అనివార్యం అవ్వడం ఒక కారణం కాగా, రెండవది స్వాతంత్రం వచ్చిన నాటి నుండి



SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 2/1/2011, 8:33 PM

పంచాయితీరాజ్ సంస్థలను బలోపేతం చేయాలని గాంధేయవాదులు, ప్రజాస్వామిక వాదులు చేసిన కృషి ఫలితంగా బల్వంత్‌రాయ్ మెహతా, అశోక్ మెహతా వంటి వారు చేసిన సిఫారసులు కాగా, మూడవది 70 ఏళ్ళకుపైగా సామ్యవాదం పేరుతో సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా దేశాలలో కేంద్రీకృత ప్రణాళిక ఆర్థికవ్యవస్థ కుప్పకూలడం వల్ల భారతదేశంలో అధికార వికేంద్రీకరణ జరగడం చారిత్రక అవశ్యకమైంది.

తత్ఫలితంగా 73,74 వ రాజ్యాంగ సవరణ జరిగి 'గ్రామసభ'కు రాజ్యాంగ బద్ధత కల్పించబడింది. అందువల్ల ప్రస్తుతం 'గ్రామసభ' రాజ్యాంగంలో అంతర్భాగం.

రాజ్యాంగంలో అంతర్భాగమైన గ్రామసభను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయితీ రాజ్ చట్టాన్ని తెచ్చి 'చట్టసభ' హోదాను




ఇచ్చాయి. గ్రామ సభకు రాజ్యాంగ హోదా కల్పించడంలో వున్న ముఖ్య ఉద్దేశ్యం బహుముఖమైంది. ఈ విషయాన్ని క్రింది పటం ద్వారా తెలుసుకోవచ్చు.

గ్రామసభ ఆయా గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రజలను సమీకరించి స్థానిక స్వపరిపాలన, జీవనోపాధులు, వైద్యం, ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం, వ్యవసాయం, సహకార సంఘాలు, చేతివృత్తులు, గ్రామీణాభివృద్ధి, త్రాగు, సాగునీరు, వీధిలైట్లు, మురికి కాల్వలు, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు చేపట్టిన క్రింద వివరించిన కార్యక్రమాలు సక్రమంగా అమలు అయ్యే విధంగా చూడడం.

1. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
2. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్,
3. సర్వశిక్ష అభియాన్,
4. మధ్యాహ్న భోజన పథకం
5. సమికృత శిశు అభివృద్ధి పథకం
6. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి
7. సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమం.
8. జాతీయ గ్రామీణ నీటి సరఫరా పథకం
9. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన.
10. జాతీయ వృద్ధాప్య ఫింఛనులు
11. ఆహార భద్రత
12. రాబోయే జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్,
13. ఇందిరా అవాస్ యోజన.
14. రాష్ట్రీయ కృషి వికాస యోజన (RKVY) వంటి కార్యక్రమాలను అమలు చేయడంలో 'గ్రామ సభ' దే కీలకపాత్ర అని చెప్పినప్పటికీ, ఆచరణలో గ్రామ సభ ఈ క్రింది విధంగా కన్పిస్తుంది.

1. గ్రామసభ తీసుకునే నిర్ణయాలను సంపూర్ణంగా అమలు చేయిడం.

2. కొన్ని గ్రామ పంచాయితీలలో గ్రామ సభ జరుగుతుంది, కాని నిర్ణయాలు అమలు కావు.

3. మరి కొన్ని చోట్ల గ్రామ సభ సర్పంచ్ ఇంట్లో జరిపినట్లు కేవలం సంతకాలు తీసుకోవడం

4. అసలు గ్రామ సభ జరగక పోవడం.

ఇందుకు అనేక కారణాలు వున్నాయి. ఒకటి - గ్రామ సభ తీసుకున్న నిర్ణయాలను అమలుచేసేందుకు నిధులు లేకపోవడం; కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాల ద్వారా వచ్చిన నిధులతో ప్రభుత్వ యంత్రాంగం(LineDepartment) 'గ్రామ సభకు సంబంధం లేకుండా అమలుచేయడం. రెండు - సంబంధిత ప్రభుత్వాధికారులు గ్రామ సభను జరిపించేందుకు చొరవ తీసుకొనకపోవడం. మూడు 'గ్రామ సభ' స్వయంగా నిర్ణయాలు తీసుకుంటే వాటిని అమలు చేసేందుకు నిధులు లేవని ప్రజలకు తెలుసు కాబట్టి 'గ్రామ సభ'కు హాజరైనా తమ సమస్యలు పరిష్కారంకావు అని దూరంగా వుండడం వల్ల రాజ్యాంగ సవరణ జరిగి సుమారు రెండు దశాబ్దాలు కావస్తున్నా 'గ్రామ సభ' ప్రజలకు దగ్గరకు చేరలేక పోతోంది. గ్రామ ప్రజలకు అవసరమైన నిర్ణయాలను తీసుకొనలేక పోతోంది. గ్రామ సభ తీసుకున్న నిర్ణయాలను అమలుచేయకలిగిన శక్తి సామర్ధ్యాలు, వనరులు గ్రామ పంచాయితీలకు వుండి వుంటే బహుశ దేశంలో రైతుల ఆత్మహత్యలు, నేత కార్మికులు ఆత్మహత్యలు జరిగి వుండేవి కావు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇంత సంక్షోభంలో వుండేది కాదు.

అయితే చీకటిని తట్టుకుంటూ కృంగిపోవడం కన్న 'చిరుదీపం' వెలిగించడం మంచిదన్న సూక్తి ఉత్తేజంతో దేశంలో అనేక ప్రాంతాలలో గ్రామ సభలు నిజంగా మహాత్మాగాంధీ ఆశించిన 'గ్రామ స్వరాజ్' ఆశయంతో పనిచేస్తున్నాయి. ఇటువంటి గ్రామ సభలను గురించి తెలుసుకోవలసింది చాలా వుంది. ఇటువంటి గ్రామ సభలను వచ్చే వ్యాసంలో చర్చిద్దాం.

***- డాక్టర్. ఇ. వెంకటేశు***

అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్.ఐ.ఆర్.డి.



SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 20 2/1/2011, 8:33 PM



# రాష్ట్ర స్థాయి అప్నా సమీక్షా సమావేశం

**మ**హాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలుచేయటానికి పౌర సమాజాన్ని కూడా పథకంలో భాగస్వాములను చేసే ఉద్దేశ్యంతో 'అప్నా' స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని  రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు.  రాష్ట్ర వ్యాప్తంగా 330 ప్రభుత్వేతర సంస్థలను గుర్తించి 703 మండలాలలో పథకం అమలులో భాగస్వామ్యములను చేయటం జరిగిందని చెప్పారు. జనవరి 29న జరిగిన రాష్ట్ర స్థాయి అప్నా సమావేశంలో పాల్గొన్న శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 17 నుండి ఉపాధి హామీ పనుల ప్రారంభానికి అన్ని చర్యలు తీసుకొన్నామని, అప్నా ప్రతినిధుల సహాయంతో శ్రమశక్తి సంఘాల ఏర్పాటును కూడా పూర్తి చేసామని అన్నారు.  శ్రమశక్తి సంఘాలకు పనుల కేటాయింపు కూడా క్షేత్ర స్థాయిలో మొదలయిందనీ, అయితే అర్హత ఉండీ శ్రమ శక్తి సంఘాలలో సభ్యులుని వారి వివరాలు వెంటనే కంప్యూటరైజ్ చేయాలని అన్నారు. అర్హత కలిగి శ్రమశక్తి  సంఘాలలోకి రాని వారికి కూడా చట్టరీత్యా పని కల్పించాల్సిన అవసరం ఉన్న దృష్ట్యా వీరికి పని కల్పించటానికి ఏ విధమైన పద్ధతులను పాటించాలి అన్న విషయం మీద ఆయన వివరణ ఇచ్చారు.  అపార్డ్ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ రాబోయే 3 సంవత్సరాలలో యస్.సి./యస్.టి. మరియు పేద రైతుల భూములను సుస్థిర పద్ధతులలో వ్యవసాయ యోగ్యంగా  మార్చటానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించబడినందున, రాబోయే కాలంలో ఉపాధి కోరిన వారికి పని కల్పించలేదన్న అపవాదు రాకుండా, పథకాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు అయ్యేలా చూడాలని అప్నా ప్రతినిధులను కోరారు.  గ్రామీణాభివృద్ధి కమీషనరు శ్రీమతి జయలక్ష్మి మాట్లాడుతూ శ్రమ శక్తి సంఘాలలోని శ్రామికులు తమ హక్కుల గూర్చి తాము తెలుసుకొనేలా అప్నా సంస్థలు కృషి చేయాలని కోరారు.  మన రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల పని తీరు దేశ వ్యాప్తంగా మన్ననలను అందుకుంటోందని, శ్రమశక్తి సంఘాలను కూడా అదే విధంగా బలోపేతం  చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా కల్పించబడిన పని హక్కును వినియోగించుకొని, జీవనోపాధులను మెరుగుపర్చుకొనే విధంగా ఈ శ్రమశక్తి సంఘాలను తీర్చి దిద్దాల్సి ఉందని అన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ సొసైటీ డైరెక్టర్ సౌమ్య కిడాంబి, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమీషనర్ శ్రీ ప్రసాద్ తదితరులు పాల్గొని పలు సూచనలు చేసారు. ☆





SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 2/1/2011, 8:33 PM

# గ్రామీణ ఆరోగ్య పథకం మరో ఐదేళ్ల పాటు అమలు

"గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రారంభించిన జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని (ఎన్ ఆర్ హెచ్ ఎం) 12వ పంచవర్ష ప్రణాళికలోనూ కొనసాగించనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి గులాంనబీ ఆజాద్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా మెరుగైన వైద్య సేవలతో పాటు వైద్య విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి కొత్త విధానాలతో "హైదరాబాద్ డిక్లరేషన్" వెల్లడించారు. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలంటే ఎన్ఆర్ హెచ్ఎంకు అధిక నిధులు కేటాయించాలని ప్రణాళిక సంఘాన్ని కోరామని తెలిపారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రాల వైద్య ఆరోగ్యశాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శుల జాతీయ సదస్సులో ఆజాద్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా బాగా వెనుకబడిన 100 జిల్లాల్లో క్యాన్సర్, మధుమేహం, గుండె జబ్బుల నియంత్రణ, నివారణ కోసం జాతీయ పథకాన్ని 21 రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని చెప్పారు. ఫలితాలు సమీక్షించి, 12వ ప్రణాళిక కాలంలో దేశవ్యాప్తంగా 650 జిల్లాల్లో ప్రారంభిస్తామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగు పరచడానికి 'జాతీయ పట్టణ ఆరోగ్య పథకం' అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## వచ్చే బడ్జెట్‌లో నిధుల పెంపే : సీ.ఎం

వైద్య రంగ ప్రాధాన్యం దృష్ట్యా 2011 - 12 బడ్జెట్లో గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ నిధులు ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రైవేటు ఆస్పత్రులకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందనే అపవాదు ఉన్నా, పేదవాడికి వైద్య సేవలు అందించాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని వెల్లడించారు.



## పల్లె వైద్యానికి ప్రత్యేక డిగ్రీ కోర్సు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య నిపుణుల కొరతను అధిగమించడానికి 'గ్రామీణ ఆరోగ్య సంరక్షణ' పేరుతో మూడున్నర సంవత్సరాల డిగ్రీ కోర్సు (బీఆర్‌హెచ్ సీ)ను త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తోంది. ఈ కోర్సు చేసిన అభ్యర్థులు ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న నర్సింగ్ సిబ్బంది స్థానంలో పని చేస్తారు. ఈ కోర్సు చదివి, ప్రభుత్వ సర్వీసులో పని చేసే వారికి భవిష్యత్‌లో ఎంబీబీఎస్ కోర్సు చదవడానికి ఇన్‌సర్వీసు కోటా కల్పించే అవకాశం ఉంది.

## బీఆర్‌హెచ్‌సీ కోర్సు వివరాలు

- గ్రామీణ ఆరోగ్య సంరక్షణ (బీఆర్‌హెచ్‌సీ) కోర్సు వ్యవధి మొత్తం మూడున్నరేళ్లు. మొదటి మూడేళ్లు వైద్య పాఠశాలలో వివిధ రకాల వ్యాధులు, ఆరోగ్య సంరక్షణ విధానాలు, రోగ చికిత్సపై పాఠాలు ఉంటాయి. ఆ తరువాత ఆరు నెలలు వివిధ స్థాయిల ఆస్పత్రుల్లో 'ఇంటర్న్‌షిప్' చేయాలి.
- ప్రతి జిల్లా ఆస్పత్రికి అనుబంధంగా ఒక వైద్య పాఠశాలకు అనుమతి. 300 పడకల సామర్థ్యం ఉన్న జిల్లా ఆస్పత్రికి అనుబంధంగా 50 సీట్లతో వైద్య పాఠశాలకు అనుమతి 300 పడకల కంటే తక్కువ ఉన్న చోట 25 మంది విద్యార్థులకు ప్రవేశం.
- మారుమూల జిల్లాలతో పాటు ప్రస్తుతం వైద్య కళాశాలలు లేని జిల్లాలకు ప్రాధాన్యం ఇస్తారు.
- భవన నిర్మాణాలు, బోధన సిబ్బందికి అవసరమైన నిధులను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తుంది.
- ఎంబీబీఎస్ అర్హతతో మూడేళ్ల అనుభవం ఉన్నవారిని 'ట్యూటర్'గా నియమిస్తారు.
- ఎండీ/ ఎంఎస్ అర్హత ఉన్న వైద్యాధికారులను లెక్చరర్‌గా తీసుకుంటారు. ఎనిమిదేళ్లు లెక్చరర్‌గా అనుభవం ఉన్నవారికి సీనియర్ లెక్చరర్‌గా పదోన్నతులు కల్పిస్తారు.
- సంబంధిత జిల్లాలో గ్రామీణానికి చెందినవారై ఉండాలి.
- భౌతిక, రసాయన, వృక్షశాస్త్రం, ఆంగ్లం అంశాలతో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి.
- ఈ కోర్సులో చేరే విద్యా సంవత్సరంలో డిసెంబరు నాటికి 17 సంవత్సరాల వయసు నిండాలి.

## హైదరాబాద్ డిక్లరేషన్

ఆరోగ్యమంత్రుల జాతీయ సదస్సులో హైదరాబాద్ డిక్లరేషన్ పేరిట విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. వైద్యుల కొరత, వైద్య విద్య, అంటు వ్యాధులు, మాతాశిశు సంరక్షణలో ఎదురవుతున్న సవాళ్లు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై సదస్సు కీలక తీర్మానాలు చేసింది కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి గులామ్‌నబీ అధ్యక్షతన ఈసదస్సు రెండురోజుల పాటు జరిగింది. 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మంత్రులు, కార్యదర్శులు ఇందులో పాల్గొని విస్తృతంగా చర్చించిన అనంతరం తీర్మానాలు చేశారు.

## ప్రైవేటు ఆసుపత్రుల నమోదు, నియంత్రణ చట్టం

ప్రతి రాష్ట్రం ప్రైవేటు ఆసుపత్రుల నమోదు నియంత్రణ చట్టం -



SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 2/1/2011, 8:33 PM

## ఎంబీబీఎస్ సీట్ల పెంపు

ప్రస్తుతం ఒక్కో ప్రభుత్వ వైద్యకళాశాలో ఉన్న ఎంబీబీఎస్ సీట్లు 100 - 150. వీటిని 250కి పెంచుతూ నిర్ణయం. ఇందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు కేంద్రం నుంచే ఆర్థిక సాయం.

- 12వ పంచవర్ష ప్రణాళికలో ప్రధాన కార్యక్రమంగా ప్రస్తుతం ఉన్న వైద్యకళాశాలల విస్తరణ, కొత్త కళాశాలల ఏర్పాటు. కళాశాలల స్థాయిని పెంచి పీజీ కోర్సులను చేపట్టేందుకు వీలు. వైద్య సేవలు అందుబాటులో లేని చోట కొత్త కళాశాలల ఏర్పాటుకు ప్రాధాన్యం.
- గ్రామీణ ప్రాంతాల్లో వైద్య నిపుణుల కొరతను అధిగమించడానికి 'గ్రామీణ ఆరోగ్య సంరక్షణ' పేరుతో మూడున్నర సంవత్సరాల డిగ్రీ కోర్సు (బీఆర్‌హెచ్‌సీ) పరిచయానికి ఏకగ్రీవ ఆమోదం.
- నర్సింగు సేవలకు అవసరమైన సిబ్బంది సంఖ్యను భారీ ఎత్తున పెంచేందుకు 2012 మార్చి నాటికి దేశవ్యాప్తంగా 150 నర్సింగు పాఠశాలల ప్రారంభం.

2010 అనుసరించాలి. అందులోని విధి విధానాలను తప్పనిసరిగా అమలు చేయాలి. ఇప్పటికీ ఎవరైనా అనుసరించని వారుంటే వారుంటే వెంటనే శాసనసభలో చట్టాన్ని ఆమోదించాలి.

### మాతాశిశు సంరక్షణ

- మాతాశిశు మరణాలను తగ్గించేందుకు వీలుగా సమగ్ర ప్రణాళికను అమలు చేయాలి. 2012 మార్చి 31 నాటికి ప్రతి ఆరోగ్య కేంద్రంలో విధిగా ఒక వైద్యుడు ఒక నర్సు ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో వసతులకు మొత్తం నిధుల్లో 70 శాతం కేటాయింపు.
- 2012 డిసెంబరు నాటికి అన్ని జిల్లా ఆసుపత్రుల్లో రక్తనిధి కేంద్రాలు, ప్రాంతీయ, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో రక్తం నిల్వ కేంద్రాలు. గర్భిణులకు పూర్తి ఉచితంగా ప్రసూతి సేవలు, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో శస్త్రచికిత్స గది, మానవ వనరులు, మందులు, పరికరాలను సమకూర్చాలి. నవజాతాశిశు కేంద్రాల ఏర్పాటు, సహాయకులకు ప్రత్యేక వసతి, నిపుణుల కొరతను నివారించేందుకు బహుళ సేవలందించేందుకు వైద్యుల నియామకాలు.

### అంటువ్యాధుల నివారణ

దోమలు కలుషిత నీటి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు. ఇందుకు జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద ఇచ్చే నిధుల వినియోగం.

- పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో భారీఎత్తున అవగాహన కల్పించేందుకు జాగరణ యాత్రలు.
- మలేరియాను ముందే గుర్తించి, సరైన చికిత్సపై దృష్టి సారించాలి. కొత్త ప్రాంతాల్లో విస్తరించకుండా ప్రతి సీజన్‌లోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఒరిస్సా, ఈశాన్య రాష్ట్రాల్లో సత్ఫలితాలనిచ్చిన దోమ తెరలను అన్ని రాష్ట్రాలకు సరఫరా చేయాలి. అంటు వ్యాధుల సత్వర నివారణకు అవసరమైన మందుల కోసం విస్తృత పరిశోధనలు నిర్వహించాలి.

### వయోజనుల కోసం....

- వయోజనుల ఆరోగ్య సంరక్షణ జాతీయ కార్యక్రమం (ఎన్‌పీహెచ్‌సీఈ)తో పాటు మధుమేహం, క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధుల నివారణకు కొత్తగా చేపట్టిన జాతీయ కార్యక్రమం దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో వెంటనే అమలు.
- అన్ని రాష్ట్రాల్లో జబ్బుల బారిన పడిన, నిర్లక్ష్యానికి గురైన వృద్ధుల కోసం ప్రత్యేక ఆశ్రమాలు, ఆసుపత్రులు. వృద్ధులకు సంభవించే థలసేమియా నివారణకు జాతీయ కార్యక్రమం.
- మధుమేహం, మానసిక ఒత్తిడితో బాధపడే 30 ఏళ్లు దాటిన వారందరి వివరాలు నమోదు. దేశవ్యాప్తంగా సంభవించే మరణాల్లో వ్యాధుల్లో 40 శాతం అంటువ్యాధులు కానివే అని తేలినందున వాటి నివారణకు 12వ పంచవర్ష ప్రణాళికలో ప్రత్యేక దృష్టి.

### జాతీయ మానసిక వైద్య విధానం

మానసిక రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నందున మానసిక వైద్యకోసం ప్రత్యేక విధానం. వైద్య కళాశాలల్లో కొత్తగా సైక్రియాట్రిక్ మెడిసిన్, నర్సింగ్, క్లినికల్ సైక్రాలజీ సెకియాట్రిక్ సామాజిక సేవ శాఖలు. మానసిక వైద్యంపై యుద్ధ ప్రాతిపదికన 11 ప్రతిభా కేంద్రాలు ఏర్పాటు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మానసిక వైద్యకేంద్రాల నవీకరణ. అన్ని సాధారణ ఆసుపత్రుల్లో మానసిక వైద్య విభాగాలు. దేశ వ్యాప్తంగా 450కి పైగా జిల్లాల్లో మానసిక వైద్య సేవల విస్తృతి.

### అంధత్వ నివారణ

నేత్రవ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమం. ప్రధాన ఆసుపత్రుల్లో నేత్ర వ్యాధులకు ఆపరేషన్ థియేటర్లు, నేత్రనిధి కేంద్రాల ఏర్పాటుకు, వైద్యుల శిక్షణకు కేంద్ర ప్రభుత్వ సాయం. ప్రాంతీయ నేత్ర విజ్ఞాన సంస్థల ఏర్పాటుకు పంచవర్ష ప్రణాళికలో నిధులు.

### ఔషధ నియంత్రణ

ఔషధ తనిఖీ ప్రయోగశాల నవీకరణ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టి. నకిలీ, ప్రాణాంతక మందుల నివారణకు ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటు. నకిలీ మందులను తయారు చేసే వారిపై కేసుల సత్వర విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు. జనరిక్ మందుల ప్రోత్సాహానికి కాలవ్యవధితో కూడిన కార్యక్రమం. అన్ని జిల్లాల్లో జనఔషధి దుకాణాలు. ఆహార భద్రత, నియంత్రణ చట్టం - 2006 పకడ్బందీగా అమలు. ఆహారకల్తీపై సమాచారం ఇచ్చే వారికి నజరానాలందించే పథకం అమలు.

**- టి. నర్మద**



SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 2/1/2011, 8:33 PM

# పగటి వేషగాళ్లు

**తెలుగులో వేషం వేయడమంటే భావించిన పాత్ర రూపానికి అనుగుణంగా అలంకరణ చేసుకోవడం. పగటివేషాలంటే అలా పురాణ ప్రబంధ పాత్రలను ధరించినవారు పగటిపూటనే గ్రామాలలో తాము ప్రదర్శించనున్న కథాంశాన్ని ఎన్నుకొని అభినయించడం. ఇది ప్రాచీనకాలంలో ఎంతో ప్రజాదరణ పొందిన కళ. పగటివేషాలు అనే మాటలోనే బహువచనం ఉంది. నలుగురు లేక అయిదుగురు ఒక పురాణ కథను ఎన్నుకొని వివిధ పాత్రలను అభినయిస్తూ ఇంటింటి ముందు మూడు నాలుగు రోజులదాకా ప్రదర్శిస్తారు. చివరిరోజున తాము ప్రదర్శించిన కథలో మొదటి రోజు వేసిన వేషాన్నో, లేక అర్ధనారీశ్వర వేషాన్నో ధరించి ఇంటింటికి తిరిగి డబ్బు, కానుకలు సేకరిస్తారు.**

చరిత్రలో బహురూపంగా ఈ ప్రక్రియ వర్ణించబడింది. ఒక్కరే నటించిన ప్రక్రియ చరిత్ర వాలకం కూడా ప్రాచీన కళారూపమే. కలాపంలోనూ చోడిగాని కలాపం వంటివి ప్రసిద్ధాలు, ఇవి పగటివేషాలకు సన్నిహిత కళలే. పూర్తిస్థాయి నాటక ప్రదర్శన వీలుగాని సందర్భాలలో ప్రాచీన కాలంనుంచి వృత్తికళాకారులు కొందరు జీవిక కోసం ఈ పగటి వేషాలను ప్రారంభించినట్లు పరిశోధకుల అభిప్రాయం.

పగటివేషగాళ్లు వాచక, సాత్వికాలకన్నా ఆహార్య ఆంగీకాలకే ప్రాధాన్యత ఇస్తారు. పగటివేషాల ప్రదర్శన వ్యయ ప్రయాసలు లేనిది. సౌకర్యంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు పాత్రలకు అనుగుణంగా వేషాలు మార్చడం, వాటికి అనుగుణంగా వాచికం మార్చడం వీరి నైపుణ్యానికి నిదర్శనాలు, ఇప్పటికీ గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉన్న కళాకారుల పగటివేషాలు జనాదరణను పొందుతున్నాయి. పగటి వేషాల్లో కూడా కూచిపూడిలో ప్రదర్శించేవి కళాత్మకంగా కూడా బాగా రాణిస్తున్నాయి.



ప్రతి కథాంశాన్ని ఒకేరంగంలో కుదించుకుంటారు. అదే ఇంటింటి ముందు ప్రదర్శిస్తారు. ఇంటిలోని వారే ప్రేక్షకులు, ఏ పాత్ర ధరించినా వారు పాత్రోచితం కాకుండా జనవినోదం కోసం హాస్య సంభాషణలను మధ్యన జోడిస్తారు. ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తారు. ఇవేకాక ప్రత్యేకంగా హాస్యం కోసం సోమయాజులు, సోమిదేవమ్మ అనే ఛాందస బ్రహ్మణ దంపతులు, దాష్టీకం పంతులు, పిసినారి కోమటి. రెడ్డి, భట్రాజు, గిర్దావర్ వంటి పాత్రలను అభినయిస్తూ వారి స్వరూప స్వభావాలను హాస్యస్ఫోరకంగా ప్రదర్శిస్తారు.

గ్రామాల్లో ప్రజలతోపాటు ఆయా పాత్రలకు సంబంధించిన వారు కూడా ఆనందించి పగటివేషాలవాళ్లకి కానుకలిస్తారు. ఈ పాత్రలను అభినయించేటప్పుడు వ్యంగ్యం వారి నటనకు జీవం పోస్తుంది. పురాణ పాత్రలలో అర్ధనారీశ్వర, శక్తి, భేతాళ పాత్రలలో కూడా వారు హాస్యాన్ని మేళవిస్తారు.

మొండి బండవాళ్ళు, సింగీ సింగడు వంటివి కూడా హాస్యప్రధానమైన ప్రదర్శనలే. పగటివేషాల ప్రదర్శనకు సంగీతం, నృత్యం, వాచికం, ధ్వన్యానుకరణ, అభినయనం వంటివి వన్నెతెచ్చే ప్రధానాంగాలు. హార్మోనిస్ట్, వాయిద్యకారులు వారి వెంట తిరుగుతూ వాద్యసహకారాన్ని అందిస్తారు. 13వ శతాబ్దికి చెందిన పాలకుర్తి సోమనాథుడు పండితారాధ్య

తెలంగాణా ప్రాంతంలో బహురూపులు లేక బైరూపులు, బుడిగజంగాలు వేసే పగటివేషాలు ప్రచారం పొందాయి. రాయలసీమలోని వేషాలు కూడా అక్కడి జానపదులను నేటికీ అలరిస్తున్నాయి. డప్పు, డ్రమ్సు వాద్యాలతో ఆయా సందర్భాలలో రాయల సీమ ప్రాంతంలో, ప్రదర్శించే దాసు, సాధు, జింగిగిలక, పులివేషం, కుంకుమవేషం, చిందాడేవేషం, శ్రీరంగ వేషం జనానికి తెలిసినవే, తిరుపతిలోని గంగమ్మ జాతర సందర్భంగా బైరాగి వేషం, బండ వేషం, దొరవేషం, మాతంగి వేషం వంటివి సజీవంగా ఉన్న పగటివేషాలు. అక్కడి జాతర సందర్భంగా పులివేషం, కాశీకావడి, రాజూరాణి, సేవకుడు, కీలుగుర్రం వంటివి ప్రదర్శిస్తారు.

రాజమండ్రికి చెందిన విభూది భవాని లింగం బృందం వారు ప్రవేశపెట్టిన రెండు పగటివేషాల రీతులు జన రంజకాలుగా పేరు పొందాయి.

13వ శతాబ్దం నుంచి వస్తున్న పగటివేషాలు పరిణామం పొందుతూ వస్తూ నవ్యతతో నేటికీ సామాజిక ప్రయోజనాలకోసం ఆంధ్రదేశంలో ప్రచారం పొందుతూనే ఉన్నాయి. తెలుగువారి ప్రాచీన సాంస్కృతిక జానపద కళారూపం ఈ పగటివేషాలు.

*- ఎ.ఎమ్. ఫీచర్స్*



Sthanka_FebBW.indd 21 01/02/11 10:14 PM

# గంగ నీళ్ళు తాగినంత తృప్తి – ఫ్లోరైడ్ నుండి విముక్తి

**గ్రామంలో క్రొత్తగా ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంటు ద్వారా పంచాయితీ సరఫరా చేసే నీళ్ళు త్రాగి తమకి 'గంగ నీళ్ళు త్రాగినంత తృప్తి ఉంది' అంటున్నారు పోలంపల్లికి చెందిన పడాల లక్ష్మి, బుడిగే ఎల్లమ్మలు.**

గ్రామంలో 'లక్ష' లీటర్ల కెపాసిటి గల రెండు ఉపరితల రక్షిత మంచినీటి రిజర్వాయర్లు, (30) చేతిపంపులు ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో నీటిలో పరిమితికి మించిన ఫ్లోరైడ్ వల్ల చాలా కాలంగా మోకాళ్ళ నొప్పులు, పళ్ళమీద చారలు తదితర వ్యాధులకు గురవుతున్న ఈ గ్రామ ప్రజలు ఇటీవల తమ గ్రామంలో నెలకొల్పిన 'మినరల్ వాటర్ ప్లాంటు' ఏర్పాటు వల్ల 'స్వచ్ఛమైన నీరు' త్రాగుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు.

ఈ విషయమై గ్రామ సర్పంచ్ బుడిగె కొండయ్య, గ్రామ యం.పి.టి.సి. సభ్యులు బీరయ్యలు మాట్లాడుతూ, తమ గ్రామానికి 2009-10 సంవత్సరానికి కేటాయించబడిన బి.ఆర్.జి.ఎఫ్. నిధులు అంతకు ముందులాగా రోడ్లు, మురికి కాల్వలకు కాకుండా, గ్రామస్థులందరికీ ఉపయోగపడే, 'మినరల్ వాటర్ ప్లాంట్' నిర్మాణం చేయటానికి పూనుకున్నామన్నారు.

2010-11 నంవత్సరంలో గ్రామ వంచాంయుతీ 50% రూ. 1,74,000, మండల పంచాయితీ 30% రూ. 1,00,000 కలసి మొత్తం రూ. 2,74,000 వెచ్చించి, ఈ ప్లాంటు నిర్మాణం త్వరితంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 2011-12 సంవత్సరంలో గ్రామ పంచాయితీ 50% వాటా క్రింద రూ. 1.50 లక్షలు కేటాయించారు.

ఈ ప్లాంటు నిర్మాణానికి (కరెంటు బిల్లు, ఆపరేటర్ జీతం మొదలైన వాటికి) ప్రతి 20 లీటర్ల క్యానుకు రూ. 2 మాత్రమే చెల్లించేట్లు గ్రామస్థులు అంగీకరించి ప్లాంటు నిర్వహణకు పంచాయతీకి సహకరిస్తున్నారు.





**మినరల్ వాటర్ ప్లాంటు నిర్మాణ వ్యయం**

| | | |
|---|---|---|
| యంత్రాలు | : | రూ. 1,50,000 |
| భవన నిర్మాణం | : | రూ. 1,50,000 |
| ఇతర ఖర్చులు | : | రూ. 1,24,000 |
| **మొత్తం** | : | **రూ. 4,24,000** |

## బి.ఆర్.జి.ఎఫ్. నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం

**నిధులు**

| | |
|---|---|
| బి.ఆర్.జి.ఎఫ్ 50% 2010-11 | రూ. 1,74,000 |
| బి.ఆర్.జి.ఎఫ్ 50% 2011-12 | రూ. 1,50,000 |
| బి.ఆర్.జి.ఎఫ్ 30% 2010-11 | రూ. 1,00,000 |
| **మొత్తము** | **రూ. 4,24,000** |

ఈ ప్లాంటు నిర్మాణ పనులు జూన్ 10, 2010న ప్రారంభించారు.

పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు దీనిని అక్టోబర్ 4, 2010న ప్రారంభించారు. అప్పటినుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు దీని నుండి స్ఫూర్తి పొంది, ఇలాంటి 'ప్లాంటు' నిర్మాణం తన గ్రామంలో చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

*– కె. కిషన్‌స్వామి, ఎం.పి.డి.ఓ.,*
*తిమ్మాపూర్ మండలం, కరీంనగర్ జిల్లా*



Sthanka_Feb.colo.indd 28 01/02/11 6:35 PM

**"పిల్లలు మీ వల్ల రాలేదు. మీ ద్వారా వచ్చారు. దైవం పిల్లల్ని ఈ లోకంలోకి తీసుకురావడానికి ఎంచుకున్న వాహికలు తల్లిదండ్రులు" అన్నాడు ఖలీల్ జిబ్రాన్.**

నిజమే. ప్రకృతి వద్దనుకునేది ఏమీ ఉండదు. ప్రకృతికి తనలో పుట్టిన దేని పట్లా ఏవగింపు ఉండదు. అది ఎత్తయిన కొండల మీద, కఠినమైన బండరాళ్ల అడుగున తేమలో తేలాడే పురుగును కాదనుకోదు. చెట్టు కాండంపై వికారంగా పాకే గొంగళి పురుగును కాదనుకోదు. తన ఒంటి పార మీద అసహ్యంగా పట్టే నాచును కాదనుకోదు. సముద్రం తోసిపడేసే నత్తగుల్లలోని జిగటను కాదనుకోదు. అనంతమైన ఆవరణంలో కంటికి కానరాని కోట్లాది సూక్ష్మక్రిములను కూడా కాదనుకోదు. ఎందుకంటే అవన్నీ తనవే. అవన్నీ తన గర్భంలో రూపుదాల్చినవే. అవన్నీ తన బిడ్డలే. అందుకే ప్రకృతి వాటిని కాదనుకోదు. మరి మనిషి ఎందుకు కాదనుకుంటాడు? కాదనుకుంటున్నాడు?



# జీవని

## డా॥ వి. చంద్రశేఖరరావు

పెళ్లయిన ఆరేళ్ల తర్వాత లేకలేక కడుపులో పడిందా పాప. తల్లి ఎంతో సంతోషపడింది. సంబరపడింది. ఊరంతా చెప్పుకుని మురిసిపోయింది. కాని ఆర్నెల్లకు స్కానింగ్ చేస్తే లోపల ఉన్న పాపకు మెదడు సరిగా పెరగలేదు. పుడితే వంకరగా పుడుతుందన్నారు. ఎదిగీ ఎదగకుండా పుడుతుందన్నారు. అలాంటి పాపను పెంచడం నరకం అన్నారు. కనుక వెంటనే బయటకు తీసేస్తామన్నారు. తండ్రి అందుకు సరే అన్నాడు. ఎందుకంటే, ఆ పాప ఉన్నది అతడి గర్భంలో కాదు కనుక. అతడి బొడ్డు పేగు పాపతో ముడిపడిలేదు కనుక. లోపల పాప కాలు విదిలిస్తే ఆ మధురమైన స్పర్శ అతడికి ఎన్నటికీ అంటదు గనుక. అందుకే అతడు వెంటనే ఆ పాపను రాల్చేయడానికి పూనుకున్నాడు.

కాని కన్నతల్లి, కనబోయే తల్లి ఎందుకు వద్దనుకుంటుంది? నా పాప... అది ఎలా ఉన్నా... ఎన్ని వంకరలతో ఉన్నా... ఎన్ని లోపాలతో ఉన్నా అది నా పాపే... దానిని నేను వద్దనుకోను. కంటాను. కని పెంచుకుంటాను. అసలు పిల్లలే లేకపోవడం కంటే, కొమ్మకు ఏ పువ్వూ లేకపోవడం కంటే, ఏదో ఒక పువ్వు అది అవిటిదైనా పర్వాలేదు... పూయడమే కదా... కొమ్మకు ధన్యత అనుకుందామె.

పాప పుట్టింది. అనుకున్నట్టే స్లోచైల్డ్‌గా పుట్టింది. ఏమీ తెలియదు. పాలు తాగడం తెలియదు. పాకడం తెలియదు. మాట్లాడటం తెలియదు. నవ్వడం తప్ప, అద్భుతంగా నవ్వడం తప్ప, మరేమీ తెలియదు. తల్లి మరి లోకం మర్చి పోయింది. పాపను అసహ్యించుకునే, దానిని ఎగతాళి చేసే, ఆట పట్టించే లోకం తనకు వద్దనుకుంది. సకలం తానే అయి పెంచింది. నేర్పించాలేగాని మూగకు కూడా మాట వస్తుంది. చూపించ ప్రయత్నించాలేగాని అంధునికి కూడా దృష్టి అందుతుంది. తన పాపకు ఏం తక్కువ?

తండ్రికి ఇది ఇష్టం లేదు. ఇలాంటి పాప తనకు భారం. తను ఇలాంటి పాపకు తండ్రిగా సొసైటీలో కనిపించదలుచుకోలేదు. కాని, భార్యను చూసి. ఆమె పట్టుదలను చూసి, మునిపంటి బిగువున పాపను భరించాడు.

రోజులు గడిచాయి. ప్రకృతి దయగానే ఉంది. తన కడుపున పుట్టిన అవిటి పువ్వుకు కూడా అది అంతో యింతో సువాసనను అబ్బేలా చేసింది. పాపకు క్రమంగా మాటలు వచ్చాయి. అది ఒక సంవత్సరం వెనకో మరి రెండు సంవత్సరాల వెనకో అ...ఆలు నేర్చుకుంది. దానికి లోకం కొంచెం కొంచెంగా తెలుస్తూ ఉంది. పిట్టలు తెలుస్తున్నాయి. చెట్లు తెలుస్తున్నాయి. వాటిలాగే తాను కూడా ప్రకృతిలో ఒక భాగమే అన్న రహస్యమూ తెలుస్తూ ఉంది. పాప కుంచె పట్టింది. బొమ్మలు వేసింది. స్కూల్లో టీచర్లను ఆశ్చర్యపరిచింది. పెయింటింగ్ కాంపిటీషన్‌కు పంపితే ఆసియా ఖండంలోనే చిన్నారులకు దక్కే అరుదైన బహుమతిని గెలుచుకుంది. తల్లి పొంగిపోయింది. స్కూలు పొంగిపోయింది. తండ్రి కూడా ఇప్పుడు పాపను ఓన్ చేసుకున్నాడు. టివి వాళ్ళు వచ్చి పాపను ఇంటర్వ్యూ చేస్తుంటే పాప మాట్లాడింది. అమ్మ తనను ఎంత బాగా పెంచిందో చెప్పింది. అమ్మ తనను ఎలా కంటికి రెప్పలా కాపాడుకుందో చెప్పింది. మరి మీ నాన్న నిన్ను ఎలా ఎంకరేజ్ చేశాడు? ఆ ప్రశ్నకు పాప కళ్లల్లో నీళ్లు ఉబుకుతుండగా.. పట్టి పట్టి... చెప్పింది- నాకు నాన్న లేడు... అంతా అమ్మే.



Sthanka_Feb.colo.indd 29 01/02/11 6:35 PM



# విపత్తును ఎదుర్కొనే సంసిద్ధత

**శాస్త్ర సాంకేతిక పరంగా ప్రపంచం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదో అంతే వేగంగా శీతోష్ణస్థితి, వాతావరణ సంబంధ సంక్షోభాలు తలెత్తుతున్నాయి. మానవునికి గల ప్రకృతిని జయించే దురాశ చివరకు మానవుని మనుగడకే ముప్పుగా వాటిల్లుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం అధిక జనాభా పెరుగుదల సమస్య ప్రకృతి పరమైన సంక్షోభాలపై ప్రధానంగా చర్చ జరుగుతున్నది.**

ప్రపంచంలో ఉన్న మొత్తం భూవైశాల్యంలో 2.5% భారతదేశంలో ఉంది. ప్రపంచంలో ఉన్న మొత్తం మంచి నీటి వనరులలో 4% మనదేశంలోనే ఉన్నాయి. ప్రపంచ జనాభాలో సుమారు 17% మనదేశంలోనే నివశిస్తున్నారు. జనాభా రీత్యా రెండవ స్థానంలో ఉన్న భారతదేశం అనేక విపత్తులను ఎదుర్కుంటున్నది. ఉదాహరణకు వరదలు. తుపానులు, కరువు, భూకంపాలు, మతఘర్షణలు, అంటురోగాలు, సాయుధ ఘర్షణలు, అగ్ని ప్రమాదాలు, ఇలా ఒకటేమిటి అనేక రకాల విపత్తులు మనదేశ ప్రజల సామాజిక ఆర్థిక పరిస్థితిని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.



భారతదేశంలో ఉన్న 110 కోట్ల జనాభాలో 25% మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. ఈ పేదరికం రెండు రకాలుగా ఉంది. దీర్ఘకాలికంగా, సాంప్రదాయకంగా కొనసాగుతున్న పేదరికం, ఇంకా అవకాశాలు లేకపోవటం వల్ల ఏర్పడిన పేదరికం. ఈ నిరుపేదల జీవితాల్లో విపత్తులు మరింత భారాన్ని నింపుతున్నాయి. ఇది వారి మనుగడనే ప్రశ్నార్థకంగా తయారుచేసింది.

## భారత దేశంలో విపత్తు నిర్వహణ విధానం

ప్రాణ నష్టం అందులోను కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ఈ వైపరీత్యాల్లో మరణించినప్పుడు ఆ నష్టం తక్షణ ప్రభావాన్ని మాత్రమే చూపదు. ఈ విపత్తు ఆ కుటుంబంపై శాశ్వతంగా చూపుతుంది. అయితే ఆస్తినష్టంలోనూ జీవనాధారాలు దెబ్బతింటే అది ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితినే నాశనం చేస్తుంది. ఉదాహరణకు ఒక వరదలో చేనేత మగ్గం లేదా ఇతర ముడి సరుకులను, మత్స్యకారుని వల, పేదరైతు గేదెను నష్టపోతే ఆ నష్టం సాధారణ ఆస్తినష్టం కాదు. వారి ఆదాయ భద్రత, చేతికొచ్చిన పంట వరద ముంపునకు గురి అవటం చిన్న, సన్నకారు రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులపాలు చేస్తుంది. ఇక భూకంపాలవంటివి సంభవిస్తే ఆ ప్రాంతంలో ఉన్న మొత్తం ప్రజానీకం అస్తవ్యస్తం కావచ్చు. దశాబ్దాల వరకు కోలుకోలేనంతగా ఆ ప్రాంతం నష్టపోవచ్చు. అందుకే భారతదేశంలో పేదల జీవితమంతా ఏదో ఒక విపత్తుతో నిరంతరం జరిపే పోరాటమే.

### ప్రకృతి పరమైన విపత్తులు - కారణాలు

- మనదేశంలో ప్రకృతి పరమైన విపత్తులు పెరగటానికి ముఖ్యకారణం అనూహ్యంగా పెరుగుతున్న జనాభా. దీనివలన మానవ మనుగడకు అత్యవసరమైన త్రాగునీరు, సాగునీరు కరువవుతుంది.
- అశాస్త్రీయంగా, అప్రణాళికా బద్ధంగా ప్రాజెక్టులు నిర్మించటం వలన తరచూ ప్రకృతి బీభత్సాలకు గురి అవుతున్నాయి.
- సహజవనరుల కొరత మూలంగా ఏర్పడిన అశాస్త్రీయ పోకడ.



Sthanka_Feb.colo.indd 26 01/02/11 6:35 PM

ప్రకృతి వైపరీత్యాలను శాశ్వతంగా నివారించలేము కానీ వీటిని ఎదుర్కొనే సంసిద్ధత మాత్రమే ఇబ్బందులను, కష్టాలను తగ్గించడానికి వీలవుతుంది. అందువల్ల సహాయక చర్యలు ప్రజలకుండే సహజ సామర్థ్యాన్ని పెంచేందుకు దోహదం చేయాలి. ప్రతి విపత్తు బాధితులకు విలువైన అనుభవాన్ని ఇస్తుంది. ఈ అనుభవాలను పరిగణనలోకి తీసుకొని విపత్తు యాజమాన్యాన్ని అనుసరించాలి.

ప్రభుత్వం విపత్తులపై ముందస్తు సంసిద్ధతకు కార్యక్రమాలు రూపొందించేటప్పుడు ప్రజల సాంప్రదాయ విజ్ఞానాన్ని, వారి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఫలితంగా ప్రజల సహాయం పొందేందుకు వీలవుతుంది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ రెడ్ క్రాస్ అండ్ క్రీసెంట్స్ సొసైటీస్ 1998 విడుదల చేసిన ప్రపంచ విపత్తుల నివేదిక వరల్డ్ డిజాస్టర్ రిపోర్టు ప్రకారం భారత దేశంలో 1987-96 మధ్య కాలంలో సగటున ప్రతియేటా 5.6 కోట్ల మంది ప్రజలు ఏదో ఒక విపత్తు బారిన పడ్డారు. సగటున ఏటా 5063 మంది ఈ విపత్తునకు గురై చనిపోయారు.

ఐక్యరాజ్య సమితి 1990 దశాబ్దాన్ని అంతర్జాతీయంగా ప్రకృతి వైపరీత్యాలను తగ్గించాల్సిన దశాబ్దంగా ప్రకటించింది. ఈ దశాబ్ద కాలంలో ప్రాధాన్యత ప్రాతిపదికగా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు శాస్త్రీయంగా ప్రతిస్పందించే వ్యవస్థలను భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సంక్షోభ యాజమాన్య కమిటీ ఏర్పాటైంది. ప్రకృతి వైపరీత్యాల నివారణ, సత్సంబంధిత అంశాలపై అత్యున్నత కమిటీగా ఇది పనిచేస్తుంది. కేంద్ర ఆరోగ్యశాఖలో ఉన్న అత్యవసర వైద్యసేవల విభాగం కూడా ఈ ప్రకృతి వైపరీత్యాల యాజమాన్య కృషికి సహకరిస్తుంది.

ఇక మానవ జనితం అయిన ఇతర విపత్తులు మత ఘర్షణలు, జాతి ఘర్షణలు, ఇతర రకాలు సామాజిక ఘర్షణలు, కాందిశీకుల బెడదలాంటి సమస్యల యాజమాన్యాన్ని కేంద్ర హోంశాఖ నిర్వహిస్తోంది.

### సహాయక చర్యల కన్నా నివారణ చర్యలు మిన్న

ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై ఒక ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది. అయితే ఇది ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తీసుకునే చర్యలను మాత్రమే సూచిస్తుంది కానీ, ఆ విపత్తు రాకుండా తీసుకోవలసిన లేదా నివారించటానికి తీసుకునే





చర్యలను చూపటం లేదు. ఉదాహరణకు తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థ చిన్నాభిన్నమౌతుంది. దీనిని నివారించకుండా తుఫానులు, వరదలు వచ్చినప్పుడు సహాయక చర్యల గురించి ఆలోచించటంలో అర్థం లేదు. సహాయక చర్యలు ఎంత గొప్పగా జరిపినా నివారణ చర్యలను మించిన ప్రయోజనాన్ని అవి కలిగించలేవు. కావున నివారణ చర్యలను ముందస్తు చర్యలుగా అభివృద్ధి ప్రణాళికలో భాగం చేయాలి. అవి.

- తీర ప్రాంతంలో పేదలకు కల్పించే గృహ నిర్మాణం తుపానులకు, వరదలకు తట్టుకొనే రీతిలో నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించాలి.
- భూకంపాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో భారీ నీటి పారుదల ప్రాజెక్టుల స్థానంలో చిన్న నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టాలి.
- పారిశుద్ధ్యం, మంచినీటి వ్యవస్థలను ప్రకృతి వైపరీత్యాల దృష్టితోనే కాకుండా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చూడాలి.
- వరదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తగు జాగ్రత్తలతో రోడ్లను, రైల్వేలైన్లను, ఇతర రకాల నిర్మాణాలను చేపట్టడం చేయాలి.
- కరువు ఎదుర్కొనేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి.
- తుఫానులు, వరదలకు ఖచ్చితమైన ముందస్తు హెచ్చరికల్ని జారీ చేయగల అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకోవాలి.
- అంటురోగాలు ప్రబలకుండా సార్వత్రిక టీకాలు, రోగాల బారిన పడకుండా పౌష్టికాహారం కల్పించి రోగ నిరోధక శక్తిని అభివృద్ధి చేయాలి.
- మడ అడవులను తీర ప్రాంతాలలో ప్రోత్సహించాలి.
- అశాస్త్రీయ, అప్రణాళికా బద్ధమైన, విచక్షణా రహితమైన గనుల త్రవ్వకాన్ని క్రమబద్ధీకరించాలి
- ప్రకృతి సమతుల్యతను దెబ్బతీసే సహజ వనరులను అశాస్త్రీయంగా, విచక్షణా రహితంగా వాడరాదు.

ఇందుకు కావలసినది వరద యాజమాన్యం కాదు, ఋతుపవన యాజమాన్యం అన్నది గుర్తించాలి.

*- డా॥ ఎ. నిర్మలా దేవి, జూనియర్ ఫ్యాకల్టీ*
*విపత్తు నిర్వహణ విభాగం, అపార్డ్*



Sthanka_Feb.colo.indd 27 01/02/11 6:35 PM

# సూక్ష్మ ఋణ సంస్థల నియంత్రణ బిల్లు ఆమోదం- త్వరలో అమలులోకి రానున్న చట్టం

**సూ**క్ష్మ రుణ సంస్థల కార్యకలాపాలను కట్టడి చేస్తూ రూపొందించిన సూక్ష్మ ఋణ సంస్థల నియంత్రణ బిల్లును శాసన సభ 14-12-2010న ఆమోదించింది. రాష్ట్రంలో ఇటీవల కాలంలో గ్రామీణ పేదలకు సూక్ష్మ ఋణాలను అందచేసే వివిధ మైక్రోఫైనాన్స్ సంస్థలు, ఋణాల బకాయిల వసూళ్ళలో నీతి బాహ్యమైన పద్ధతులకు పాల్పడుతుండటంతో ఋణాలు పొందిన కుటుంబాలలోని వ్యక్తులు ఆత్మ హత్యలు సైతం చేసుకొనే పరిస్థితులు ఉత్పన్నమయినాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దే చర్యలలో భాగంగా ప్రభుత్వం అక్టోబరు 2010లో మైక్రో సంస్థల నియంత్రణకు ఒక ఆర్డినెన్సును జారీ చేసింది. రాష్ట్ర శాసన సభ ఈ సూక్ష్మ ఋణ సంస్థల నియంత్రణ బిల్లును ఆమోదించటంతో ఈ ఆర్డినెన్సు స్థానంలో క్రొత్త చట్టం కొద్ది రోజుల్లో అమలులోకి రానుంది. ఈ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించిన సంస్థలపై చట్టంలో నిర్ణయించిన జైలు శిక్ష, జరిమానాను లేదా రెండింటినీ ఆ సంస్థ ఎదుర్కొనాల్సి వస్తుంది. క్రొత్తగా అమలులోకి రానున్న చట్టంలోని నిబంధనల ప్రకారం-

- ఇకపై సూక్ష్మ ఋణ సంస్థలు ఇచ్చే ఋణాలపై వసూలు చేయనున్న వడ్డి శాతాన్ని ముందుగానే ప్రకటించటం తోపాటు, ఋణ వసూళ్ళ కోసం దౌర్జన్యాలకు పాల్పడటానికి వీలులేదు.
- సూక్ష్మ ఋణ సంస్థ ఏదేని జిల్లాలో తన కార్యకలాపాలు అంటే వడ్డీ వ్యాపారం చేయాలన్నా లేదా ఏ ప్రాంతంలో వ్యాపార లావా దేవీలు నిర్వహిస్తారన్న అంశాన్ని గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ప్రాజెక్టు డైరెక్టరు వద్ద, పట్టణ ప్రాంతాలకు సంబంధించి పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ వద్ద నమోదు చేసుకోవాలి.
- ఈ విధంగా నమోదు చేసుకోకుండా వ్యాపారం చేస్తే ఆ సంస్థల డైరక్టర్లు, సి.ఇ.ఓ. ఇతర సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవటానికి ప్రభుత్వానికి అధికారం ఉంది. ☆





SthanikaPalanaTel_February_2011_Colour_1.p3nd 2/1/2011, 10:00 PM

# సూక్ష్మరుణ సంస్థలను అరికట్టడంలో గ్రామపంచాయతీల పాత్ర

**గ్రామీణ నిరుపేద, మధ్యతరగతి, వ్యవసాయదారుల కుటుంబాల అభివృద్ధికి గ్రామ పంచాయతీలు పెద్దపీట వేయాలి. ప్రస్తుత, పరిస్థితులలో గ్రామపంచాయతీ చురుకైన పాత్ర పోషించడం లేదు.**

కావున గ్రామంలోని ప్రజల మీద సూక్ష్మరుణ సంస్థల పెత్తనం ఎక్కువైనది దీని కంతటికీ కారణం గ్రామపంచాయతీ నిర్లిప్తత వహించడమే. గ్రామపంచాయతీలు, తమ ప్రాంతంలోని కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు అభివృద్ధిపై దృష్టిసారించక పోవడం వలన, గ్రామంలోని ప్రజలు స్వయంసమృద్ధి సాధించకలేక సూక్ష్మరుణ సంస్థల ఊబిలో కూరుకొని పోతున్నారు. దీని నిర్మూలనకు గ్రామపంచాయతీలు నడుంబిగించాలి. గ్రామ ప్రజలను రక్షించాలి.



ముందుగా గ్రామపంచాయతీ గ్రామంలోని ప్రజల స్థితిగతులు గమనించి వారి అవసరాలకు తగినట్లు సూచనలు, సలహాలు ఇవ్వాలి. నిరుపేద, మధ్యతరగతి, వెనుకబడిన మహిళలను ఒక్కటిగా చేసి వారు సంఘంగా ఏర్పడే విధంగా వారిని ప్రోత్సహించాలి. తదనుగుణంగా వారికి స్వయంశక్తి మీద నమ్మకం కలిగించాలి. వారికి కావలసిన ఆర్థిక సహాయం అందుబాటులో వున్న గ్రామీణ బ్యాంకులు లేదా జాతీయ బ్యాంకుల ద్వారా వారికి ఆర్థిక సహాయం అందించాలి.

గ్రామపంచాయతీ సంఘంగా ఏర్పడిన మహిళలకు గ్రామప్రాంతంలో స్వయం ఉపాధి అయిన కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులకు మార్గం ఏర్పాటు చేయాలి. గ్రామంలోని ప్రతి సంఘం సమావేశాలను సక్రమంగా నిర్వహించేటట్లు, సంఘం తీసుకున్న ఋణం తిరిగి సక్రమంగా బ్యాంకులకు చెల్లించేటట్లు, చెల్లించిన సంఘానికి తిరిగి మరలా ఆర్థిక సహాయం అందించేటట్లు, ముఖ్యమైన పాత్ర గ్రామ పంచాయతీలు నిర్వహించాలి.

ముఖ్యంగా గ్రామీణాభివృద్ధికి మొత్తంగా 40% ఋణాలను విధిగా ఇవ్వాలని బ్యాంకులలకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలు వున్నాయి. కాని అమలవుతున్న దాఖలాలు లేవు. ఈ ఆదేశాల అమలులో నేరుగా గ్రామీణ నిరుపేదలకు రుణాలు ఇవ్వకుండా ఇటీవల ప్రాధాన్యతా రంగంగా పరిగణింపబడిన సూక్ష్మరుణ సంస్థలకు భారీగా రుణాలను ఇస్తున్నాయి. 40% ఋణాల వితరణ వివరాలను వారి రికార్డ్సులో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చూపడానికి మాత్రమే ఉన్న ఈ విధానాన్ని గ్రామపంచాయతీలు ముక్త కంఠంతో ఎదుర్కొని 40% రుణాల నిధులను మహిళా సంఘాలకు ఇప్పించటంలో కృషిచేయాలి.

అత్యధిక సంఖ్యలో వున్న స్వయంసహాయక బృందాలను ప్రోత్సహించాల్సిన అనేక జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ వాణిజ్య బ్యాంకులు ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు జిల్లా సహకార బ్యాంకులు, స్వయంసహాయక బృందాలను బలోపేతం చేయడం విస్మరించి సూక్ష్మరుణ సంస్థలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ విధానం ఇలాగే కొనసాగితే సంఘంగా ఏర్పడిన మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు.

బ్యాంకులను రుణం చెల్లించని సంస్థలను గురించి వాటిని బలోపేతం చేసుకోవడానికి గ్రామపంచాయతీ మార్గం సూచించాలి. ఈ విధమైన పనులను చేయడం వలన గ్రామపంచాయతీలో ప్రజలు సూక్ష్మరుణ సంస్థలను ఆశ్రయించరు. గ్రామంలోని అమాయక ప్రజలు, స్వయంశక్తి సంఘాలు సూక్ష్మరుణ సంస్థల ప్రలోభాలకు లోను కాకుండా, వాటికి ఆకర్షితులు కాకుండా తగు జాగ్రత్తగా సూక్ష్మరుణ సంస్థలను గ్రామం నుండి వెలివేయాలి.

గ్రామంలోని ప్రజల అవసరాలను గ్రామపంచాయతీ గుర్తించి తగు విధంగా వారిని ప్రోత్సహించాలి, చేయూత నివ్వాలి. అప్పుడే గాంధీజీ కలలు కన్న "గ్రామ స్వరాజ్యం" సిద్ధిస్తుంది.

**- ఏ.వి. సురేష్‌కుమార్**

జిల్లా పరిషత్ శిక్షణా అధికారి, జిల్లా ప్రజాపరిషత్, కడప





SthanikaPalanaTel_February_2011_Colour_1.pmd 30 2/1/2011, 10:00 PM




# గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవలలో ఐ.టి

"గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరచడానికి, సామాన్య మానవుని దైనందిన జీవితాన్ని మెరుగు పరచడానికి మన దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉన్నది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలను అమలు పరచడానికి జి.ఐ.ఎస్ అనే ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తోంది. ఉదాహరణకు సత్వర ఆరోగ్య సేవలు అందించే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని (104) సక్రమంగా అమలు జరపడానికి, రాష్ట్రంలో మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్యసేవలు అందచెయ్యడానికి జి.ఐ.ఎస్ టెక్నాలజీని ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకుందాం.

### జి.ఐ.ఎస్ అంటే ఏమిటి?

జి.ఐ.ఎస్ గురించి జరిగే కృషి 1960లో మొదలైంది. దీనిని మొదటిగా కెనడా దేశం వారి రక్షణ మరియు నౌకాయాన అవసరాలకు అభివృద్ధిపరిచింది.

భూ భౌగోళిక సమాచార వ్యవస్థ అనగా (జి.ఐ.ఎస్) అనగా భౌగోళిక కో ఆర్డినేట్‌ల ద్వారా సూచించబడే స్పేషియల్ మరియు నాన్ స్పేషియల్ డేటాతో కూడిన కంప్యూటరీకరించిన సమాచార వ్యవస్థ వినియోగదారుని అవసరాలకనుగుణంగా సమాచారాన్ని పొందేందుకు, దాచేందుకు, తీసుకునేందుకు, విశ్లేషణకు మరియు ప్రదర్శనకు వీలుగా దీనిని తయారు చేశారు.

భూ ఉపరితలం పైకల ఎటువంటి భౌగోళిక ప్రాంతాన్ని అయినా ఇది చూపెడుతుంది.స్పేషియల్ డేటా అయిన వ్యవసాయం, రోడ్లు, అడవులు, గ్రామం, మండలం మరియు జిల్లా సరిహద్దు మొదలగు వాటిని సూచిస్తుంది. అలాగే నాన్ స్పేషియల్ డేటా అయిన మానవ జనాభా వివరాలను, మ్యాప్‌లకు అనుసంధానము చేసి సూచిస్తుంది.

మన రాష్ట్రంలో సుమారుగా 80 మిలియన్ల జనాభా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. 86 శాతం గ్రామాలకు వైద్యసదుపాయాలు 3 కి.మీ ల కంటే ఎక్కువ దూరాన ఉన్నాయి.

వైద్యసదుపాయాలు అందుబాటులో లేని కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు దోమల నుంచి వచ్చే వ్యాధులతో, కాలుష్యమైన నీటివల్ల వచ్చే వ్యాధులతో, అపరిశుభ్రతవల్ల, పౌష్టికాహారలోపం వల్ల వచ్చే వ్యాదులతో బాధపడుతున్నారు. ఈ ఆరోగ్యసమస్యలను అధిగమించడానికి రాష్ట్రప్రభుత్వం హెచ్.ఎమ్.ఆర్.ఐ సంస్థద్వారా 104,108 మొబైల్ ఆరోగ్యకేంద్రాలను వాహనాలద్వారా విస్తృతంగా వినియోగిస్తున్నారు.



జి.ఐ.ఎస్ టెక్నాలజీతో మన రాష్ట్రంలోని 28,123 రెవిన్యూ గ్రామాలు/ 1,128 మండలాలు, 23 జిల్లాల యొక్క కాంటూరు మ్యాప్‌లను ఉపయోగించి సమాన ఎత్తులో 3 కి.మీ. పరిధిలో ఉన్న గ్రామాలను గుర్తిస్తారు. డిజిటల్ మ్యాప్‌లను రవాణా సౌకర్యాలు, గ్రామాల స్థానాలను, గ్రామ పంచాయితీల పరిధులు, నీటి పారుదల సదుపాయాలను, కాలువల నెట్‌వర్క్‌ను, మండల, జిల్లాల పరిధులను, సూచించే మ్యాప్‌లను మరియు సంబంధించిన సామాజిక- ఆర్థిక పరిస్థితులను తయారు చేస్తారు.

పైన తెలిపిన మ్యాప్‌లను ఉపయోగించి ప్రతి జిల్లాలో ఒక సెంటర్ పాయింట్ ను గుర్తిస్తారు. దీనినే పార్కింగ్ ప్లేస్ అంటారు. ఈ ప్రదేశం నుండి 104 సర్వీసులు ప్రతిదినం బయలుదేరి ఒక్కొక్క వాహనం 80 కి.మీ పరిధిలో ఉన్న మారు మూల గ్రామాలకు సైతం ఆరోగ్యసేవలను అందిస్తున్నారు. అలాగే 104 సర్వీసులలో జి.పి.యస్. అనే పరికరాన్ని ఉపయోగించి ఇంధనం నింపుకోవటానికి దగ్గరలో ఉన్న పెట్రోల్ స్టేషన్స్‌ను, ప్రజలనుంచి పొందిన ఆరోగ్యస్థితిగతుల సమాచారాన్ని పొందుపరచడానికి ఇంటర్‌నెట్ సెంటర్‌లను గుర్తిస్తారు. అదేవిధంగా ప్రతి జిల్లాలో ఉన్న మెడికల్ సెంటర్లను, బ్లడ్ బ్యాంకులను కూడా జి.ఐ.ఎస్ లో పొందుపర్చినారు.

ఇలా చెయ్యడం వలన అత్యవసర పరిస్థితులలో అతి తక్కువ సమయంలో దగ్గరలో ఉన్న మెడికల్ సెంటర్ లేదా బ్లడ్ బ్యాంక్‌లను గుర్తించి వాటిని సంప్రదిస్తారు.

అలాగే అత్యవసర పరిస్థితిలో 104 ఫోన్ నెంబరును సంప్రదించినట్లయితే, వారు అత్యవసర పరిస్థితిలో తీసుకోవలసిన జాగ్రత్తలను, మందుల వివరాలను తెలియపరుస్తారు. ఈవిధంగా మన రాష్ట్రంలో ఆరోగ్యసేవలలో ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు.

**- డా. జి. శ్రీనివాస రావు**

**- యస్. శాంతికుమార్,** జి.ఐ.ఎస్., సి.ఎస్.ఆర్.ఎం.



SthanikaPalanaTel_February_2011_Colour_1.p65nd 2/1/2011, 10:00 PM

# అమూల్యమైన క్రికెట్ క్రీడారత్నాలు



## సచిన్ టెండూల్కర్, వి.వి.ఎస్. లక్ష్మణ్

**గడిచిన ఏడాది (2010)లో జరిగిన అతి గొప్ప క్రీడా విశేషం ఏమిటి? ఆ సంవత్సరపు గొప్ప క్రీడాకారుడెవరు?**

**రోడ్డుపై నడిచే ఎవరినైనా అడగండి. ఒక్కక్షణం కూడా ఏ మాత్రం సందేహించకుండానే టెస్ట్ క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్ సాధించిన 50వ సెంచరీ గురించే అందరూ చెప్తారు.**

దీనర్థం, క్రీడల్లో ఇతర గొప్ప విశేషాలు లేవని, జరగలేదని అర్థం కాదు. 20 ఏళ్ల వయస్సుకే ప్రపంచ బ్యాడ్మింటన్‌లో రెండవ ర్యాంక్ సాధించిన సైనా నెహ్వాల్ ఐదు ప్రధాన బ్యాడ్మింటన్ టైటిళ్లు గెలుచుకుంది. ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌ను గెలవటం ద్వారా నిజమైన 'విశ్వనాథుడి'గా ఆనంద్ నిరూపించుకున్నాడు. క్రికెటర్ గౌతమ్ గంభీర్ అరివీర ఫామ్‌లో ఉన్నారు. సుశీల్ కుమార్ ప్రపంచ రెజ్లింగ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. బాక్సర్ మేరీ కామ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ని ఐదవసారి సాధించింది. గగన్ నారంగ్ గన్ గురి తప్పకుండా పూర్తిస్థాయిలో పేలుతూనే ఉంది. మెడల్స్ గెలుచుకుంటూనే ఉంది.



అయినప్పటికీ, ఈ గొప్ప గొప్ప క్రీడా విశేషాలు ఏవీ మన అతిగొప్ప క్రికెటర్ 'లిటిల్ మాస్టర్' ప్రకాశాన్ని తగ్గించలేకపోయాయి. సాధారణమైన క్రీడాభిమానే కాక, గొప్ప క్రీడా తారలైన సైనా, పి.టి.ఉష, విశ్వనాథ్ ఆనంద్ వంటి వారు కూడా సచిన్ సాధించిన విజయాలను చూసి ఆశ్చర్య చకితులవుతున్నారు. దేశ అత్యున్నత పురస్కారమైన 'భారత రత్న'ను సచిన్ టెండూల్కర్‌కి ఇవ్వాలని అనేకమంది ప్రజలు చేస్తున్న డిమాండ్‌ను వారు కూడా మనస్ఫూర్తిగా బలపరుస్తున్నారు.

ఒక వ్యక్తిగా సచిన్ టెండూల్కర్ గొప్ప మానవతావాది. తాను సాధించిన మహత్తర విజయాలు, వాటితో పాటు వచ్చిన డబ్బు అతని తలకు ఎక్కలేదు. 21 ఏళ్ల క్రితం స్కూలు



పిల్లవాడిగా పాకిస్తాన్‌లో మొదటిసారి టెస్టు క్రికెట్ ఆడినప్పుడు ఎంత నిరాడంబరంగా, సాదాసీదాగా ఉన్నాడో, ఇప్పటికీ అదే తీరుతో ఉన్నాడని సచిన్ పరిచయస్తులు అంటారు.

అతను ఎప్పుడూ గొప్పలు చెప్పుకోడు. గొప్పలకి పోడు. అయినా అతని బ్యాట్ మాత్రం గొప్పగా ఆడుతుంది. సచిన్ మొత్తం 40 రికార్డులు సాధించాడు. ఈ మధ్యే ఒక రికార్డును బ్రేక్ చేసి, సరికొత్త రికార్డును నెలకొల్పినప్పుడు కూడా 'క్రికెట్ ఆడడాన్ని ఆస్వాదిస్తాను' అని మాత్రమే వ్యాఖ్యానించాడు.

ఇప్పుడిక సచిన్ సాధించవలసింది ఒకే ఒక రికార్డు మిగిలిఉంది. టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించడమే ఆ రికార్డు. వెస్ట్ఇండీస్‌కి చెందిన బ్రియాన్ లారా ఒక టెస్ట్ మ్యాచ్‌లో సాధించిన 400 పరుగుల రికార్డును బద్దలు కొట్టడమే సచిన్ సాధించవలసిన రికార్డు.

సచిన్ తోటి వయస్సున్న క్రికెట్ క్రీడాకారులు అనేకమంది అసలు ఆటనుంచే అంతర్ధానమైపోయారు. మరికొందరు రిటైరయ్యారు. 21 సంవత్సరాలుగా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న సచిన్ మాత్రం అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే విధమైన శ్రద్ధతో, ఇష్టంతో విజయాలతో ఆడుతూనే ఉన్నారు.

క్రీడాభిమానులకు సచిన్ సాధించిన విజయాల గురించి బాగానే తెలుసు. సచిన్ ఎప్పుడు ఏం సాధించినా, ఏ మైలు రాయిని దాటినా, వారు ఆయన గత విజయాలన్నిటినీ మరీ మరీ గుర్తు చేసుకుంటూనే ఉంటారు. మొన్న డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాలో సెంచూరియన్ వేదికపై సచిన్ 50వ టెస్ట్ సెంచరీ సాధించడం ద్వారా 2010 సంవత్సరానికి ఘనంగా వీడ్కోలు పలికాడు. దక్షిణాఫ్రికాకు చెందిన జాక్వెస్ కలిస్ ఇప్పటికి 40 టెస్ట్ సెంచరీలు సాధించి సచిన్ కంటే ఎంతో వెనుక బడి ఉన్నాడు.

అప్పటికీ సంతృప్తి చెందని సచిన్ దక్షిణాఫ్రికాపై మరో సెంచరీ నమోదు చేసి, నూతన సంవత్సరానికీ అంతే ఘనంగా స్వాగతం పలికాడు. ఇప్పటికి టెస్ట్ క్రికెట్‌లో 14,500 పైగా రన్‌లు సాధించి అత్యధిక టెస్ట్ రన్‌లు సాధించిన క్రీడాకారుడిగా నిలిచాడు.

క్రికెట్ చరిత్రలో ఈ ముంబై క్రికెటర్ పాత్రపై గత దశాబ్ద కాలంగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన అజేయ డాన్‌బ్రాడ్‌మాన్‌తో సచిన్‌ని పోలుస్తున్నారు.

మొదట్లో డాన్‌బ్రాడ్‌మాన్‌తో ఎవరినీ పోల్చలేమని అనేవారు. కొంత కాలం గడిచాక "డాన్ బ్రాడ్‌మాన్ డాన్ బ్రాడ్ మానే. సచిన్ సచినే. ఎవరి గొప్పతనం వారిది. ఇద్దరూ గొప్పవారే" అనే సిద్ధాంతం వచ్చింది. మరికొంత కాలం గడిచాక బ్రాడ్‌మాన్ కంటే సచినే అధికుడని కొందరు ఒప్పుకోవటం ప్రారంభించారు.

సచిన్ టెండూల్కర్ జీవితానికి, ఆటకి సంబంధించిన కొన్ని విషయాలు పెద్దగా ఎవరికీ తెలియనివి ఉన్నాయి. అవి అందరికీ ఆసక్తి దాయకంగా ఉంటాయి. సచిన్ తండ్రి తన అభిమాన సంగీత దర్శకుడైన సచిన్ దేవ్ బర్మన్ పేరును తన కుమారుడికి పెట్టుకున్నాడు. సచిన్, లతా మంగేష్కర్ పరస్పర అభిమానులు. పాత హిందీ సినిమా పాటలు ప్రత్యేకించి లతా మంగేష్కర్‌వి వినటం సచిన్‌కి ఇష్టం. క్రికెట్ క్రీడలో సచిన్ సాధిస్తున్న విజయాల గురించి లతా మంగేష్కర్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ఆనందిస్తూ ఉంటారు.

భారతదేశం తరపున పాకిస్థాన్‌లో టెస్ట్ క్రికెట్ ఆడటానికి వెళ్తూ, సచిన్ టెండూల్కర్ తన పుస్తకాలు కూడా వెంట తీసుకెళ్లాడు - ఖాళీ సమయంలో హోంవర్క్ అయినా చేసుకోవచ్చని. భారత్, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న శత్రుత్వం వల్ల స్టేడియంలోని పాకిస్తాన్ క్రీడాభిమానులు భారత క్రీడా కారులను బాగా ఏడ్పించే వారు. ఇక తన మొదటి టెస్ట్ ఆడుతున్న సచిన్ టెండూల్కర్‌ని అయితే మరీ ఏడ్పించారు. "అరే బచ్చా. ఇంటికెళ్లి, పాలు తాగుపో", అని అరిచేవారు.

అయితే, ఆ అరుపులకు, బెదిరింపులకు సచిన్ ఏ మాత్రం బెదిరేవాడు కాదు. ఫాస్ట్ బౌలర్ల నుంచి వచ్చిపడే బంతులు తన శరీరాన్ని



## సచిన్ బయోడేటా



| | |
|---|---|
| పుట్టిన తేదీ | : 24 ఏప్రిల్ 1973, ముంబైలో |
| ఎత్తు | : 5 అడుగుల 5 అంగుళాలు (1.65 మీటర్లు) |
| బ్యాటింగ్ శైలి | : కుడిచేయి |
| బౌలింగ్ శైలి | : కుడిచేయి లెగ్ స్పిన్, అఫ్ స్పిన్, మీడియం పేస్ |
| మొదటి టెస్ట్ మ్యాచ్ | : 15 నవంబర్, 1989, పాకిస్తాన్‌లో |

## గౌరవ బిరుదులు

| | |
|---|---|
| 2010 | : క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ - ఐసిసి అవార్డు - సర్ గార్ ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ |
| 2010 అక్టోబర్ | : లండన్‌లో జరిగిన ఆసియా అవార్డుల్లో పీపుల్స్ ఛాయిస్ అవార్డు |
| 2008 | : పద్మవిభూషణ్ |
| 2004, 2007 | : ఐసిసి వరల్డ్ ఒడిఐ - 11 |
| 2005 | : రాజీవ్‌గాంధీ అవార్డు |
| 2003 | : క్రికెట్ వరల్డ్‌కప్‌లో ప్లేయర్ |
| 2001 | : మహారాష్ట్రలో అత్యున్నత పౌర పురస్కారమైన మహారాష్ట్ర భూషణ్ అవార్డు |
| 1999 | : పద్మశ్రీ |
| 1997, 98 | : రాజీవ్ గాంధీ ఖేల్ రత్న |
| 1997 | : సంవత్సరపు విజ్డన్ క్రికెటర్ |
| 1994 | : అర్జున అవార్డు |

## ముఖ్యమైన రికార్డులు

- ఇంటర్నేషనల్ సెంచరీలు : 96
- టెస్ట్ మ్యాచ్‌లలో సెంచరీలు : 50
- వన్‌డే ఇంటర్నేషనల్ సెంచరీలు : 46
- టెస్ట్ మ్యాచ్‌లలో అత్యధిక పరుగులు : 14506 (175 టెస్ట్ మ్యాచ్‌లు) (సగటు : 56.88)
- వన్‌డే ఇంటర్నేషనల్‌లో పరుగులు : 17,598 (సగటు : 45-12)

గాయపరిచినా బెదరకుండా తన నైపుణ్యాన్ని పాకిస్తానీ బౌలర్లకు రుచి చూపించాడు. అనేక మంది క్రికెటర్ల మాదిరిగానే, సచిన్ కూడా ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. 2002 నుంచి 2006 మధ్యకాలం సచిన్‌కి అంత ప్రోత్సాహకరంగా లేదు. సచిన్ అప్పటికే తన ఉత్తమ ఆటను ప్రదర్శించాడని, ఇక పెద్దగా ఆడలేడని, గౌరవంగా రిటైరవటం మంచిదని, మీడియా, క్రీడాలోకం కూయటం మొదలు పెట్టాయి.

సినిక్స్ మాట్లాడే మాటలకు జవాబు చెప్పే అలవాటు ఎప్పుడూ లేని సచిన్ తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు. టెస్ట్ మ్యాచ్‌లు, వన్డే మ్యాచ్‌లలో కలిపి మొత్తం 96 సెంచరీలు సాధించాడు అందరికంటే ఎక్కువ పరుగులను, సెంచరీలను సాధించాడు.

రికార్డుల కంటే ఎక్కువగా లెక్కలేనన్ని సత్కారాలను, బిరుదులు సచిన్ పొందాడు.



ఎవరో ఒకరు వ్యాఖ్యానించినట్లు, "బిరుదుల ఏవీ సచిన్‌కి గౌరవాన్ని ఆపాదించవు. సచినే ఆ బిరుదులకు గౌరవాన్ని ఆపాదిస్తాడు". అన్నింటిలో అతిగొప్ప గౌరవం ఏమిటంటే, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రధానం చేసిన 'గ్రూప్‌కేప్టెన్' బిరుదు.

సచిన్ టెండూల్కర్‌కి 'భారతరత్న' ఇవ్వాలనే డిమాండ్ మరో వైపు బాగా ఊపందుకుంది.

సచిన్ టెండూల్కర్ బ్యాటింగ్ చేస్తుంటే, చూడటానికి భారతదేశమంతా నిలిచిపోతుందని తరచూ అంటుంటారు. ఒకసారి 98 పరుగుల వద్ద సచిన్ బ్యాటింగ్ చేస్తుంటే, ఉత్తర భారత దేశంలోని ఒక చిన్న రైల్వే స్టేషన్‌లో రైలుని ఒక నిముషం పాటు నిలిపివేశారు. 'లిటిల్‌మాస్టర్' తన సెంచరీ దాటేంతవరకూ, రైలు కదల కూడదని స్టేషన్ మాస్టర్, గార్డు, ప్రయాణికులు, అందరూ మూకుమ్మడిగా నిర్ణయించుకున్నారు.

అందువల్లనే, క్రికెట్ క్రీడలో ఉద్ధండులైన లివ్ రిచర్డ్స్, రికీ పాంటింగ్ వంటివారు సచిన్‌ను గౌరవించడానికి పోటీలు పడతారంటే, అందులో ఆశ్చర్యపడవలసినది ఏమీ లేదు. క్రికెట్‌లో గొప్పగా పోల్చాల్చి వచ్చినప్పుడు వారు సచిన్ పేరునే ప్రథమంగా ఉదహరిస్తారు.

అపూర్వమైన కీర్తి ప్రతిష్టలతో సచిన్ టెండూల్కర్ ఒక వైపు ఓలలాడుతుంటే, మన సొంత క్రికెటర్ అయిన వంగీపురపు వెంకట సాయి లక్ష్మణ్ (వి.వి.ఎస్ లక్ష్మణ్)కి మాత్రం అందవలసిన గుర్తింపు, గౌరవం ఎప్పుడూ అందలేదు. క్రికెట్ చరిత్రలో తనకు తగిన స్థానాన్ని డిమాండ్ చేయలేనంత మంచితనాన్ని, మెతక వైఖరిని వివిఎస్ లక్ష్మణ్ ప్రదర్శిస్తున్నాడు.



వివిఎస్ లక్ష్మణ్ అంటే 'వెరీ వెరీ స్పెషల్' అని పేరు పొందిన లక్ష్మణ్ అనేక సార్లు టీమిండియాను ఆపత్కాలంలో ఆదుకున్నాడు. ఓటమి అంచుల నుంచి జట్టును బయటకు లాగాడు.

2001లో కోల్‌కతాలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండవ టెస్ట్‌మ్యాచ్ అటువంటి వాటిల్లో మరీ మరీ గుర్తుకువస్తుంది. ఆ మ్యాచ్ నాటికి ఆస్ట్రేలియా అంతకు ముందు వరుసగా 16 టెస్ట్ మ్యాచ్‌లలో ఓటమి అనేది ఎరగకుండా గెలుస్తూ వస్తూ అజేయంగా నిలిచి ఉంది.

కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో భారత్ అప్పటికి ఓడిపోయి ఉంది. రెండవ మ్యాచ్‌లో కూడా భారత జట్టు తుడిచి పెట్టుకుని పోయే పరిస్థితులో ఉంది. ఫాలో ఆన్ తప్పని సరి పరిస్థితి ఏర్పడింది. అప్పుడు లక్ష్మణ్ తన బ్యాటింగ్‌తో మొత్తం దృశ్యాన్నే మార్చేశాడు. 281 రన్‌లు సాధించాడు.

ఉత్తమ టెస్ట్ ఇన్నింగ్స్‌లో అది ఆరవదని విజ్డన్ క్రికెట్ ఆల్మానాక్ రేటింగ్ ఇచ్చింది. వివిఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రావిడ్ కలసి 376 రన్‌లు చేశారు. ఓటమి కోరల్లోనుంచి లక్ష్మణ్ విజయాన్ని లాక్కున్నాడనే చెప్పాలి.

క్రికెట్ చరిత్రలో ఫాలో ఆన్ పరిస్థితుల్లోకి నెట్టబడిన ఒక జట్టు విజయం సాధించగలగడం అది కేవలం మూడవసారి మాత్రమే. లక్ష్మణ్‌ను పెవిలియన్‌కు పంపించడానికి ఆస్ట్రేలియన్ బౌలర్లు శతవిధాల ప్రయత్నించారు. కాని సాధించలేక పోయారు.

లక్ష్మణ్ మాదిరిగా ఆస్ట్రేలియాపై ఆధిపత్యం సాధించిన భారత బ్యాట్స్‌మన్ పెద్దగా లేరు. 2001లో సాధించిన 281 రన్ లే కాక, 2008 - 09లో ఢిల్లీలో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో కూడా లక్ష్మణ్ డబుల్ సెంచరీ సాధించాడు.

శ్రీలంక, పాకిస్తాన్, న్యూజీలాండ్‌లతో జరిగిన మ్యాచ్‌లలో కూడా లక్ష్మణ్ భారత జట్టును కష్టాలనుంచి బయటకు లాగాడు. గత ఏడాది కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో కూడా 143 రన్‌లు సాధించి, కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీతో కలసి మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆ మ్యాచ్‌లో ఓటమి పాలవుతున్న క్షణాల్లో భారత్ గెలిచి ప్రపంచలోనే నెంబర్ వన్ జట్టుగా నిలిచింది.

ఇటీవల డర్బన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో లక్ష్మణ్ 96 పరుగులు చేసి, భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. క్రికెట్ యాజమాన్యం, అదృష్టం లక్ష్మణ్ పట్ల న్యాయంగా వ్యవహరించటం లేదు. వివిఎస్ లక్ష్మణ్ గొప్ప బ్యాట్స్‌మాన్, కాని, అందుకు తగిన స్థానం లభించలేదు.

**ఈ గొప్ప తెలుగు క్రికెట్ క్రీడాకారుడ్ని చూసి**

**దేశం గర్విస్తోంది.**

**- దాసు కేశవరావు**

(అనువాదం : వై.సరోజ)

# గ్రామీణాభివృద్ధిపై ఒక సమగ్ర అవగాహనను కల్పిస్తున్న అపార్డ్ - టిస్ సర్టిఫికెట్ కోర్స్

**ఎ.ఎమ్.ఆర్-అపార్డ్ మరియు టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ వారు నిర్వహించిన 15 వారాల గ్రామీణాభివృద్ధి మరియు వికేంద్రీకృత ప్రణాళికలో సర్టిఫికెట్ కోర్సు సెప్టెంబర్ 13 నుండి ప్రారంభమై డిసెంబర్ 21న మగిసింది.**

మొత్తం 3 1/2 నెలల కార్యక్రమంలో మొదటి నాలుగు వారాలు తుల్జాపూర్ (మహారాష్ట్ర) లోని టిస్ కేంద్రంలో "ధృక్పథనిర్మాణం" (Perspective Building) అనే అంశం కేంద్రంగా శిక్షణాతరగతులు సాగాయి. గ్రామీణాభివృద్ధిలో ఎంతోసేవచేసిన, చేస్తున్న విశిష్ట, మహోన్నత వ్యక్తిత్వం గల వ్యక్తులతో తరగతులలో ఇంటరాక్షన్ ఒక గొప్ప అనుభూతి. ముఖ్యంగా "సరోలా" అనే గ్రామం, "నలదుర్గ్" అనే చారిత్రాత్మక ప్రాంతం, తుల్జాపూర్ పంచాయతి సమితి, ఉస్మానాబాద్ జిల్లా కార్యాలయాలను క్షేత్ర పరిశీలనలో భాగంగా వెళ్ళి చూడటం జరిగింది.

హైదరాబాద్‌లోని అపార్డ్ కేంద్రంలో మిగతా రెండున్నర నెలల కార్యక్రమం కొనసాగింది. దీనిలో భాగంగా 4 రాష్ట్రాల నుండి, ఇతర ప్రముఖ ఎన్.జి.ఓల నుండి వచ్చిన నిపుణులతో తరగతులలో ఇంటరాక్షన్‌వలన, కొన్ని ఆదర్శప్రాయమైన ఉత్తమ ఆచారణాత్మక పద్ధతులను అవలంబిస్తున్న (Best Practices) గంగదేవిపల్లి, పంచాయితీ ఎన్.జి.ఓ. వాసన్, హాజిపల్లి పంచాయితీ వంటి ప్రదేశాలను దర్శించటం వల్ల ఎంతో ప్రేరణ కలిగించింది.

భారత దేశ మౌలిక సూత్రమైన "భిన్నత్వంలో ఏకత్వం" అనేది మా బ్యాచ్‌లో కూడా ప్రతిఫలించింది. 5గురు మండల అభివృద్ధి అధికారులు, 6గురు విస్తరణాధికారులుతో పాటు 12 మంది విద్యార్థులున్న బ్యాచ్‌లోని నలుగురు జమ్మూకాశ్మీర్, మణిపూర్, ఉత్తరప్రదేశ్ & కేరళ రాష్ట్రాలకు చెందిన వారవటంతో శిక్షణ కార్యక్రమానికి వీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కోర్స్‌లో పాల్గొన్నవారి అభిప్రాయాలు వారి మాటల్లోనే!



ఈ శిక్షణ "గ్రామీణాభివృద్ధి" అనే అంశంపట్ల నా ఆలోచనా విధానాన్ని, వైఖరిని పూర్తిగా మార్చివేసింది గ్రామీణాభివృద్ధి రంగంలోని నిపుణులను కలసుకునే అవకాశం కలిగింది.
**అరుణ్,** ఎం.బి.ఏ కొచ్చిన్, కేరళ



ఈ శిక్షణ మా వంటివారికి కరదీపిక వంటిది. ఎంతగానో ఉపయోగపడుతుంది.
**పల్లా గోవర్ధన్,** యం.పి.డి.ఓ. మహబూబ్‌నగర్



సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించేటప్పుడు అవసరమైన నైపుణ్యాలు ఈ శిక్షణ వల్ల తెలుసుకోగలిగాను. గ్రామస్థాయిలోని ప్రజలలోని విభిన్నత్వాన్ని, దగ్గరనుండి దర్శించగలిగే అవకాశం కలిగింది.
**శైలేష్**ఎం.వి యం.పి.డి.ఓ., మెదక్ జిల్లా



ప్రజల భాగస్వామ్యం, పరిపాలనను ఎంతగా ప్రభావితం చేస్తోంది, ప్రత్యక్షంగా అర్థం చేసుకోగలిగాను. ఇంకా మేం చేయవలసిందిఎంతో ఉందని తెలుసుకున్నాను.
**కె. జాన్‌లింకన్** పంచాయతీ & గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి, పశ్చిమగోదావరి జిల్లా



ఈ శిక్షణ అభివృద్ధిపట్ల నాదృక్పథాన్ని మరింత విస్తృతం చేసింది. ఎటువంటి సవాళ్ళనైనా ఎదుర్కొనేందుకు నన్ను సన్నద్ధం చేసింది. **నీరజ్‌శర్మ,** ఉదంపూర్, జమ్మూ & కాశ్మీర్



శిక్షణకు రాకముందు, సోషల్‌వర్క్ అంటే ఎంతో పరితమైంది అని అనుకునేవాడిని. ఈ శిక్షణ నా దృక్కోణాన్ని విస్తృతం చేసింది.
**రాంబాబు,** MSW తూర్పుగోదావరి జిల్లా



కేరళ గ్రామపంచాయతీ వ్యవస్థ గుర్చి తెలుసుకొనడం నన్ను బాగా ప్రభావితం చేసింది. తప్పకుండా నా మండలంలో కొన్ని ఉత్తమ పద్ధతులు అమలు చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తాను. **శ్రీకాంత్‌రెడ్డి** విస్తరణాధికారి, నల్లగొండజిల్లా



గ్రామీణాభివృద్ధి రంగం అంటే నాకు బాగా ఆసక్తి గ్రామీణాభివృద్ధిలో ఐ.టి. రంగపాత్ర విఫులంగా తెలుసుకున్నాను. ఈ దశలో ఇంకా నేను నా పని మెరుగుపర్చుకునే విధంగా, శిక్షణ నాకు తోడ్పడింది.
**రాజు. పి.** ఎం.ఎస్.సి. ఎం.ఫిల్, కర్నూలు జిల్లా



గ్రామపంచాయతీల పనితీరు, వాటి అభివృద్ధికి అవసరమైన ప్రజా భాగస్వామ్య పద్ధతులు ఎంతగానో నచ్చాయి. వాటిని నా మండలంలో అమలు చేస్తాను.
**యన్.వి.రామ చంద్రమూర్తి** యం.పి.డి.ఓ. శ్రీకాకుళం జిల్లా



గ్రామీణాభివృద్ధి గూర్చి శిక్షణకు రాకుముందు నాకు అంతగా తెలియదు. గ్రామీణాభివృద్ధిలో యువత అవకాశాలగూర్చి తెలుసుకున్నాను. యువత పాత్ర మెరుగు పర్చేవిధంగా ప్రయత్నిస్తాను. **మహ్మద్ ఆసిఫుద్దీన్,** ఎం.బి.ఎ. ఎన్.ఐ.ఐ.టి. నర్కాల్, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్, మహబూబ్‌నగర్ జిల్లా



SthanikaPalanaTel_February_2011_Colour_2.p16d 2/1/2011, 10:17 PM



అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు, విద్యావేత్తలతో ఇంటరాక్షన్ చాలా బాగుంది. గ్రామీణ పేదరికాన్ని తొలగించేందుకు, నిపుణుల సూచనలతో ప్రజాభాగస్వామ్య పద్ధతిలో ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసేందుకు ప్రయత్నిస్తాను. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిపాలనా పద్ధతుల తులనాత్మక పరిశీలన బాగుంది.

**జె. రాంబాబు,** పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి, తూర్పుగోదావరి జిల్లా



గ్రామీణాభివృద్ధిలోని మహోన్నత వ్యక్తులను కలుసుకోవడం, ఎంతో ప్రభావితం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్రామీణాభివృద్ధి ప్రస్తుత దృశ్యాన్ని తెలుసుకోగలిగాను. మన స్థానాన్ని అంచనా వేయగలిగాను.

**కె. రమణమూర్తి,** పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి, రంగారెడ్డి జిల్లా



ఈ శిక్షణ, 'అభివృద్ధి' పై నా దృష్టి కోణాన్ని వ్యక్తిగత అభివృద్ధి నుండి సమిష్టి అభివృద్ధిగా మార్చివేసింది. నా ఆలోచనలను శిక్షణలో క్షేత్రపర్యటనలు ఎంతగానో ప్రభావితం చేశాయి. మేనేజ్‌మెంట్‌లోని గెలుపు- గెలిపించు సూత్రాన్ని ఇకపై తప్పనిసరిగా అమలు చేస్తాను.

**కిమ్ హాకిప్,** మణిపూర్



కేరళ రాష్ట్రానికి సంబంధించిన People Planning Compaign ఎంతగానో ఆకట్టుకుంది. ఇంకా వరంగల్ జిల్లాలో మారని గ్రామీణఆర్థిక స్థితిగతులు నా ఆలోచనలను మార్చాయి. వీటిని మార్చేందుకు నా ప్రయత్నం చేస్తాను.

**ఎ. రాజమౌళి, యం.పి.డి.ఓ,** మణిపూర్



క్షేత్ర పర్యటనలు నా దృక్పథాన్ని మార్చాయి ఈ శిక్షణ వల్ల నా పై నాకు నమ్మకం పెరిగింది.

**శివశంకర్ గౌడ్,** MSW, మహబూబ్‌నగర్



నేను మరింతగా గ్రామీణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచే మెథడాలజీ గూర్చి నేర్చు కోగలిగాను.

**చెన్న రాఘవేంద్రనాథ్,** పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి, కడప జిల్లా



ప్రజల భావజాలంలో మార్పుతేవాలనే ఉద్దేశ్యంతో ఈ శిక్షణకు వచ్చాను. నా ఆలోచనా విధానంలో ఈ శిక్షణ స్పష్టమైన మార్పు తీసుకుని వచ్చింది.

**సురేందర్ సపావత్,** ఆదిలాబాద్ జిల్లా



శిక్షణకు రాకముందు, గ్రామీణాభివృద్ధి గూర్చి నాకు తెలియదు. ప్రజలను ప్రభుత్వ కార్యక్రమంలో మరింతగా మమేకం చేసేందుకు నావంతు ప్రయత్నం చేసేందుకు, ఈ శిక్షణ నన్ను ప్రేరేపించింది.

**సాయిబాబు,** MSW, నిజామాబాద్ జిల్లా



ఏజెన్సీ ప్రాంతాలలో పనిచేసేందుకు అవసరమైన సామర్థ్యాలను ఇన్నవేషన్ టెక్నాలజీ ఉపయోగం, జి.ఐ.యస్ టెక్నాలజి వాడకం వంటివాటిని ఈ శిక్షణలో నేర్చుకున్నాను.

**ఎ. మంజువాణి,** యం.పి.డి.ఓ. విశాఖపట్నం



విషయ నిపుణులు చెప్పిన కొత్త కొత్త అంశాలు, క్షేత్ర పర్యటనలు ఎంతగానో ఉపకరించే విధంగావున్నాయి. భవిష్యత్తులో వాటినే అమలు పరుస్తాను.

**తీగల శంకర్,** పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి, వరంగల్ జిల్లా



శిక్షణకు రాకముందు, నేను చదివిన కోర్సునే లోకంగా భావించాను. ఈ శిక్షణ వల్ల నేను తెలుసుకోవాల్సిన, నేర్చుకోవల్సిన, చేయవల్సింది ఎంతో ఉందని అర్థమైంది.

**బి. సతీష్,** MSW, వరంగల్ జిల్లా



గ్రామీణాభివృద్ధి అనేది ఎంతో విస్తృతమైన రంగం, సిద్ధాంతపరమైన విషయాలకు, యదార్థంగా జరుగుతున్న నిజానికి మధ్య ఉన్న తేడా, నన్ను ఎంతగానో ఆలోచింపచేస్తూఉంది. ఇంకా ఈ విషయంలో అవగాహన రావడానికి నేనెంతో దూరం ప్రయాణించాలి. ఈ శిక్షణ నాకు, నేనెక్కడ ఉన్నానో తెలుసుకునేలా చేసింది.

**కోమల్‌ఖేర్,** లక్నో, ఉత్తర్‌ప్రదేశ్



అభివృద్ధికి సంబంధించి, మేథావుల దృక్పథానికి, అమలు జరుగుతున్న విధానానికి మధ్య ఉన్న వ్యత్యాసం అర్థమయ్యేలా చేసింది ఈ శిక్షణ దీనిని తగ్గించేందుకు, శాయశక్తులా కృషి చేయడానికి అవసరమైన సామర్థ్యాలను అందించింది.

**తరుణ్ చక్రవర్తి,** పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి, మెదక్ జిల్లా



SthanikaPalanaTel_February_2011_Colour_2.p17d 2/1/2011, 10:17 PM

# పాఠశాల పారిశుద్ధ్యం - వ్యక్తిగత పారిశుద్ధ్యం

రాష్ట్ర జాబితాలో అంశాలుగా ఉన్న ప్రాథమిక విద్య, నీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు బదలాయించవలసిన అధికారాలు జాబితాలోనికి చేరినవి. ఈ క్రమంలో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధనకై 1999లో కేంద్రప్రభుత్వం సంపూర్ణ పారిశుద్ధ్యం ఉద్యమాన్ని చేపట్టింది.

సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమంలో గ్రామాలలోని ప్రతి కుటుంబంలో వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మాణం, మరియు అన్ని పాఠశాలలో బాలురకు బాలికలకు విడివిడిగా మరుగుదొడ్ల నిర్మాణం ప్రధాన అజెండగా ప్రారంభమైనది. సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించడంలో పాఠశాల పారిశుద్ధ్యం మరియు వ్యక్తిగత పరిశుభ్రత ప్రధాన పాత్ర కలిగి ఉండడంను గుర్తించి ఆ దిశగా పిల్లలుకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో దేశ వ్యాప్తంగా పాఠశాల పారిశుద్ధ్యం మరియు వ్యక్తిగత పారిశుద్ధ్యం అంశాన్ని ఒక కార్యక్రమంగా రూపొందించడం జరిగింది.

## పాఠశాల పారిశుద్ధ్యం

## వ్యక్తిగత పారిశుద్ధ్యం ప్రాధాన్యత (SSHE)



బాల్యంలో పిల్లలు తమ ఇంటి తర్వాత ఎక్కువ సమయం వెచ్చించేది పాఠశాలలోనే. బాల్యంలో పిల్లలు చెప్పిన విషయాలను ఆకళింపు చేసుకోవడం లోనూ, వాటిని అనుసరించడం లోనూ ముందుంటారు. కనుక మంచి అలవాట్లను అనుసరించడానికి అదే సరైన సమయం.

భారతదేశంలోని పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పిల్లలకు సంక్రమించే సగానికి రోగాలకు ప్రధాన కారణం



అపరిశుభ్ర పరిసరాలు మరియు వ్యక్తిగత పరిశుభ్రత లోపించడంగా తేలినది.

## అపరిశుభ్ర పరిసరాలు అంటే ?

స్కూలు పరిసరాలు చెత్తా చెదారంలో నిండియుండటం. బహిరంగ మల విసర్జన వలన మల అవశేషాలు కలిగి ఉండడం మరియు మురుగు నీరు నిల్వ ఉండటం వీటికి తోడు పాఠశాల మరుగు దొడ్ల అపరిశుభ్రంగా ఉండడం వీటిలో ఏదైనా కొన్ని కారణాలు కావచ్చు లేదా అన్ని కారణం కావచ్చు.



విద్యార్థులు, విద్యార్థినులు క్రింది అంశాలను పాటించక పోవడం వ్యక్తిగత అపరిశుభ్రతకు దారి తీస్తుంది.

## వ్యక్తిగత పరిశుభ్రత అంటే

+ ప్రతి రోజు స్నానం చేయడం.
+ వారానికోసారి తలస్నానం చేయడం
+ ఉతికిన దుస్తులు (శుభ్రమైన దుస్తులు) ధరించడం
+ చేతిగోళ్ళు తొలగించు కోవడం
+ భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవటం
+ మూత్ర విసర్జన, మలవిసర్జన అనంతరం సబ్బుతో చేతులనూ కాళ్ళనూ శుభ్రపరచు కోవడం

పై నియమాలు పాటించక పోవడం వ్యక్తిగత పరిశుభ్రత లోపించి రోగాల వ్యాప్తికి అవకాశం ఏర్పడతుంది.

## కొన్ని నమ్మలేని నిజాలు

+ ప్రతి రోజు మన దేశంలో 1000 పైగా చిన్నారులు డయేరియాతో చనిపోతున్నారు.
+ మన భారతదేశ జనాభాలో 65 కోట్లు ప్రజలు నేటికీ బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు.
+ మన దేశంలో 35% స్కూళ్ళలో మరుగు దొడ్లు లేవు వున్న మరుగుదొడ్లలలో కూడా ఎక్కువ శాతం ఉపయోగించక పోవడమే లేక ఉపయోగించడానికి వీలుగా లేకపోవడమే ఉన్నవి.
+ 80% వ్యాధులకు వ్యాధి కారకాలు మన చేతులు ద్వారా వ్యాపిస్తున్నాయి. అని చెప్పవచ్చు.
+ మధ్యాహ్న భోజన పథకం పై నిర్వహించిన ఒక అధ్యయనంలో 42% పిల్లలకు సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవలసిన అవసరంపై అవగాహన ఉన్నా కేవలం 12% పాఠశాలలో చేతులు శుభ్రపరుచుకునేందుకు సబ్బు అందుబాటులో వున్నది.



SthanikaPalanaTel_February_2011_Colour_2.p16d 2/1/2011, 10:17 PM

+ భారతదేశంలో మరుగుదొడ్లు అందుబాటులో లేక 10 మంది బాలికలకు గాను 4 గురు బాలికలు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు.

### పరిష్కారం దిశగా కొన్ని మార్గాలు

పాఠశాల పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత కార్యక్రమం విజయవంతం కావాలంటే ఇందులో కేంద్రప్రభుత్వం, స్థానిక సంస్థలు, ఉపాధ్యాయులు పిల్లలు, వారి తల్లి దండ్రులు, సమాజంలోని వ్యక్తులు అందరూ కీలక భూమిక పోషించాలి. వీరందరూ ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాఠశాల పారిశుధ్యం మరియు వ్యక్తిగత పారిశుధ్యంలో భాగస్వాములే పారిశుధ్యం కార్యక్రమాన్ని అమలు జరిపి సంపూర్ణ సాధనలో ఆశించిన పురోగతిని సాధించడానికి క్రింది విధానాలను అనుసరించవచ్చు.




### 1. శిక్షణా కార్యక్రమములు

పాఠశాల పారిశుధ్యం, వ్యక్తిగత పారిశుధ్యంలపై ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు, పిల్లలకు అవగాహన కల్పించాలి. అందులో భాగమే ఈ యస్.యస్.హెచ్.ఇ. టీచర్ల ద్వారా పిల్లలుకు శిక్షణా తరగతులు నిర్వహించడం ద్వారా మన హెచ్చు స్థాయి విద్య ప్రమాణాలు సాధించవచ్చు అంతేకాక, పిల్లలు వారధులుగా పనిచేసి వారు నేర్చుకున్న, పాటిస్తున్న అంశాలను తమ తల్లి తండ్రులకు తద్వారా సమాజానికి అవగాహన కల్పించగలుగుతారు.

### 2. పోస్టర్ల ప్రదర్శన

పిల్లలకు సులభరీతలో అర్ధమయ్యే విధంగా పారిశుధ్యం, ఆరోగ్యం అంశాలపై రూపొందించిన పోస్టర్లను స్కూలు తరగతి గదులలో ప్రదర్శించినట్లయితే వారు ఏమి చేయవచ్చు, ఏమి చేయకుడదో చక్కగా తెలుసుకోగల్గుతారు.

### 3. బెస్ట్ ప్రాక్టీసెస్

పిల్లలకు భోజనం సమయంలో చేతులు కడగకోవటం, మలవిసర్జన



అనంతరం చేతులను శుభ్రపరుచుకొనేటట్లు కార్యక్రమం రూపొందించి అమలు పెంచడం ద్వారా వారిలో మంచి అలవాట్లను పెంపొందించవచ్చు. ఉదాహరణకు ప్రతి బుధవారం స్కూలులో పిల్లలు చేతిగోళ్ళను కత్తిరించుకున్నది లేనిదీ గమనించడం ద్వారా చేతిగోళ్ళు తొలిగించుకోవలసిన అవసరాన్ని పిల్లలకు, తల్లిదండ్రులకు తెలియజేయడం.

### 4. పిల్లల క్లబ్‌లను, పాఠశాల ఆరోగ్యం మరియు పారిశుద్ధ్య క్లబ్‌లు ఏర్పాటు

ఈ తరహా క్లబ్‌లను పిల్లలు మరియు టీచర్లతో ఏర్పాటు చేయడం ద్వారా ప్రభావవంతమయిన మరియు గుణాత్మక మార్పులను సాధించవచ్చు.

### 5. పాఠశాలలో హెల్త్ చెకప్స్, క్యాంపుల ఏర్పాటు

పాఠశాలలో తరుచుగా హెల్త్ కాంప్స్ ఏర్పాటు చేసి చెకప్స్, వాక్సినేషన్, డి - వార్మింగ్ మొదలగునవి నిర్వహించి హెల్త్‌కార్డులు మంజూరు చేయడం ద్వారా విద్యార్థులలో ఆరోగ్యం పట్ల, పారిశుద్ధ్యం అవగాహన మెరుగుపవుతాయి.

పై కార్యక్రమాల ద్వారా పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులలో పారిశుధ్యం వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించి వారి ప్రవర్తనలో మార్పు సాధించి తద్వారా వారి తల్లి దండ్రులను ప్రవర్తనా సరళిని తద్వారా సామాజికంగా మార్పు సాధించవచ్చు.

- పి.మాధురి

జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డ్



SthanikaPalanaTel_February_2011_Colour_2.p39d 2/1/2011, 10:17 PM



# గుడి పల్లి శ్రీ వరి సేద్యం అందరికీ ఆదర్శం

వరి పండించడం అయితే సరే కాని శ్రీవరి పండించడం చాలా కష్టం అనుకునే రైతులందరికీ అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి అందరికీ ఆదర్శం. 2008 సంవత్సరంలో ఈ గ్రామంలో 1 ఎకరా నందు శ్రీవరి మహిళ సమాఖ్యలతో నిర్వహిస్తున్న సుస్థిర కార్యక్రమంలో భాగంగా గ్రామ కార్యకర్త కడపల్లి వెంకట రామనప్ప ప్రోధ్బలంతో శ్రీ, సూరప్ప చేయటం జరిగింది. శ్రీవరి సేద్యం మొదలుపెట్టి 50 బస్తాలు పండించడం జరిగింది. అంతే కాకుండా ఈ రైతు పురుగు మందులు లేకుండా ఈ వ్యవసాయం చేయటం జరిగింది. ఎరువులు తగ్గించడంలో భాగంగా శ్రీవరి నందు అజొల్లా కూడా వేయటం జరిగింది.

తరువాతి సంవత్సరం 2009-10 లో శ్రీవరి సేద్యాన్ని 8 ఎకరాలలో ఆరుగురు రైతులతో చేయటం జరిగింది. మొదటి సంవత్సరం శ్రీవరి వేసిన రైతు రెండవ సంవత్సరం కూడా 2 ఎకరాలలో వేయటం జరిగింది. ఈ సంవత్సరం అనగా 2010-11 నందు 47 మంది రైతులు 115 ఎకరాలలో శ్రీవరి సేద్యాన్ని చేయటం జరుగుతున్నది. ఇందులో మరో విషయం ఏమిటంటే, 15 మంది రైతులు భూమిని లీజుకు తీసుకొని 30 ఎకరాలలో శ్రీవరి సేద్యం చేయటం జరుగుతున్నది. ఈ శ్రీవరిని మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులను హర్యానా రాష్ట్రానికి చెందిన IAS అధికారులు, చాలా మంది ప్రక్క గ్రామాలు, మండలాలకు చెందిన రైతులు చూసి, రబి నందు కూడా ఈ శ్రీవరి సేద్యం చేస్తూ ఉండటం గమనించి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విజయమే కాకుండా అనంతపూర్ జిల్లాలో కనీసం మరో 1000 ఎకరాలలో శ్రీవరి సేద్యాన్ని వచ్చే ఖరీఫ్ నందు చేపట్టటం జరుగుతుంది.

**- పొట్టెళ్ళ పెంచల కుమార్**
**- కిల్లి జయరామ్, విశ్వశ్రీ**





SthanikaPalanaTel_February_2011_Colour_1.p6nd 2/1/2011, 10:00 PM

# పంటల్ని కాపాడుకుందాం

**ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వివిధరకాల పురుగులు, తెగుళ్ళు ఆశించి పంటల దిగుబడులను గణనీయంగా తగ్గించి రైతులకు నష్టాలు కలుగు చేస్తాయి. పంటలను జాగ్రత్తగా గమనిస్తూ సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అమలు చేసినట్లయితే దిగుబడులు తగ్గకుండా చూసుకోవచ్చు. వివిధ పంటలలో ప్రస్తుత తరుణంలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకుందాం.**

## వరి

***అగ్గితెగులు :*** రాత్రి ఉష్ణోగ్రతలు $18^0$ నుండి $22^0$ సెల్సియస్ మధ్య ఉండి మంచు లేదా వర్షపు జల్లులు పడే వాతావరణంలో అంటే నవంబర్ నుండి ఫిబ్రవరి మాసం వరకు అగ్గి తెగులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నత్రజని ఎరువులు ఎక్కువగా వాడినపుడు కూడా ఈ తెగులు వ్యాప్తి ఎక్కువగా వుంటుంది. వరి ఆకుల పైన నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడతాయి. మచ్చల అంచుల గోధుమ రంగులోను మధ్యభాగం బూడిదరంగులోను ఉంటుంది. ఆకులు ఎండిపోయి తగల బడినట్లు కనిపిస్తాయి. వెన్నుల మెడభాగంలో తెగులు ఆశించినపుడు వెన్నులు విరిగిపోతాయి.

అందుకే దీనిని మెడ విరుపు తెగులు అని కూడా అంటారు. 5 శాతం ఆకుల మీద ఈ తెగులు లక్షణాలు కనిపిస్తే మందులు చల్లుకోవాలి. ట్రైసైక్లోజోల్ 75 శాతం మందు ఒక లీటరు నీటికి 0.6 గ్రా॥ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. లేదంటే ఎడిఫెన్‌ఫాస్ ఒక లీటరు నీటికి యం.టి.యు 1001, యం.టి.యు 3626, ఐ.ఆర్.64 ఫల్గుణ, పినాకిని, సింహపురి, తిక్కన, స్వాతి చందన సలీమ లాంటి రకాలు కొంతవరకు అగ్గితెగులును తట్టుకుంటాయి.

***పొట్ట కుళ్ళు తెగులు :*** రాత్రి ఉష్ణోగ్రత $20^0C$ కంటే తక్కువగా వుండి, మంచు పడటం, వాతావరణం చల్లగా వుండి గాలిలో తేమ ఎక్కువగా ఉంటే పొట్టకుళ్ళు తెగులు వ్యాప్తి ఎక్కువగా వుంటుంది. పోటాకు తొడిమల మీద నల్లటి రంగులో కాని గోధుమ రంగు / చాక్లెట్ రంగులో మచ్చలు వచ్చి వెన్నులు పొట్టతో కుళ్ళిపోతాయి. పొట్ట దశలో ఒకసారి, వారం రోజుల వ్యవధి ఇచ్చి మరోసారి కార్బండిజమ్ నందు లీటరు నీటికి 1 గ్రా॥ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

***రెల్లరాల్చు పురుగు*** : వీటి గొంగళి పురుగులు గింజగట్టి పడే దశలో వెన్నులు కొరికి నష్టాన్ని కలుగచేస్తాయి. రాత్రి వేళల్లో మాత్రమే నష్టాన్ని కలుగ చేస్తాయి. పైరు ఈనిక దశలో చ॥మీ కి 4 నుండి 5 పురుగులు కనిపిస్తే సస్యరక్షణ మందులు చల్లుకోవాలి. రెల్లరాల్చుపురుగులను అదుపులో వుంచటానికి వాడే మందులు సాయంత్రపు వేళల్లో మాత్రమే చల్లుకోవాలి. క్లోర్ పైరిఫాస్ 1 లీ. నీటికి 2.5 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.




***వరికంపు నల్లి*** : వీటి పిల్ల పురుగులు, పెద్ద పురుగులు గింజ పాలు పోసుకునే దశలో రసాన్ని పీల్చటం వలన గింజలు తాలుపోతాయి. ఇవి ఆశించిన పొలం నుండి ఒక విధమైన దుర్వాసన వస్తుంది. దుబ్బుకి 1 లేక 2 పురుగులు కనిపిస్తే పురుగు మందులు చల్లుకోవాలి. ఎండోసల్ఫాన్ 2 మి.లీ లేదా మోనో క్రోటోఫాస్ 1.6 మి.లీ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ మందులు కూడా సాయంత్రం వేళల్లో మాత్రమే చల్లుకోవాలి.



## మిరప

మిరపతో 'త్రిప్స్' అనే పురుగులు ఆశించి ఆకులతో రసాన్ని పీల్చటం వలన ఆకులు అంచులు పైకి ముడుచుకుంటాయి. దీనినే 'పై ముడత' అంటారు. దీని వలన ఆకులు, పిందెలు రాగి రంగులోకి మారి పూర్తి పిందె నిలిచిపోతుంది. ఈ పై ముడతను అదుపులో ఉంచటానికి ఈ క్రింది మందులలో ఏదైనా ఒకదానిని పిచికారీ చేయవచ్చు.

కార్బరిలో 3 గ్రా లేదా ఫషలీన్ 3 మి.లీ లేదా మోనోక్రోటిఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేటు 1 గ్రా.

ప్రివోనిల్ 2 మి.లీ - ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పై ముడతకు మందులు



Sthanka_FebBW.indd 30 01/02/11 10:14 PM

చల్లేటపుడు ఆకుల అడుగుభాగం బాగా తడిచేలా పిచికారీ చేయాలి. పై ముడతతో పాటు కింది ముడత కూడా వుంటే కార్బరిల్, ఎసిఫేట్ మందులు చల్ల కూడదు. రసాయన, సేంద్రీయ ఎరువుల మధ్య సమతూకం పాటించాలి.

తెల్లనల్లి పురుగులు ఆకుల రసాన్ని పీల్చటం వలన ఆకులు క్రిందికి ముడుచుకుని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. ఆకుల కాడలు సాగి ముదురు ఆకుపచ్చగా మారతాయి. మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. లేత ఆకులు ముద్ద కడతాయి. డైకోఫార్ 5 మి.లీ లేదా నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకలు అడుగు భాగంలో మందు తగిలేలా పిచికారీ చేయాలి.

ప్రసుత్త వాతావరణ పరిస్థితులలో మిరపతో బ్యాక్టీరియా ఆకుపచ్చ తెగులు, కైనోఫోరా కొమ్మ కుళ్ళు తెగులు ఆశించే అవకాశం వుంది. వీటిని అదుపులో వుంచటానికి 10 లీటర్ల నీటికి 30 గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ 1 మి.లీ స్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారీ చేయాలి.

## మామిడి

***తేనె మంచు పురుగు :*** ఈ పురుగులు రసాన్ని పీల్చటం వలన పూత పూర్తిగా మాడిపోయి పిందె పట్టదు. లేత ఆకులు, లేత కొమ్మల నుండి కూడా రసం పీల్చటంతో ఆకులు ముడత పడి అంటుకొని సరిగా పెరగవు.

ఫాస్ఫోమిడాన్ లీటరు నీటికి 0.5 మి.లీ లేదా మోనోక్రొటోఫాస్ 1.5 మి.లీ లేదా కార్బరిల్ 3 గ్రా. పిచికారీ చేయాలి. పూత మొదలయ్యే సమయం, పిందెల తయారయ్యే సమయంలో పూత, ఆకుల పైనే కాకుండా మొదళ్ళ పైనా కొమ్మల పైన కూడా పిచికారీ చేయాలి.

## కూరగాయ తోటలు

వంగ, బెండ, టమాటో, చిక్కుడు మొక్కలను కాయతొలిచే పురుగులు, క్యాబేజి, కాలీఫ్లవర్ లను ఆకులు తొలిచి పత్రహరితాన్ని తినే పురుగులు ఆశించి కూరగాయల నాణ్యతను, దిగుబడులను తగ్గించి రైతులను నష్టపరుస్తాయి. వీటి నివారణకు కార్బరిలో 50% 3 గ్రా లేదా డైక్లోరోలాస్ 1 మి.లీ లేక మలాథియన్ 2 మి.లీ ఒక లీటరు నీళ్ళలో కలపి పిచికారీ చేయాలి. తెల్ల నల్లి, పేను బంక ఆశించినపుడు పూత, పిందె రాలిపోతాయి. ఇవి విసర్జించే తేనె మంచువలన మసి తెగులు వ్యాపిస్తుంది.

వీటిని అదుపులో వుంచటానికి డైక్లోరోవాన్ 1 మి.లీ లేక మలాథియాన్ 2 మి.లీ. లేక డైమిథోమేట్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తయారైన కాయలు కోసి మందులు చల్లాలి. తర్వాత 10 రోజులు కాయలు కోయకూడదు.

క్యాబేజి, కాలిఫ్లవర్ పంటల నాశించే డైమండ్ బ్లాక్ మాత్ నివారణకు వారానికి ఒకసారి చొప్పున ఎన్.పి.వి అనే వైరస్ ద్రావణాన్ని నాలుగుదశలుగా పిచికారీ చేయాలి. 200 లీటర్ల నీటికి 250 యల్.ఇ. (Larval equivalent) ద్రావణం చల్లుకోవాలి. ఆవాలు పంటను ఆకర్షణ పంటగా వేసుకోవాలి.

## ధనియాలు

ధనియాలు పైరులో పొగాకు లద్దె పురుగులు ఆశించి ఆకులు, పూత, గింజలను తిని నష్టాన్ని కలుగజేస్తాయి. వీటి నివారణకు క్వినాల్ ఫాస్ లీటరు నీటికి 2 మి.లీ లేదా క్లోరి పైరిఫాస్ 2.5 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఇలా వివిధ పంటలలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటూ ఖరీఫ్‌లో నాటుకున్న పంటల కోతలు, నిల్వ, మార్కెటింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి.

## వరి

దీర్ఘకాలిక వరి రకాలు, ఖరీఫ్‌లో ఆలస్యంగా నాట్లు అయిన ప్రాంతాల్లోనూ వరి కోతలు జరుగుతుంటాయి. వెన్నులోని 75 శాతం గింజల పక్వానికి వచ్చిన తర్వాత, కాండం పచ్చగా ఉన్నపుడే కోత కోయటం మంచిది. పూత దశ నుండి కోతకు సుమారుగా 28-32 రోజుల వ్యవధి తీసుకొంటుంది. ఈ దశలో గింజల్లో సుమారు 18-24 శాతం తేమ ఉంటుంది. పనులను ఆరనిచ్చి, కల్లంలో నూర్చి, ధాన్యాన్ని నిల్వచేయటం మంచిది.

## కంది

దీర్ఘకాలిక కంది రకాలు కూడా కోతకు సిద్ధంగా వుంటాయి. పూత 2 నెలల వరకు పూస్తూనే వుంటుంది. అందువలన అన్ని కాయలు ఎండిన తర్వాతనే కంది పంటను కోయాలి. ఎండిన తర్వాత కట్టెలతో కొట్టి కాయల నుండి గింజ వేరు చేయాలి. కందులను బూడిద కలిపి గాని, వేప ఆకులను కలిపి గాని నిల్వ చేస్తే పురుగులు ఎక్కువగా ఆశించకుండా వుంటాయి. బాగా ఎండిన తర్వాత నిల్వ చేస్తే మంచిది.

## చెఱకు

చెఱకు తోటలు నరికి, బెల్లం వండేందుకు అనుకూల సమయం బాగా పక్వానికి వచ్చిన చెఱకును భూమట్టానికి నరికి వెంటనే





Sthanka_FebBW.indd 31 01/02/11 10:14 PM

గానుగాడి బెల్లం చేసుకోవాలి. తప్పని సరి పరిస్థితులలో వెంటనే బెల్లం వండలేకపోతే చెఱకు మోపులను నీడలో గుట్టంగా ఉంచి చెఱకు చెత్త కప్పి, పలచగా నీరు చెల్లితే చెఱకు తూకం, రస నాణ్యత తరుగుదల వుంటుంది.

### మిరప

మిరపలో ఎక్కువ దిగుబడులు పొందటానికి పండిన కాయల్ని ఎప్పటి కప్పుడు కోసి పట్టాలపై కాని, సిమెంట్ కళ్ళాలపై కాని ఆరబెట్టుకోవాలి. వర్షాధారపు పంటకు 3-4 కోతలు, నీటి ఆధారపు పైరుకు 6-8 కోతలు వస్తాయి. మిరప కాయలను మొక్కల మీద ఎక్కువ



పండనీయకూడదు. ఎక్కువగా పండితే నాణ్యత తగ్గుతుంది. పండిన కాయలను ఎప్పటికప్పుడు కోయటం వలన ఎక్కువ దిగుబడులు పొందవచ్చు. మిరపతో 10 శాతం తేమ మించకుండా నిల్వ చేసుకోవాలి.




నిల్వ చేయటానికి తేమ లేనటువంటి శుభ్రమైన గోనె సంచుల్లో కాయలు నింపాలి...

### వరిగడ్డిని సుపోషకంగా చేయటం

మన రాష్ట్రంలో ప్రధాన ఆహార పంట వరి. పశువులకు కూడా వరిగడ్డి ప్రధాన మేతగా వుంటుంది. అయితే వరిగడ్డిలో పోషక విలువలు తక్కువ. వరిగడ్డిలో పోషక విలువలు పెంచేందుకు ఎన్నో పరిశోధనలు జరిగాయి. రైతులందరికీ అందుబాటులోవున్న సులువైన పద్ధతి యూరియా వాడి వరిగడ్డిని సుపోషకంగా మార్చే పద్ధతి. వరిగడ్డిలో యూరియా కలిపే విధానాన్ని రైతులు సులభంగా నేర్చుకొని చేసుకోవచ్చు.

4 కిలోల యూరియాను 65 లీటర్ల నీటిలో కరిగించి యూరియా ద్రావణం తయారు చేయాలి. ఈ ద్రావణం 100 కిలోల వరిగడ్డిపై వాడటానికి సరి పోతుంది. వరిగడ్డిని భూమిపై పరచి యూరియా ద్రావణాన్ని కొద్దికొద్దిగా అన్ని వైపులా సమానంగా తడిసేలా చల్లాలి. ఒకే చోట ఎక్కువ మోతాదులో చల్లకూడదు. ఇలా ద్రావణం చల్లిన వరిగడ్డిని తొక్కుతూ గాలి చొరబడకుండా వాము తయారు చేసుకోవాలి.

గడ్డి వాములో గాలి చొరబడకుండా చుట్టూ నల్లటి పాలిథీన్ షీట్ కప్పాలి. గడ్డి వాముకు బదులుగా ఎత్తయిన ప్రదేశంలో చేసిన గుంటలలో కూడా వరిగడ్డిని నిల్వచేయవచ్చు. యూరియా ద్రావణం చల్లటానికి ముందు వరిగడ్డిలో కనీసం 50 శాతం తేమ వుండాలి. ఒక వేళ తేమ శాతం తక్కువగా వుంటే నీరు చల్లుకోవాలి. అందుకే అప్పుడే కోసిన వరిగడ్డి వాడటం వలన నీరు చల్ల వలసిన శ్రమ, ఖర్చు తగ్గుతాయి.

వామి నుండి గాని గోతి నుండి గాని వరిగడ్డిని తీసిన తర్వాత సుమారు 4,5 గంటల గాలిలో ఆరబెట్టిన తరువాతనే మేపుగా వాడాలి. లేనట్లయితే వరిగడ్డిలో రసాయనిక చర్యలకు గురికాని మిగులు అమ్మోనియా వాయువు ఘాటువాసన కలిగి వున్నందున పశువులు వెంటనే మేతకు అలవాటు పడవు. కొద్ది రోజులలో నెమ్మదిగా వీటికి అలవాటు బడి, తర్వాత ఇష్టంగా తింటాయి.

యూరియా వదార్థాల విలువ గణనీయంగా పెరుగుతుంది. వరి గడ్డిలో మాంసకృతుల పరిమాణం 3 నుంచి 5 శాతం పెరుగుతుంది. పాడి పశువులకు రోజుకి 8-10 కిలోల యూరియా చల్లిన వరిగడ్డి మేపుకోవచ్చు.

దీనివలన శరీర పోషణకే గాకుండా ఒకటి, రెండు లీటర్ల పాల దిగుబడికి సరిపడే మాంసకృత్తులను సమకూర్చవచ్చు.

***- జి. విజయకుమార్,*** *ఆకాశవాణి*



Sthanka_FebBW.indd 32 01/02/11 10:14 PM

# కన్నడ వేమన –సర్వజ్ఞుడు

**మూఢ విశ్వాసాలను, అర్థంలేని ఆచారాలను, కుల మత ద్వేషాలను నిశితంగా విమర్శిస్తూ మానవజాతిని జాగృత మొనర్చిన తెలుగువారి వేమన వలె నిద్రాణమైన కన్నడ ప్రజానీకాన్ని తట్టి లేపిన కన్నడ ప్రజాకవి సర్వజ్ఞుడు.**

**జీవిత మహోదధిని మథించి హాలాహలాన్ని మ్రింగి ప్రజలకు అమృతాన్ని పంచిన వేమన వలె లోకానుభవంతో క్రాంతదర్శియై జీవిత సత్యాలను ప్రజలకు బోధించిన మహనీయుడు సర్వజ్ఞుడు.**

ఇరువురూ రాగద్వేషాలకు అతీతులైన వైరాగ్యమూర్తులు, నిజాన్ని నిర్భయంగా చాటిన సంఘ సంస్కర్తలు. వేమన వాక్కులు వేదకోశాలైతే, సర్వజ్ఞుని పలుకులు విజ్ఞాన భాండాగారాలు.

ఇరువురి వ్యక్తిత్వాలలో ఎంతో సౌమ్యం కన్పిస్తుంది. ఇరువురి సూక్తులలో ఏక వాక్యత కొట్టివచ్చినట్లు కన్పిస్తుంది. సమాజంలోని లోపాలను అనునయంతో, ఆదరంతో అవగత మొనర్చుకొని చేదు నిజాలను హాస్యరస గుళికల్లా మలచి సమాజ రుగ్మతలను రూపు మాపటానికి కృషి చేశారు.

సర్వజ్ఞుడు కులమత భేదాలను తీవ్రంగా ఖండించాడు. వేమన లోకమంతా ధనం చుట్టూ తిరుగుతుందన్నాడు. "కులం గలవారు, గోత్రం గలవారు, విద్యచేత విర్రవీగు వారు, పసిడిగలవాని బానిస కొడుకులు" అన్నాడు.

సర్వజ్ఞుడు, "సడెవు దొందే భూమి, కుడివు దొందే నీరు సుడువగ్ని యొందె, యిరుతిరలు కులగోత్ర నడువె ఎత్తణడు సర్వజ్ఞ" (నడచు ధర యొక్కటె, కుడుచు నీరొక్కటే, కడకగ్గి గాలి దివి యొక్కటే కులగోత్రమనెదరు నడుమెట్లు?)

'వసుదైవ కుటుంబకమ్' అన్న సూక్తిని ఇరువురు చాటి చెప్పారు.

**వేమన**

*ఉర్వివారికెల్ల నొక్క కంచము పెట్టి*
*పొత్తుగుడుపి కలము పొలియ వేసి*
*తనలు వేయిబెట్టి, తగనమ్మ జెప్పరా।*

**సర్వజ్ఞుడు**

*ఊరెల్ల నెంటరు, కేరి యెల్లవు బళగ*
*ధారుణియో ఎల్ల కులదై వవాగిరలు*
*యారన్ను బిడలి సర్వజ్ఞ*

ఊరినిండా బంధువులు, అన్ని వీధుల్లో చుట్టాలు, ప్రపంచమే నా కులదైవమైనపుడు నే నెవరిని వదలుకోను?

జాతి మత కుల భేదాలను నిర్మూలించి, సమాజంలో సమతను విత్తుటకు ప్రయత్నించిన మహనీయుడు సర్వజ్ఞుడు.

*'జాతి హీనర మనెయ, జ్యోతి తాహీనవె*
*జాతి విజాతి యనబేడ, దేవనొలి*
*దాతనే జాత సర్వజ్ఞ'*

(జాతి హీనుల ఇంట వెలిగే జ్యోతి తక్కువైనదా? జాతి భేదములను పాటించవద్దు దేవుని మెప్పు పొందిన వాడే గొప్పవాడు)

'సదాచారం సద్వర్తనం, మానవులు సహజ ధర్మం' అన్నాడు.

*ఉత్తమద వర్ణిగళ ను తమరు యన బేడ -*
*మత్తె తన్నంత బగెవరనెల్లరను*
*ఉత్తమరు యొన్ను సర్వజ్ఞ*

(అగ్రవర్ణాలకు చెందిన వారే ఉత్తములు అనవద్దు. తనలాగే ఇతరుల ను గౌరవించువారు ఉత్తములు)

సర్వజ్ఞుడు జీవిత సత్యాలను తరచి చూచినవాడు. 'తన్నంతే పరర బగెదొడె కైలాస బిన్నాణ వక్కు' అంటే ఇతరులను ప్రేమించడమే కైలాసమన్నాడు.

శరీరాన్ని తీవ్ర వైరాగ్య పథం వైపు మళ్ళించడం కష్టం అంటూ-

*'బడెయ కట్టలు బహుడు*
*కడవనద సుడ బహుడు*
*బిడడె దేగులదొళిర బహుడు కరణగళ*
*తడె యువుడె కష్ట సర్వజ్ఞ'*

(జటలు పెంచవచ్చు,
కృష్ణాజినములను ధరించవచ్చు,
ఎల్లప్పుడు మందిరాల్లానే వుండవచ్చు
కాని, పంచేంద్రియ ధర్మములను
నిగ్రహించటం కష్టం)



తెలుగు సాహిత్య చరిత్ర



Sthanka_FebBW.indd 13 01/02/11 10:14 PM

సమాజంలో స్త్రీలకు ఉన్నత స్థానముండాలని సర్వజ్ఞుడన్నాడు.

*"హెణ్ణు మాయెయల్ల  న్ను మాయెయల్ల మనద ముందణాసెయే మాయె"*

(స్త్రీ మాయకాదు, ధనం మాయకాదు, మనసులోని దురాశే మాయ)

*నారి పరరుపకారి, నారి స్వర్గద దారి*
*నారి సకలరిగె హితకారి, మునిదరే*
*నారియే మారి సర్వజ్ఞ*

(మునిదరె - కోపగించుకున్న)

*హెణ్ణినిందలె యిహవు, హెణ్ణినిందలె పరవు*
*హెణ్ణింద సకల సంపదవు, హెణ్ణిల్ల*
*దణ్ణగళు యారు? సర్వజ్ఞ*

(స్త్రీల వలనే ఇహపరములు, వారివల్లనే సకల సంపదలు, స్త్రీల నొల్లని అన్న లెవరున్నారు?

సుసంసారియైన స్త్రీ వల్ల సంసారం స్వర్గమవుతుంది. స్త్రీ పురుషుల పరస్పర ప్రేమ గొప్పదంటూ.

*మనబంద హెణ్ణన్ను వినయదలి కరెదిర్దు*
*మనముట్టి బాళ్వే మాడిదరె అమృతద*
*కెనెయ సవిదంతె సర్వజ్ఞ*

(స్త్రీ పురుషులిరువురూ పరస్పరం అరమరికలు లేకుండా అన్యోన్యంగా జీవించటం అమృతంపై మీగడను తిన్నట్లు వుంటుంది)

వేమన -సర్వజ్ఞులు సమకాలికులనికొందరిఅభిప్రాయం.ఇరువురి బోధలలోని పోలికలను తెలుపునట్టి కన్నడ తెలుగు పద్యములు గల 'వేమన సర్వజ్ఞ సంవాదము' అన్న గ్రంథము శ్రీ రామలింగకవిచే పరిష్కరించబడి 1917లో బెంగుళూరులోని శ్రీ వేంకటేశ్వర ప్రెస్‌లో ముద్రింపనట్లు పరిశోధకులు పేర్కొన్నారు. ఇరువురూ సంఘ సంస్కరణ కొరకు తమ ఆశు కవితా శక్తిని ముమ్మరంగా వినియోగించినారనుట నూటికి నూరుపాళ్ళు నిజం.

**వేమన**

*ఎన్ని చదువులు చదివి ఏనీతి వినినను*
*హీనుడవ గుణంబు మానలేదు*
*బొగ్గు పాలగడగ పోవునా మలినంబు*

**సర్వజ్ఞుడు**

*హలవనోదిదరేను? చెలువ నాదరె యేను*
*కులవంత నాగి ఫలవేను?*
*లింగద ఒలిమె ఇల్లదంగె*

(ఎంత చదివిన నేమి? అందగాడైన నేమి? కులీనుడైన నేమి? శివుని అనుగ్రహం లేని వానికి)

**వేమన**

*ఒడలు బడలజేసి యోగులు మనువారు*
*మనసు కల్మషంబు మాన్పలేరు*
*పుట్టమీద గొట్ట భుజంగంబు జచ్చునా?*

**సర్వజ్ఞుడు**

*ఒడలు దండిసి ముక్తి పడెవెనెంబువ హెడ్డ*
*బడిగెయలి హుత్త దెయబడిగిహ సర్ప*
*మదిరిహుదె కేళు సర్వజ్ఞ*

(శరీరమును దండించి ముక్తిని సాధింతునను వాడు మూర్ఖుడు. పుట్టపై కొడితె లోపలి పాము చచ్చునా?)

**వేమన**

*ఉప్పు కప్పురంబు ఒక్క పోలికనుండు*
*చూడ చూడ రుచుల జాడవేరు*
*పురుషులందు పుణ్య పురుషులు వేరయా*

**సర్వజ్ఞుడు**

*కల్లుప్పు కర్పురవు సొల్లెరడు ధాతొందు*
*ఖల్ల నొళ్ళిదను రూపొందు గుణదొళగె*
*ఎల్ల అంతరవు సర్వజ్ఞ*

(ఉప్పు, కర్పూరము ఒకే రకంగా వుంటాయి. పేర్లు మాత్రం రెండు. మంచివాడు, చెడ్డవారు చూచుటకొకటిగనే వున్నప్పటికీ గుణంలో వ్యత్యాసం కన్పిస్తుంది)

దానగుణం యొక్క ప్రాశస్త్యాన్ని చెబుతూ-

**వేమన**

*ధనము గూడబెట్టి ధర్మంబు సేయక*
*యూరకుండ్రు పావు లూహ లేక*
*ధనము వెంటరాదు ధర్మంబు సేయుడీ*

**సర్వజ్ఞుడు**

*కొట్టద్దు తనగి ఐచ్చిట్టద్దు పరరింగె*
*కొట్టద్దు హోయి తెనబేడ ముందక్కె*
*కట్టి హుదు బుత్తి సర్వజ్ఞ*

(ఒకరి కిచ్చినది తనకు దాచింది పరులకు చెందును. ఇచ్చినది పోగొట్టుకున్నాననకు. అది నీ భవిష్యత్తుకు కట్టిన ముడుపు)

**వేమన**

*ఆత్మలోని లింగ మదియును గానక*
*తీర్థ వాసులంచు తిరుగువారు*
*గంథంబు మోసిన గార్దభంబులు గారా?*



Sthanka_FebBW.indd 14 01/02/11 10:14 PM

**సర్వజ్ఞుడు**

*ఎత్తు గాణవ హోత్తు సుత్తి ఐందరె ఏను*
*చిత్త దలి శివన నెనెదరె దేశవను*
*సుత్తి ఫలవేను సర్వజ్ఞ*

(ఎద్దు గానుగుచుట్టు తిరిగిన ఫలమేమి? చిత్తమున శివుని స్మరించక దేశమును చుట్టి ఫలమేమి?)

సర్వజ్ఞుని భక్తికి విషయమైనది లింగస్వరూపమైన సూక్ష్మ వస్తువు.

**సర్వజ్ఞ**

*కట్టలు బిడవు శివబట్టలవ కద్దనె*
*కట్టలూ బేడ బిడబేడ కణ్మనవ*
*కట్టిదరె సాకు సర్వజ్ఞ*

**వేమన**

*బందె త్రాళ్ళ తెచ్చి బంధించి కట్టంగ*
*లింగడేమి దొంగలించినాడొ*
*ఆత్మ లింగమునకు నర్పింప నేరరో?*

సర్వజ్ఞుడు వీరశైవ మతావలంబియైనప్పటికీ ఇతర మతాలను దూషించలేదు. వేమన, సర్వజ్ఞులిద్దరూ కారుణ్య దృష్టి కలవారు.

**సర్వజ్ఞుడు**

*కొల్లదిప్పా దర్మవెల్లరిగె సమ్మతవు*
*అల్లదను మీరి కొలువను నరక క్కె*
*నిల్లదేహోహ సర్వజ్ఞ*

(చంపనట్టి ధర్మమందరికి సమ్మతం. ఈ ధర్మాన్ని అతిక్రమించినవాడు తప్పక నరకానికి వెళ్లాడు).

*"కొలలాగదెంబ జైనమత వెన్న తలెయ మేలిరలి"* అంటూ జిన ధర్మాన్ని ప్రశంసించినాడు.

దానాలన్నింటిలో గొప్పది అన్నదానం.




**వేమన**

*అన్న మిడుటకన్న నధిక దానంబుల*
*నెన్ని చేయ నేమి ఎన్న బోరు*
*అన్న మెన్న జీవనాధార మగునయా*

**సర్వజ్ఞుడు**

*అన్న దెవముకన్న మిన్నదై వంబున్నె?*
*అన్నమును దినక బ్రదుక గలడె నరుడు?*
*అన్నయె యనువు*

వేమన "రాచమూక నమ్మరాదురన్నా అంటే సర్వజ్ఞుడు కూడ రాజుల చిత్త వృత్తి ననుసరించక పోయిన సర్వనాశనమగు"నన్నాడు.

వేమన సర్వజ్ఞులిద్దరూ హేమకారక విద్య పట్ల అభిరుచి కలవారు. స్వర్ణ యోగమును గురించి -

**వేమన**

*తాళకంబు తెచ్చి తాటి కమ్మరసాన*
*బందు నిపుణ తెరుగ వెండి యగును*
*కల్లకాదు నిజము కరకంఠుని యాన* అంటే -

**సర్వజ్ఞుడు**

*'పాసగంగ రసతామ్రములతోడ గలిపికొని*
*వసుభటమ్మును మాలికను బుట్టమువెట్ట*
*బసిడి యయ్యేడిని'* అన్నారు.

వేమన సర్వజ్ఞులిద్దరూ సుఖమయ జీవితాన్ని వివరిస్తూ

**వేమన**

*సుగుణ వంతురాలు సుదతియై యుండిన*
*బుద్ధిమంతులగుచు బుత్రలొప్ప*
*స్వర్గమేటికయ్య సంసారి కింకను*

**సర్వజ్ఞుడు**

*వెచ్చనగు గృహమున్న వెచ్చింప ధనమున్న*
*నిచ్చగని మెలగు సతియున్న - దివమునకు*
*జిచ్చు నిడుమన్న సర్వజ్ఞ*

సర్వజ్ఞుని పుట్టుకను గురించి భిన్న వాదాలు ఉన్నాయి. బసవరసు అన్న ఆరాధ్య బ్రాహ్మణునికి, మాలి అన్న కుమ్మరి వనితకు జన్మించిన వాడని చెబుతారు.. మహాపురుషుల కులగోత్రాలను గురించి తర్కించుట కన్న వారి బోధనలను అనుసరించటం సముచితం. 'జాతి నపేచో సాధుకీ' అన్న కబీరు సూక్తిలోని సారమిదే.

వేమన సర్వజ్ఞుల కాలమును గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. వేమన 16, 17 శతాబ్దాల మధ్య కాలం వాడని, సర్వజ్ఞుడు 13, 15 శతాబ్దాల మధ్యవాడని పరిశోధకుల అభిప్రాయం.

వానలో తడియని వారు, వేమన పద్యాలు తెలియని తెలుగు వారు లేరన్నట్లే సర్వజ్ఞుని పదములు తెలియని కన్నడిగులు లేరని ఘంటాపథంగా చెప్పవచ్చు.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*



Sthanka_FebBW.indd 15 01/02/11 10:14 PM

# వచ్చే శతాబ్దపు తెలుగు కవితా రీతులు

## హైకూలూ, స్మయికూలూ

*తెలుగు మాతృక : అజంతా*
*స్వేచ్ఛానువాదం : శ్రీరమణ*

**నా** నిద్రని మరచెంబులో వడపోసి
గుప్పెడు అక్షరాల్ని పడేసి మూత పెట్టేశా
ప్రతి అక్షరం ఒక పిల్లకల
శ్రీమద్గురు గురు తావళం పూస.

మో-కాళ్ల పర్వతం పాకలేను
శ్రీనివాసా దిగిరారా నీకు పుణ్యముంటుంది.

అడవిలో తుపాకీ 'బుల్లెట్ గుడ్లు' పెట్టింది.
వార్ గ్రూప్‌లు సమస్తం గ్రూప్ వార్‌లు

మూడో తరం దాటిపోయింది
సపిండీకరణానికి సరైన సమయం

ప్లాట్‌ఫారం మీద కపాలమోక్షాలు అవుతున్నాయి.
రాజకీయ శ్రీరాగంలో ధైవతం వేసుకోవచ్చు శిష్యా

ఈ భూగోళం గంగిగోవు
నా దేశం గంగడోలు

ఆవుపాలూ అనుభూతి పళ్ళూ
జరీ ఉత్తరీయాలు కవిత్వాల కొలబద్దలు
హైకూలు స్మయికూలు
అందరూ క్యూలో నిలబడండి
వరసగా నరుక్కొస్తా -

**తాజాకలం అను అసలు సంగతి**
పోనీ,
ఓ పని చేద్దాం
చెట్లన్నిటికీ కులాల పేర్లు పెట్టుకుందాం
అప్పుడెలాగూ చచ్చినట్టు బతికించుకుంటాం.

*(ఆంధ్రప్రభ దినపత్రిక 1994)*

## మధురవాణి ఇంటర్వ్యూలు

**'మిసిమి'లో పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు తెలుగు ప్రముఖులతో మధురవాణి ఊహాజనిత ఇంటర్వ్యూలు అద్భుతంగా ఊహించి రాశారు. తర్వాత అవి పుస్తక రూపంలో వచ్చాయి. ఆ పుస్తకాన్ని అదే పద్ధతిలో రివ్యూ చేస్తే సముచితంగా వుంటుందని పురాణంగారి పట్ల నాకు గల గౌరవాభిమానాలతో యీ ప్రయత్నం చేశాను.**

పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు లూజు ప్యాంటు మీద 'గిర'ల బుష్ కోటు వేసుకుని, ముక్కు మీదికి జారిపోతున్న కళ్లజోడుని పదే పదే ముంజేతుల్తో పైకినెడుతూ -మధురవాణి ఇంటర్వ్యూలు పుస్తకం పరిశీలనగా చూస్తున్నారు. బాపు గీసిన మధురవాణి ముఖచిత్రం కదిలినట్లనిపించింది. గాజుల గలగలలూ, కాళ్లగజ్జెల పట్టెడల గరగరలూ వినిపించాయి. పురాణం గారు తలెత్తి చూశారు. డెమ్మీ సైజు బొమ్మ ప్రాణం పోసుకుని లైఫ్ సైజులో నిలబడి వుంది.




**మధురవాణి** : (చేతులు జోడించి) నమస్కారం... మీకు థాంక్స్ ఎలా చెప్పుకోవాలో బోధపడడం లేదు.

**పురాణం** : (ఉలిక్కిపడి కళ్లజోడు సర్దుకుని కాళ్లు రెండూ కుర్చీలో పెట్టుకున్నారు)

**మధుర** : మా గురువుగారు కన్యాశుల్కంలో దొంగ రాస్కెల్స్ మధ్యన పడేసి నా చేత నానా రకాల నాటకాలూ ఆడించారు. మీరు నన్ను మహానుభావుల దగ్గిరసా తీసికెళ్లి, వాళ్ల ఒళ్లో కూచోపెట్టి ఇంటర్వ్యూలు చేయించి నా జీవితాన్ని ధన్యం చేశారు. నాకు మళ్లీ నూరేళ్ల ఆయుష్షు పోశారు.

**పురాణం** : ఎంత మాట...? వాళ్లందరికీ నువ్వంటే ఇష్టమే. పైగా వాళ్లంతా అంతో యింతో సరసులే.

**మధుర** : నువ్వు పురాణం చేతిలో టాకింగ్ డాల్‌వి -నీ పెదాలు అడ్డు పెట్టుకుని వారే మాట్లాడేశారు. పురాణం మహ లావు వెంట్రిలాక్విస్టు అన్నారు గిరీశం గారు.

**పురాణం** : గిరీశం తెలుగువాడు. వంకలు వెదకడం వాడి ఊపిరి, కదిలింది మధురవాణి పెదాలు కాబట్టే ఇంటర్వ్యూలు రక్తి కట్టాయి.

**మధుర** : ఏమైతేనేం లెండి? పూల వల్ల నారపీచు శిరోధార్యం అయినట్లు మీ చేత వల్ల విశ్వనాథ, జాషువా, నార్ల, బాపిరాజు, శ్రీశ్రీ, చలం, పంతులుగారు ఇలాగ ఎంతో మంది మేధావులతో సన్నిహిత సంపర్కం ఏర్పడింది.



**పురాణం** : శివ శివా! సంపర్కం ఇక్కడ పడాల్సిన ముక్క కాదు. ఓవర్ డోసు. పరిచయం అంటే చాలు.

**మధుర** : డోసేజిలు మీకు తెలిసినంత నాకేమి ఎరుక? పొల్లు మాట అయితే వక్కన పెట్టండి.

**పురాణం**: నీతో యిదే పేచీ. నువ్వు వసంతసేనకి తక్కువ, చింతామణికి ఎక్కువ.

**మధుర** : ఔనౌను. వసంతసేన సంస్కృత సాని. నేను అచ్చ తెలుగు. పైగా వ్యావహారికం.



Sthanka_FebBW.indd 18 01/02/11 10:14 PM

దానికేం లెండి? మంచి టేస్టునీ, వ్యాపార సూత్రాలనీ, క్రియేటివిటీని బాగా మిక్స్ చేసి మంచి కాక్‌టైల్‌గా మీరు ఆంధ్రజ్యోతిలో సర్వ్ చేశారని గిరీశం గారు అనగా విన్నాను.



**పురాణం** : అంటే నేను రైటర్ని కాదనే ధ్వని వుందా?

**మధుర** : రామ రామ! మీ ఇల్లాలి ముచ్చట్లు యీ భూమ్మీద ఇల్లాలు వున్నంత కాలం వుంటుంది. (నవ్వి) మరి వీటిని 'వెలయాలి ముచ్చట్లు' అంటారేమో!

**పురాణం** : అది నా గొప్ప కాదు. రాసిన వాడి గొప్ప. ప్రతి వాక్యం కోటబుల్ కోట్ అవడం సామాన్యమా? ఆ ఘనత గురజాడకీ, దరిమిలా శ్రీశ్రీకీ దక్కింది.

**మధుర** : మాటొచ్చింది కనక అడుగుతా. మీకు శ్రీశ్రీ, చాసో, రావిశాస్త్రి, కారా మాష్టార్లంటే ఇష్టంట. కొంచెం ఈస్టెడ్ ఇంటరెస్టు, చిటికెడు కాస్టు ఫీలింగూ...

**పురాణం** : డోంట్ బి సిల్లీ. యూ నాటీ గాళ్! రావి శాస్త్రి గారు మాత్రం ఓసారి "నాకు కాస్ట్ ఫీలింగ్ లేదు గాని కొంచెం సబ్ కాస్ట్ ఫీలింగ్ వుందని" డిక్లేర్ చేశారు.

**మధుర** : ఈ ఇంటర్వ్యూలలో కృష్ణశాస్త్రిగారితో భేటీ లేకపోవడం వెలితిగా వుందని వారి శిష్యులు కురుమెళ్ల వెంకట్రావుగారు చిన్నబుచ్చుకున్నారు.

**పురాణం** : ఆయన ఊర్వశికి తప్ప ఎవరికీ ఇంటర్వ్యూలు ఇవ్వరు.

**మధుర** : ఈ పుస్తకం 'వాక్చూచి'లో నార్లగారి నంబరు పది. ఆయనకి పదహారో నంబరు మేధావి అని అన్వర్థనామధేయం వుందిటగా!



**పురాణం**: మరే... ఆ రోజుల్లో ఎమర్జెన్సీని ఖండిస్తూ తెలుగు మేధావులంతా ఇందిరాగాంధీకి ఓ 'వినతి పత్రం' సమర్పించారు. ఆ సంతకాల జాబితాలో నార్ల వారిది పదహారోది. అప్పట్నించి ఆయన అభిమానులు ఆ పేరుతో పిలుచుకుంటారు.

**మధుర** : ఎమర్జెన్సీలో అస్త్రసన్యాసం చేయకుండా ఆ మాత్రమైనా నిలబడింది మీరేనట! అండర్‌గ్రౌండ్ వాళ్లకి ఆశ్రయం యివ్వడం, న్యూస్‌ప్రింట్లు సరఫరా చేయడం, చీకట్లో పాము, శివకాంత లాంటి ఎమర్జెన్సీ వ్యతిరేక రాతలు రాశారట, ఎంత ధైర్యం?

**పురాణం** : నీకు ఈ సీక్రెట్ ఇన్ఫర్మేషనిచ్చిన ఇన్ఫార్మరెవడు?



**మధుర** : హెడ్డు కానిస్టేబు... ఈ మధ్యనే చనిపోయిన నక్సలైటు నాయకుడు సాంబశివరావు మీకెంత సన్నిహితుడో కూడా చెప్పాడు. అందుకోండి నా రెడ్ శాల్యూట్! అయినా ఆ పీడకలలు ఇప్పుడెందుకు గాని, మీరు తెలుగు వెలుగు చలం పుస్తకంలో పద్మవ్యూహంలో ఇరుక్కున్న అభిమన్యుడిలా చిక్కడి పోయారని విన్నాను!

**పురాణం** : చలం మీద ఆపాటి సమగ్ర రచన రాలేదు.

**మధుర** : మీరు క్రియేటివ్ జీనియస్సులే గాని చపలచిత్తులంటే కోప'గింజు' కోరు కదా?

**పురాణం** : కోపం దేనికి? నాది విశ్వనాథ స్కూలు.

**మధుర** : మీరీ ఇంటర్వ్యూల్లో ఘనత వహించిన వారి జీవితాలనీ, సాహిత్యాన్నీ, వీక్‌నెస్సుల్నీ, పస్లపాయింట్స్‌నీ, ఇజాలనీ, నిజాలనీ ఆసుపత్రి ఫుటో (ఎక్స్ రే) తీశారని అన్నారు.

**పురాణం** : ఎవరు అంట...?

**మధుర** : మొన్న పబ్లిషర్సు కాంప్లిమెంటరీ కాపీలు పంపితే వాళ్లందరికీ యివ్వాలని వెళ్లా. అందర్నీ కలిసి తలో ప్రతీ దాఖలు చేసుకున్నా. కాని జాషువా విషయంలో...

**పురాణం** : (కళ్లజోడు పైకి లాగి) ఆఁ... జాషువా విషయంలో...?

**మధుర** : ఒకరిద్దరు అన్నారు కదా -ఆయనకి జరిగినన్ని సన్మానాలు తెలుగు కవుల్లో ఎవరికీ జరగలేదు. నవ్యాంధ్ర్య మహారాష్ట్రానికి పీష్వా మా జాష్వా అన్నారట అమరేంద్ర. విశ్వనాథవారు సరస్వతీ సాక్షాత్కారం పొందిన కవి అన్నారట. ఆయన పద్యాలు తెలుగువారి గొంతుల్లో తారాడాయి. పద్మభూషణుడైనాడు. గజారోహణలు, గండపెండేరాలు అనుభవించారు. ముద్దుకృష్ణ వైతాళికులలో చేర్చకపోవడం వల్ల జాషువాకి అధికి మిక్కిలి కీర్తి వచ్చిందన్నారు. ఇంకో మాట కూడా అన్నారు. తాను పంచముడననే మాట పదేపదే గుర్తు చేసి బ్లాక్ మెయిలింగ్ ధోరణి ధ్వనింపచేశారన్నారు.



**పురాణం** : ఎవడీ కూత కూసింది?

**మధుర** : వెంకటేశం.

**పురాణం** : అయితే ఖాతరు చెయ్యడం దేనికి? మిగతా వాళ్ల అభిప్రాయాలు ఏమిటి?



Sthanka_FebBW.indd 19 01/02/11 10:14 PM

**మధుర:** నార్లగారు "..ఏడ్చిఅతగాడికి విషయాలు పూర్తిగా తెలియవు. ఏకపక్షంగా రాసి ఏడ్చాడు" అన్నారు. "జాగర్తగా వెదికితే అక్కడక్కడ కొన్ని యదార్థాలు వున్నా ఇది పుక్కిటి పురాణం.. ఛూ!" అని తూస్కారంతో పుస్తకం తిరిగి యిచ్చేశారు విశ్వనాథ. "పురాణ మిత్యేవ న సాధు సర్వం" అన్నారు శ్రీశ్రీ.



గుడిపాటి వెంకటచలం గారు "అంతా ఈశ్వరాశీర్వాదం" అంటూ పుస్తకం అందుకుంటూ నా చెయ్యి పుట్టుకున్నారు.

రావి శాస్త్రి గారు "ఇందులో కొన్ని ఎక్స్‌ప్రార్టీ డిక్రీలున్నాయ్" అన్నారు. అడివి బాపిరాజుగారు పమిట నిండా కప్పుకు కూచుంటే మోడల్‌గా ఓ బొమ్మ వేసుకుంటానన్నారు. పారిపోయి వచ్చేశా.



**పురాణం** : ఎవరి ఓపీనియన్స్ వాళ్లవి. పొగడ్తలో వున్న సుఖం విమర్శలో వుండునా?

**మధుర** : వుండదని భావము. అది సరే గాని, మిరియాల కషాయం పిచ్చిక మీద బ్రహ్మాస్త్రం కదా?

**పురాణం** : ఇది మరీ బావుంది. మూలిగే నక్క మీద తాటి పండని... అంత లావు శ్రీశ్రీ థీసిస్సుని పిచ్చుక అంటావా? తెలివి మీరావు సుమీ!

**మధుర** : నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష! మా ట్రూపులోంచి మునుపు ముళ్లపూడి వెంకటరమణగారు గిరీశం గారిని చెన్నపట్నం తీసికెళ్లి తెలుగుదనంతో లెక్చర్లిప్పించారు.



**పురాణం** : తెలును. గిరీశం గారి మాస్క్ తగిలించుకుని -ముఖ్యంగా సినిమా వాళ్లని ఏకి, పురుపులూ, దిళ్లూ కుట్టించుకున్నారు. క్రౌంచ మిథునంలో కిరాతకుడు ఓ పక్షిని కొట్టడం వల్ల -ఫస్ట్ విడో ఆఫ్ ది యూనివర్స్ ఏర్పడి అది రామాయణానికి నాంది పలికిందని గిరీశంగారితో ముళ్లపూడి అనిపించారు. విశ్వనాథ, ఉషశ్రీ వింటే సంతోషిస్తారు.

**మధుర** : వాకాటి పాండురంగారావు ఈ పుస్తకానికి మొదట్లో ఆంగ్లంలో రాసిన కాంపోజిషన్ చాలా బావుంది.

**పురాణం** : తప్పు కాంపోజిషన్ అన కూడదు. ఆవుమీద, కొబ్బరి చెట్టు మీద రాస్తే అది కాంపోజిషన్. దీన్ని పెన్ పొట్రేయట్ అంటే కవి యొక్క సమగ్ర రూపాన్ని అక్షరాల్లోకి దించడం.

**మధుర** : ఓహో! అయితే అదన్నమాట! (నవ్వి) ఈ బుక్కు మీరు భరాగో గారికి అంకితం ఇస్తే ఆయన తిరిగి అలపాటి రవీంద్రనాథ్ గారికి దత్తం చేశారు. చివరికి కృతిభర్త విషయంలో కూడా నా వృత్తిధర్మాన్ని వదలనిచ్చారు కాదు. మీరంతా మేధావులు.

**పురాణం** : అది మా భరాగో పెద్ద మనసు. అపార్థం చేసుకోకు.

**మధుర** : ఇంత మంది మేధావుల సాహిత్యాన్నీ, జీవితాన్నీ క్షుణ్ణంగా స్టడీచేసి... సహజమైన మీ హాస్య ధోరణిలో ఊహాజనిత సంభాషణలను చెండు కట్టారు. ఒక్కో సారి మీరు...

**పురాణం** : దాచడం దేనికీ? అనేదేదో అను!

**మధుర** : మీరు గిరీశం గారి కంటే అసాధ్యులు! (నవ్వుతుంది)

**పురాణం** : అంతటి లౌక్యమే వుంటే జీవితాంతం ఇంత రొష్టు పడతానా మధురవాణి?

**మధుర** : అయితే మీరు సురేంద్రనాథ్ బానర్జీ అంతటి వారు ! (జారిన కళ్లజోడు పైకి నెడుతుంది)

*(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక 1-9-1997)*

★






Sthanka_FebBW.indd 20 01/02/11 10:14 PM

**ప్రతి స్త్రీ తన జీవిత కాలంలో రెండువేల నూట రెండు గంటలు రుతుస్రావంతో బాధపడుతుంది. అయితే దీని చుట్టూతా ఎన్ని భయ భ్రాంతులున్నాయో, అపవిత్రతా భావనలున్నాయో మనకి తెలసు. ఎటువంటి నాగరికతా తెలీని ఆదిమానవుల కాలంలో స్త్రీ పట్ల, ఆమె పునరుత్పత్తి శక్తి పట్ల వున్న భయమే, ప్రకృతి మీద అధిపత్యం సాధించాలనే తాపత్రయానికి కారణమయింది. ప్రకృతి అంటే స్త్రీ అనే అర్థం వుంది. రక్తస్రావం అంటేనే అండం విడుదల / విచ్ఛిత్తి కాబట్టి అది పాపమనే భావన అలా మొదలయి వుండచ్చు.**

ఆ ధోరణి ఎన్నో వెర్రితలలు వేసి ఒక జాతినే అస్పృశ్యతకు గురి చేసి అవమానిస్తోంది. సాంకేతికంగా మనం ఎంత ప్రగతిని సాధించినా గాని స్త్రీల విషయంలో ఒక్క అంగుళమైనా ముందుకు కదల్లేదని ఇలాంటప్పుడే అర్థమవుతుంది. ఎక్కడ అస్పృశ్యత వుంటుందో అక్కడ హింస వుంటుంది. ఒకరు చేసే హింస, పది మంది చేస్తే అలవాటుగా, వందమంది చేస్తే ఆధారంగా బలపడుతుంది.

# నాట్ జస్ట్ ఫర్ ఎ పీస్ ఆఫ్ క్లాత్

ఇప్పటికీ కొన్ని మారుమూల గ్రామాల్లో వున్న తెగలు, ఆదివాసీలు ఆ అయిదు రోజులు ఏంచేస్తారో తెలుసుకుంటే గుండె నీరవుతుంది. షియోపూర్ గ్రామంలోని సహారియా తెగవారు రుతుస్రావం మొదలయిన ఆడవారిని ఇంటి నుంచి బహిష్కరించి పశువుల పాకలో వుంచుతారు. మూడు నుంచి అయిదు రోజులపాటు తిండీ, నిద్రా, కాలకృత్యాలు అన్నీ ఆ పశువుల పక్కనే జరుపుకోవాలి. అన్నిటికంటే రుతుస్రావాన్ని తట్టుకోవడమే వారికెక్కువ సమస్య.

పశువుల పాకలో ఏం దొరుకుతాయి..? గోనె సంచులు, బూడిద, పేడ, గడ్డి, గాదం అంతేకదా... అభాగ్యులైన ఆ ఆడవాళ్లు వాటితోనే రుతుస్రావాన్ని అరికట్టడానికి ప్రయత్నిస్తారు. చాలాసార్లు అవి కూడా కావలసినన్ని దొరకవు. అప్పుడు ఒకరు వాడిన వాటిని మళ్ళీ మళ్లీ గాలికి, ఎండకి అరబెట్టి మరొకరు వాడతారు. ఈ పనులన్నీ రహస్యంగా ఎవరికీ కనబడకుండా జరగిపోవాలి. దీన్ని గురించి వూళ్ళో ఎవరికయినా సానుభూతి వున్నాగాని, మిగిలినవాళ్లు వెలేస్తారనే భయంతో మౌనంగా వుండిపోతారు.

రుతుస్రావమే ఒక అపవిత్ర పరిణామం కాబట్టి స్త్రీలు ఆ సమయంలో వాడిన గోనె సంచీ ముక్కల్ని బయటికి కనబడకుండా గడ్డిలోనో, చూరులోనో దాచిపెడతారు. అందులోకి సూక్ష్మక్రిములే కాదు పెద్ద పురుగులు కూడా చేరతాయి. అవి శరీరంలోనికి ప్రవేశిస్తాయి కూడా ఊరికి దూరంగా వుండటం వల్ల పురుగు కుట్టిన వార్త ఇంట్లో వారికి, అక్కడ్నించి వైద్యునికి ఆలస్యంగా చేరుతుంది. ఒకవేళ దొరికిన వైద్యుల చైతన్య స్థాయి కూడా అలానే వుంటే ఆ స్త్రీలను ముట్టుకుని ఏం జరిగిందో చూసే వారే వుండరు..

మధ్యప్రదేశ్‌లోని డింగరీ జిల్లాకి చెందిన ఒక పదహారేళ్ళ బాలిక వాడటానికి తీసుకున్న గోనెసంచీలో వున్న పురుగు కుట్టి, ఆ వార్త ఇంటికి చేరేలోపే నురగలు కక్కి చనిపోయింది. శరీరంలోకి చొచ్చుకుపోయిన ఆ పురుగు ఏమిటో ఎలాంటిదో పోస్టుమార్టంలో తప్ప మామూలుగా తెలీదు. గిరిజన, ఆదివాసీ సంస్కృతి పోస్టుమార్టం విధానాన్ని కూడా అనుమతించదు. అందువల్ల అక్కడ పుట్టి పెరిగి నడి వయసుకి చేరుకున్న స్త్రీలలో ఎక్కువ మంది మూత్రకోశ కాన్సరుతోనో, గర్భసంచీ తొలగింపుతోనో చనిపోవడం రివాజు.

కాస్మోపాలిటన్ నగరాలను మినహాయిస్తే మిగిలిన అన్ని గ్రామాల్లోనూ వున్న సగటు మహిళల్లో మూడూ శాతం మందికి కూడా ఆ సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత శుభ్రత గురించి దాదాపు తెలీదు. శానిటరీ నాప్ కిన్స్ గురించి ఒక్కసారి కూడా వినని వారు, చూడనివారూ చాలా శాతం వున్నారు. తెలిసిన కొద్దిమందికీ కొనే స్థోమత లేదు.

శానిటరీ నాప్ కిన్స్ కొనుగోలు అనేది మన ఆర్థిక స్థోమత మీద ఆధారపడి వుంటుంది.. మంచి జీతం, ఆస్తిపాస్తులు బాగా వుంటే శానిటరీ నాప్ కిన్స్ కొనుక్కోవచ్చు. ఆశ్చర్యంగా వుందా...?

తమిళనాడుకు చెందిన కోయంబత్తూరులో కూచున్న మురుగానందం కూడా మీలాగే ఆశ్చర్యపోయాడు. కొన్నేళ్ల కిందట అతడూ అందరిలాగే ఒకరోజు తన భార్యతో...

''. . . . ఎందుకంత చెత్త గుడ్డలు వాడతావు. మళ్ళీ ఓవర్ డిశ్చార్జ్ అంటావు. బజార్లో దొరికే నాప్ కిన్స్ కొనుక్కోలేవా..?'' అని విసుక్కున్నాడట.

''అలాగే కొంటాను, కానీ దానికోసం మన పిల్లల పాల బడ్జెట్ గానీ, మీ రోజు వారీ ప్రయాణ చార్జీలు గాని తగ్గించమంటారా మరి...?'' అని ప్రశ్నించింది.

ఆ ప్రశ్నలోని తీవ్రత అతన్ని బజారుకి తరిమికొట్టింది. దగ్గరలో వున్న దుకాణానికి వెళ్ళాడు. శానిటరీ నాప్‌కిన్స్ కావాలని అడిగాడు. కౌంటరు దగ్గర కూచున్న వాడెవరో తల పక్కకి తిప్పి హేళనగా దగ్గాడు. మగవాడు ఆడవాళ్ల అవసరాల్ని గుర్తించడం ఎంత నవ్వులాటగా మారుతుందో అప్పుడు అతనికి తెల్సింది. ఈలోగా ఒక యువతి షాపులోకి వచ్చింది. ఏం కావాలో చెప్పలేదు. అటూ ఇటూ తచ్చాడింది. కళ్లతోనే దేనికోసమో వెతికింది. షాపువాడు అది కనిపెట్టి ఒక ప్యాకెట్ లాంటిదాన్ని హడావిడిగా నల్ల ప్లాస్టిక్ కవరులో చుట్టి ఆవిడ చేతికిచ్చాడు. ఆవిడ తలవంచుకుని తక్షణమే బయటికి వెళ్ళిపోయింది. తను కూడా అదే వస్తువు కోసం రాకపోయి వుంటే తప్పకుండా అక్కడ ఏ బ్రౌన్ సుగర్ ముఠాలాంటిదో పనిచేస్తోందని అనుకునేవాడట.. అంతేకాదు ఆ యువతి బయట ఏ దేవాలయంలోనో, చర్చిలోనో, మసీదులోనో కనబడినా సరే



Sthanka_FebBW.indd 22 01/02/11 10:14 PM

అనుమానంగానే చూసేవాడేమో.. పదినిమిషాల్లో ఇంటికొచ్చిన అతన్ని, అతని చేతిలోని ప్యాకెట్‌నీ, దాని మీదున్న ధరని చూసి తిక్క కుదిరిందా అన్నట్టు నవ్వుకుని వుంటుంది మురుగానందం గారి భార్య..

ఆ రోజు ఆమె ఇచ్చిన ఝలక్‌తో మురుగానందం విమెన్ ఫ్రెండ్లీ కార్యకర్తగా మారిపోయాడు. అట్టడుగు మహిళకి సైతం లభ్యం కాగల ధరలో నాప్ కిన్స్ ఉత్పత్తి చేయడం ఒక్కటే అతని వృత్తి ప్లస్ ప్రవృత్తిగా మారిపోయింది. గంటకి రెండువేలు ప్యాడ్స్ ఉత్పత్తి చేసే యంత్రం అతని దగ్గరుంది. అతను తయారు చేసిన నాప్ కిన్స్ ధర ఎంతో తెలుసా..? మొత్తం ప్యాకెట్ రెండు రూపాయలు. అంత తక్కువ ధరకి ఇప్పుడు బండిమీద ఒక జామకాయ రావడంలేదు.. ఆ కోవలోనే ఇప్పుడు ఢిల్లీ నుంచి గూంజ్ అనే సంస్థ పనిచేస్తోంది.

ధర తక్కువ కాబట్టి నాణ్యతలో రాజీ పడతారనుకుంటున్నారేమో, అదేమీ లేదు. కావాల్సిన బట్టను, ఉతికించి, ఇస్త్రీచేసి, అవసరమైన కొలతకు కత్తిరించి ఒరిస్సా, బీహార్, మధ్యప్రదేశ్ లాంటి పద్దెనిమిది రాష్ట్రాలకు పంపిణీ చేస్తోంది. పొదుపు బృందాలకు ఇది ఉపాధిగా కూడా పనికొస్తోంది. అక్కడున్న విద్యా సంస్థలకు, కార్యాలయాలకు వీరు అమ్ముతారు. కాశ్మీర్ ప్రాంతాల్లో వున్న గ్రామీణ స్త్రీలు కూడా ఈ పని చేపట్టారు.

చత్తీస్‌ఘఢ్‌లోని మహాలక్ష్మి పొదుపు గ్రూపువారు వాటర్ ఎయిడ్ సహకారంతో తయారు చేస్తున్న శానిటరీ ప్యాడ్స్ నవపూర్ లాంటి కుగ్రామంలో వున్న స్త్రీలని, ఆ చుట్టుపక్కల వున్న మరో అరవై గ్రామవాసుల్ని ఆకర్షించింది. ప్రాథమిక హెల్త్ సెంటర్లు కూడా లేని చోట్ల సురక్షితమైన నాప్‌కిన్స్ వాడడం వల్ల మహిళల ఆరోగ్యం బాగా మెరుగుపడిందని వారు చెబుతున్నారు. అట్టడుగు మహిళకు అందుబాటులో వుండేట్టుగా ఇవి అత్యంత చవకగా వుండటమే కాకుండా, వాడకం తర్వాత వాటిని సక్రమంగా డిస్పోజ్ చెయ్యడంలోనూ శిక్షణ దొరికింది.

**'నాట్ జస్ట్ ఫర్ ఎ పీస్ ఆఫ్ క్లాత్'** కాంపెయిన్ ద్వారా మొదలయిన ఈ ఉద్యమం బీహార్‌లో గ్రామీణ మహిళలకు బాగా చేరువయింది. చీర లోపల లంగా కట్టడం కూడా అలవాటులేని గ్రామీణ ఆదివాసీ స్త్రీలకు రక్తస్రావాన్ని పీల్చుకునే పరిశుభ్రమైన బట్టను పరిచయం చెయ్యడం, వాడిన వెంటనే దాన్ని కంపోస్టు చేయడమెలాగో చెప్పడం సామాన్యమైన విషయం కాదు. మైండ్ సెట్ మార్చితేనే అది సాధ్యమవుతుంది.

అసలు స్త్రీల ఆరోగ్యం చుట్టూ అనేక సామాజిక కోణాలుంటాయి. తనకి తను తక్కువ ప్రాధాన్యత ఇచ్చుకుంటూ కుటుంబానికి, అతిధి, అభ్యాగతులకి ఎక్కువ సమయాన్ని, శక్తిని, ధనాన్ని ఖర్చుపెట్టడం ఎంత ఉదాత్తత గల విషయమో మన సంస్కృతి చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతుంది... అటువంటప్పుడు నెల నెలా వచ్చి పడే అవస్థని పట్టించుకోవాలని, ఆహారమూ, విశ్రాంతీ తీసుకోవాలని, తన శరీరాన్ని తనే గౌరవించుకోకపోతే ఇంకెవరూ గౌరవించరని ఎవరు చెబుతారు..?

మురుగానందం ఈ విషయాలన్నీ స్త్రీలతో మాట్లాడాలని చూసేవాడు. కానీ ఎవరూ స్పందించేవారు కాదు. రక్తస్రావ స్వభావానికి సంబంధించి సమగ్ర సమాచారం సేకరించడానికి నానా యాతనలూ పడ్డాడు. ఒక సాధారణ బట్ట ఎన్ని ఔన్సుల రక్తాన్ని పీల్చుకుంటుందో తెలుసుకోవడానికి మాంసం దుకాణానికి వెళ్ళి మేక రక్తంతో ప్రయోగం చేశాడు. క్లాత్ మీద నీరు ఎండటానికి, రక్తం ఎండటానికి ఎంత తేడా వుందో తెలియాలనుకునేవాడు. అతని ఆర్తీ, అవస్థా ఎవరూ అర్థం చేసుకోకపోగా, ఎక్కడ కనబడితే ఏమి అడుగుతాడో అనుకుని చుట్టుపక్కల ఆడవాళ్ళు తప్పించుకుని తిరిగేవారట. అతను చేసిన ప్రయోగాలు ఫలితాలు సాధించాక, ఇప్పుడు అందరికీ ఆప్తమిత్రుడయ్యాడు. ఈ నాప్‌కిన్స్ అందుతున్న గ్రామపంచాయితీ పాఠశాలల్లో బాలికల హాజరు శాతం బాగా పెరిగింది.

కాస్మోపాలిటన్ సిటీల్లో కూడా అన్ని తరగతుల మహిళలూ వుంటారు. ఈ ఉత్పత్తులు వారిదాకా వస్తే ఇంకా బావుంటుంది. లేదా ఇక్కడా చాలా మంది వాటిని ఉత్పత్తి అయినా చెయ్యాలి. మార్కెట్‌ని మనకు అనుకూలంగా మలచుకోవడమే నిజమైన సాధికారత.

ఇప్పటివరకూ మనం ఏం చేస్తున్నాం...? హై బ్రాండు పేరుతో విదేశీ కంపెనీలు మన మీద మోపుతున్న వస్తు ఇంద్రజాలంలో కూరుకుపోయి వున్నాం. ఇక్కడ అత్యధికంగా అమ్ముడుపోయే ఒక సరుకు మన రక్తస్రావాన్ని పీల్చుకునే బట్ట. ఆఫ్ కోర్స్ దానిపేరు నాప్ కిన్. దాని ఖరీదు వందకి పైమాటే. కావాలంటే ఎక్స్ట్రా లార్జ్, స్కిన్ ఫ్రెండ్లీలు కూడా దొరుకుతాయి. కాకపోతే మీ పర్సు బరువు కూడా ఎక్స్ట్రా లార్జిగా వుండి తీరాలి...

ధర ఒక్కటే సమస్య కాదు. చైతన్యాన్ని కూడా ఒకసారి అంచనా వేసుకుందాం. శానిటరీ ప్యాకెట్ ఎక్కడయితే కొన్నామో అక్కడే నుంచుని పొట్లం విప్పదీసి అందులో నిజంగా పదిహేను బట్టలు వున్నాయా లేదో, బెల్ట్ జత చేసి వుందో లేదో, బట్ట నాణ్యత బావుందో లేదో, బీహారులో దొరికే దాని కన్నా ఇది ఎందుకు ఇంత ఎక్కువ ధర వుందో, ఈ దోపిడీకి కారణమేమిటో ప్రశ్నించగలమా..? చాలా మంది అలా చెయ్యలేరు. అదే కూరగాయల బజారులోనో, చీరల షాపులోనో ఎంత తెలివైన వినియోగదారిణిగా వుంటామో ఈ సందర్భంగా గుర్తు చేసుకోండి. ఏమిటి తేడా..? మన అనారోగ్యాలు, కాన్పులు, రక్తస్రావాలు మనకే చూపించి భయపెట్టి ఎవడో మార్కెట్ చేసుకుని బాగుపడతాడు. స్రావాన్ని అరికట్టే సమాచారం లేక మనం బాధపడుతూ వుంటాం. ఇప్పుడిక్కడ నాప్‌కిన్ కాదు రక్తస్రావమే గొప్ప మార్కెట్. ఎంత విషాదమో చూశారా..? ఇంక లాభం లేదు. మార్కెట్ కొమ్ములు వంచడానికయినా మన స్వతంత్ర ఉత్పత్తులు చేపట్టాలి..

బీహార్‌లో మొదలుపెట్టిన ఉద్యమం పేరేమిటి? 'నాట్ జస్ట్ ఫర్ ఎ పీస్ ఆఫ్ క్లాత్' అని కదా..? ఔను ఈ ఉద్యమం బట్ట కోసమే కాదు ఉనికి కోసం కూడా.

*(యునైటెడ్ నేషన్స్, పాపులేషన్ ఫస్ట్ సంయుక్తంగా ప్రతియేటా జెండరు సెన్సిటివిటీతో మీడియా రచనలు చేసిన వారికి అవార్డులు బహూకరిస్తుంది. ఈ ఏడాది లాడ్లీ మీడియా బహుమతి అందుకున్న వారిలో నాతో బాటు ఆర్తీ మోహన్ కూడా వున్నారు. ఆల్టర్నేటివ్ పత్రికలో అచ్చయిన ఆమె వ్యాసం 'ఐప్యాడ్' కి ఇది స్వేచ్ఛానువాదం)*

*- కొండేపూడి నిర్మల*

**దేశానికి వెన్నెముక అంటూ అందరూ అంగీకరిస్తున్న రైతు కొందరు స్వార్థపరుల మోసాలకు గురై వెన్ను విరిగి రోదిస్తున్నాడు. నాసిరకం విత్తనాలు, నకిలీ ఎరువులు, కల్తీ పురుగు మందులు రైతు జీవితాలతో దోబూచులాడుతున్నాయి.**




ప్రైవేటు ఏజన్సీలతోనేకాక, ప్రభుత్వరంగ సంస్థల నుండి కొనుగోలు చేసిన విత్తనాలు కూడా నాసిరకం కావడంతో రైతు తీవ్ర నష్టానికి, కష్టానికి గురికావలసి వస్తున్నది. ఫలితంగా ఫలసాయం పెరగకపోగా, అసలుకే మోసం వస్తున్నది. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం, ధాన్యం అమ్మేటప్పుడు బస్తాకు ఒకటి లేదా రెండు కేజీల ధాన్యాన్ని వ్యాపారులు, రైతుల నుండి తూయించుకోవడం, అలాగే రైతు కొనేటప్పుడు వస్తువులపై ముద్రించిన గరిష్ట ధర (ఎం.ఆర్.పి.) కంటే అధికంగా వ్యాపారులు రైతులనుండి వసూలు చేయడం మనం నిత్యం చూస్తున్నాం, విద్యుత్ సరఫరాలో వస్తున్న ఓల్టేజి హెచ్చుతగ్గులు కారణంగా మోటార్లు కాలిపోవడం, విద్యుత్ కోతవల్ల మోటార్లు తిరగక పొలాలకు నీరందక, చేతికొచ్చిన పంట దక్కకపోవడం, ఆధునిక వ్యవసాయ పద్ధతుల వల్ల కొత్త సమస్యలు ఎదురుకావడం వాణిజ్య సహకార బ్యాంకుల నుంచి రుణాలు పొందే విషయంలో దళారుల పాత్ర పెరగటం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తున్నది.

రైతులలో ఐకమత్యం లేకపోవడం, నిరక్షరాస్యత అధికంగా ఉండటం. అన్యాయం జరిగితే ఖర్మ అనుకోవడం రైతుల దైనందిన జీవితాన్ని దుర్భరం చేస్తున్నది. కల్తీ, అధిక ధరలు, అబద్ధపు ప్రకటనలు మొదలైన అక్రమ వ్యాపార పద్ధతుల వలన రైతులు నిత్యం మోసపోతున్నారు. లోప భూయిష్టమైన ముడి వనరులు, సేవలు రైతులకు అందించే వారి సంఖ్య రోజు రోజుకీ పెరిగి, సమస్యలను సంఘటితంగా ఎదుర్కోలేని రైతుల పరిస్థితి ఆందోళన కలిగిస్తున్నది. మరి ఈ సమస్యలకు పరిష్కారం లేదా? అంటే ఉంది. అదే వినియోగదారుల రక్షణ చట్టం. మనం కొంత డబ్బు చెల్లించి లేక చెల్లించడానికి వాగ్దానం చేసి కొనుగోలుచేసే వస్తువులనుండి పొందే సేవలో లోపం ఉన్నప్పుడు న్యాయం పొందడమే కాకుండా జరిగిన నష్టానికి కొత్త వస్తువులతో పాటు నష్టపరిహారం కూడా పొందే అవకాశం ఉంది. 1986లో ప్రభుత్వం వినియోగదారుల రక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ఆ అవకాశం లభించింది. నష్టపోయిన "రైతులు కూడా వినియోగదారులే" కాబట్టి వినియోగదారుల చట్టం ద్వారా రైతులు తమకు జరిగిన అన్యాయానికి, మోసానికి వినియోగదారుల ఫోరాలలో స్వయంగా గాని, వినియోగదారుల సంఘాల సహకారంతో గాని కేసులు వేసి తమను మోసగించిన వ్యక్తులు లేదా సంస్థలు లేక ప్రభుత్వ శాఖల నుంచి నష్టపరిహారం పొందవచ్చు.

వినియోగదారుల ఫోరాలలో రైతులు కేసులు వేయటం ద్వారా ఏ విధంగా మేలు జరుగుతుందో ముందుగా పరిశీలిద్దాం. రైతులు కొన్ని విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు నకిలీవి అయినా లేక అందులో ఏదన్నా మోసం జరిగినా, తద్వారా రైతులు పండించిన పంటకు ఎంత నష్టం వస్తుందో అంత నష్టాన్ని వాటిని అమ్మిన వారినుంచి అతి తక్కువ ఖర్చుతో వినియోగదారుల ఫోరం ద్వారా నష్టపరిహారం పొందవచ్చును.

1. విద్యుత్ ఓల్టేజి హెచ్చుతగ్గుల వల్ల మోటార్లు కాలిపోయినా, పంట కొచ్చే సమయానికి విద్యుత్ కోత అధికంగా ఉండటం వల్ల పంట నష్టపోయినా వినియోగదారుల పోరం ద్వారా రైతు న్యాయం పొందవచ్చును.

# "రైతులు కూడా వినియోగదారులే"



SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 2/1/2011, 8:33 PM

2. వ్యవసాయ పరికరాల కొనుగోలు విషయంలో మోసపోయిన రైతు కొత్త పరికరాలతోపాటు నష్టపరిహారాన్ని కూడా వినియోగదారుల ఫోరం ద్వారా పొందవచ్చును.

3. వాణిజ్య బ్యాంకుల నుంచి, సహకార బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల విషయంలో మోసం జరిగినా, ఎక్కువ వడ్డీలు వసూలు చేసినా నిబంధనల ప్రకారం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట పూర్తిగా పాడైపోయిన ఇన్సూరెన్సు ప్రీమియం చెల్లించి ఉంటే ఇన్సూరెన్సు క్లెయిం మొత్తం రాకపోయినట్లయితే వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయాన్ని పొందవచ్చును.

అయితే రైతులు తాము కొనుగోలు చేసిన సరుకు లేదా వస్తువులకు బిల్లు, గ్యారంటీ కార్డులు, ఇతర ఆధారాలతో వినియోగదారుల ఫోరంలో కేసులు వేయవలసి ఉంటుంది. రైతులు తమ ఫిర్యాదులను ఎక్కడ దాఖలు చేయాలో ముందుగా గ్రహించాలి. వస్తువుల విలువ లేదా సేవల విలువ లేక కోరుకున్న నష్టపరిహారం విలువ 20 లక్షల లోపు ఉన్నప్పుడు జిల్లా ఫోరంలోనూ, 20 లక్షల కన్న ఎక్కువ, కోటి రూపాయలు లోపు ఉన్నప్పుడు రాష్ట్ర కమీషన్‌లోనూ, కోటి రూపాయలు పైన ఉన్నప్పుడు జాతీయ కమీషన్‌లోనూ రైతులు ఫిర్యాదులు దాఖలు చేయవచ్చును. స్వయంగా గానీ రిజిష్టర్ పోస్టు ద్వారా గాని వినియోగదారుల సంఘాల సహకారంతో గానీ, ఫోరాలలో రైతులు ఫిర్యాదులు దాఖలు చేయవచ్చు.

చట్టాలు ఎన్నిచేసినా, కోర్టులు ఎన్ని పెట్టినా రైతులు హక్కులకోసం పోరాటానికి ఎన్ని సంఘాలు ఉద్భవించినా రైతులలో చైతన్యం, ఐక్యత లేనిదే వాటి ప్రయత్నాలు నిష్ప్రయోజనం అవుతాయి. దోపిడీకి గురి అయిన తరువాత రైతులను రక్షించటం, జిల్లా ఫోరంలో కేసులు వేయటం కన్నా అసలు దోపిడీకి గురికాకుండా రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే 75 శాతం దోపిడీని అరికట్టవచ్చును. దీనికి సాధ్యమైనంత వరకు తనకు నమ్మకం ఉన్న ఒకే షాపులో ఎరువులు, పురుగు మందులు కొనటం అలవాటు చేసుకోవాలి. తక్కువ రేటుకు వస్తుందనే ఆలోచనతో షాపు యాజమాని తెలియకపోయినా విచ్చలవిడిగా పురుగుమందులు కొనుగోలు చేయవద్దు. విత్తనాలు కొనుగోలు సమయంలో కూడా ఎక్కువ రైతులను వాకబుచేసి వారి అనుభవాలను పరిశీలించి కొనుగోలు చేయాలి.



2. బ్యాంకుల నుంచి రుణాలు పొందే విషయంలో దళారులకు తావివ్వకుండా నేరుగా బ్యాంకు అధికారులను కలిసి తనకు కావలసిన రుణం ఎంతో తెలియజేసి వారితో ముఖాముఖి సంప్రదింపు ద్వారా రుణాలు పొందాలి.

3. రైతులు తీసుకున్న రుణం చెల్లించిన తరువాత బ్యాంకులు లేదా సహకార సంఘాలలో ఇచ్చే రశీదులు భద్రంగా ఉంచుకోవాలి. అదే ప్రకారం భూమి శిస్తు చెల్లించినప్పుడు గ్రామ పరిపాలనా అధికారులు ఇచ్చే రశీదులు కూడా అతి భద్రంగా ఉంచుకోవాలి. ఎవరినీ నమ్మి రశీదు లేకుండా సొమ్ము చెల్లించకూడదు.

4. ఎక్కడైనా, ఎప్పుడైనా రైతులు వడ్డీకి రుణం తీసుకునే సందర్భాలలో పూర్తి చేయని నోటుమీద గాని ఖాళీ తెల్లకాగితంపై గానీ సంతకాలు, వేలి ముద్రలు వేయకూడదు.

5. ఇతరులతో ఆర్థిక లావాదేవీలు జరిపినప్పుడు ఆ వివరాలు ఎప్పటికప్పుడు ఇంటి వద్ద ఏదైనా పుస్తకంలో రాసుకోవటం అలవాటు చేసుకోవాలి. ప్రతీ రైతు ఫిర్యాదు చేసేటప్పుడు స్పష్టంగా సంపూర్ణంగా ఉండాలి. ఫిర్యాదుకు రాతపూర్వక సాక్ష్యాలు ఉండాలి.

6. రైతులో నిరక్షరాస్యత అధికంగా ఉండటం వల్ల, మాయ మాటలతో రైతులను మోసగించే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నందు వల్ల రైతులు తమ బిడ్డలకు విద్యాబుద్ధులు నేర్పడానికి మరింత కృషి చేయాలి.

7. తమ కళ్ళ ఎదుటే అనేక అక్రమాలు, కల్తీలు, మోసాలు నాట్యం చేస్తుంటే వాటిని అనుభవిస్తూ ఖర్మ అనుకునే రైతుల ఆలోచనా విధానంలో మార్పురావాలి.

**- బొబ్బిలి బంగారయ్య**
అధ్యక్షులు, పశ్చిమ గోదావరి జిల్లా
వినియోగదారుల సంఘం



SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 2/1/2011, 8:33 PM

# పర్యావరణ పరిరక్షణ – మన తక్షణ కర్తవ్యం

పర్యావరణం అంటే మనచుట్టూ ఉన్న నేల, మనకు కనిపించే ఆకాశం, వాయుమండలం, పరిసరాలు మాత్రమే కాదు, మనం తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి, ధరించే దుస్తులు ఇవన్నీ పర్యావరణంలో భాగాలే. వీటన్నింటి సమైక్యరూపమే పర్యావరణం.



మనచుట్టూ ఉన్న ప్రకృతిలో జరిగే ప్రతిచిన్న చర్య, ప్రతి క్రియ మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. వాతావరణంలో చిన్న మార్పు సంభవిస్తే మొత్తం ఆవరణ వ్యవస్థ అంతా అస్తవస్యమైపోతుంది.

రోడ్లు, మైనింగ్, నగరీకరణల విస్తరణ పర్యావరణంపై దుష్ప్రభావం చూపుతోంది. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ మోతాదు పెరుగుతోంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఉత్పన్నమవుతున్న ఉత్పాతాల వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు.

ఇప్పటికే మంచినీటి కొరత ప్రారంభమయ్యింది. పశ్చిమాసియాలోని 90 శాతం ప్రాంతాలలో మంచినీటి కొరత మరింత తీవ్రతరం కానుంది. ప్రపంచంలోని పలునదులు బాగా కుంచించుకుపోయాయి. కలుషితం కూడా అయ్యాయి.

### కారణాలు

'మార్కెట్లకే ప్రథమ ప్రాధాన్యం' అనే ప్రస్తుత భావజాలం పర్యావరణానికి పెద్ద సవాలుగా తయారయ్యింది. రోడ్లు, విద్యుత్‌లైన్లు, ఎయిర్‌పోర్టులు తదితర మౌలిక సదుపాయాలు విస్తరించుకుంటూ పోతే - అవి వన్యప్రాణి సంతానోత్పత్తికి విఘాతంగా పరిణమించి జీవజాలం చాలావరకు ఇప్పటికే మరణించింది. మరింత నశించిపోయే ప్రమాదం కూడా ఉంది.

అడవులను నిర్ధాక్షిణ్యంగా నరికివేయడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. మానవాళి నివసిస్తున్న తీరప్రాంతాలకు భారీనష్టం వాటిల్లుతోంది. భూసార క్షీణత ఫలితంగా ఆహారోత్పత్తికి ఉపయోగపడవలసిన భూముల్లో పదిశాతం భూములు బీడుపడే పరిస్థితి తలెత్తుతోంది.

ధనిక దేశాలలో నీరు, గాలి కాలుష్యాలు తగ్గుముఖం పట్టాయి. వన్యప్రాణుల రక్షణకు ఆదేశాలు చర్యలు చేపట్టాయి. అక్కడ అడవుల విస్తీర్ణం పెరుగుతోంది. స్వేచ్ఛా వాణిజ్య ప్రపంచంలో పర్యావరణానికి హాని కల్గిస్తూ స్వల్పకాలిక లబ్ధికోసం ఆరాటపడే పద్ధతి భవిష్యత్‌లో పెనువిపత్తుకు దారితీస్తుంది.

### కార్బన్ డై ఆక్సైడ్ పాత్ర

మన వాతావరణంలో తప్పనిసరిగా కార్బన్‌డైఆక్సైడ్ కొంత ఉండాలి. లక్షలాది సంవత్సరాలుగా వాతావరణంలోని ప్రతి పది లక్షల భాగాల్లో రెండు భాగాలు మాత్రం కార్బన్ డై ఆక్సైడ్ ఉంటోంది. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడు పాలు కొద్ది హెచ్చుతగ్గులు వున్నా ఎన్నడూ మితిమీరిపోలేదు. వాతావరణంలో ఈ వాయువు ఈ పరిమాణంలో ఉండటం వల్లనే జీవరాశి హాయిగా బ్రతకగల ఉష్ణోగ్రత భూమి మీద ఉంటోంది.

పారిశ్రామిక విప్లవం పుణ్యమా అని 20వ శతాబ్దం ప్రారంభం నుండి కార్బన్ డై ఆక్సైడు వాయువు అధికం కాసాగింది. 1900 నుండి అది క్రమంగా పెరిగి ప్రస్తుతం వాతావరణంలో ప్రతి పది లక్షల భాగాల్లో 340 భాగాలకు పెరిగింది. అంతేకాదు ఇతర వాయువులు కూడా దీనికి తోడయి వాతావరణంలో వాటి భాగాలు పెరిగాయి.

### మీథేన్ వాయువు

మీథేన్ వాయువు వాతావరణాన్ని వేడెక్కిస్తుంది. దీనికి రంగు, వాసన ఉండవు. ప్రకృతి వనరుల నుండి, మానవ కల్పితమైన స్థావరాల



SthanikaPalanaTel_February_2011_B&W_2.pmd 2/1/2011, 8:33 PM

నుండి జనించే మీథేన్ వాయువు, కార్బన్ డై ఆక్సైడ్, క్లోరోఫ్లూరో కార్బన్ మున్నగు వాయువులతో కలసి భూమి ఉపరితల ఉష్ణోగ్రతను పెంచుతున్నాయి.

ఇటీవల నరసన్నల నుండి సైతం మీథేన్ వాయువు జన్మిస్తోందంటున్నారు శాస్త్రవేత్తలు. బోల్డర్ పర్వత ప్రాంతాలలో సువిశాలమైన తటాకాలలో మీథేన్ వాయువు బుడగల రూపంలో వస్తోంది.

తటాక తీరాల్లో బురదగా ఉండే ప్రాంతాలలో కుళ్లిపోయిన పదార్థాలపై పరాన్నభుక్కుల్లా జీవించే బాక్టీరియా నుండి కూడా మీథేన్ వాయువు ఉద్భవిస్తోంది.

శీతాకాలం గడచిపోయి వసంతం అడుగుపెడుతున్నప్పుడు గడ్డకట్టిన సరస్సులు క్రమేపీ కరిగిపోతూ, తమలో దాచుకున్న మీథేన్ వాయువును వాతావరణంలోకి విడుదల చేస్తున్నాయి. మీథేన్ పెరుగుదల రేటు క్రమంగా త్వరలోనే ఉచ్చదశకు చేరుతుందంటున్నారు శాస్త్రవేత్తలు.

## ప్రమాదాలు

స్థానికంగా ఒకటి రెండు ప్రాంతాలలో ఉష్ణోగ్రత పెరగడం వేరు. భూగోళం మొత్తం మీద ఉష్ణోగ్రత పెరిగితే దాని పరిణామాలు చాలాతీవ్రంగా ఉంటాయి. ఉష్ణోగ్రత పెరగడం వలన ధృవప్రాంతాలు, అమెరికా, యూరప్‌లలో వేడి పెరుగుతుంది.

ఉష్ణోగ్రతల్లో మార్పుల వల్ల వీచేగాలుల్లో, వాటిదిశల్లో, వర్షపాతంలో కూడా మార్పులు సంభవిస్తాయి. ప్రపంచంలో కొన్ని ప్రాంతాలు అసలు వర్షానికి నోచుకోవు. మరికొన్ని నిత్యవర్షాలతో సతమతమవుతాయి. రుతుపవనాలతో పాటు, తుఫానుల తాకిడి ఎక్కువ అవుతుంది. శీతాకాలాలు అతి శీతాకాలాలుగా మారుతాయి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న వన్యప్రాణులకూ ఈ ఉష్ణోగ్రత పెరుగుదల ప్రాణాంతకం అవుతుంది. మొక్కలకు వేళ్లూనుకోవడం కష్టమవుతుంది. తగిన ఆధారం లేక చెట్లు నశిస్తాయి. వన్యప్రాణులు అడవులు రక్షణ లేక అవస్థల పాలవుతాయి.

## మనిషి మనసు మీద...

వాతావరణ మార్పులు మనిషి మానసిక, శారీరక పరిస్థితులను ప్రభావితం చేస్తాయి. మానసిక పరమయిన ఉద్రేకాలకు, ఒత్తిడులకు వాతావరణ మార్పులు కొంతవరకు దోహదం చేస్తాయి. ఇవి ఒక్కొక్కప్పుడు ఆత్మహత్యలకు కూడా కారణాలు అవుతాయి. నిద్రలేమికి కూడా కారణాలుగా నిలుస్తాయి.

ఉత్తర యూరప్‌లోని ఆల్ప్‌పర్వతాలలో వీచే 'ఫోహెన్' అనే గాలి అక్కడ నివసించే ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తోంది. ఈ వాయువు వల్ల వారికి తలపోటు, ఇన్‌సోమ్నియా అనే రుగ్మతలు వస్తున్నాయి.

## కారకులు ఎవరు?

పర్యావరణ కాలుష్యానికి 75 శాతం కారకులు మనుషులు. 25 శాతం కారణం పరిశ్రమలు. మన ఇళ్లలోని గదులను అనుదినం తుడుచుకుంటాం. వారానికి ఒకసారి ఇళ్ళు దులుపుతాం. ఈ కార్యక్రమంలో పోగయిన చెత్తను ఇంటిముందో, రోడ్డుమీదనో పడవేస్తాం. అంటే ఆప్రాంతాలను కాలుష్యానికి గురిచేస్తున్నాము. ఆ రోడ్డు ఎవరిది? అదీ మనదే? ఇది మరచిపోతున్నాము.

మన ఇంటి ముందున్న రోడ్డునే గుర్తించలేకపోతే పర్యావరణాన్ని ఎలా గుర్తించగల్గుతారు? నగరాన్ని, గ్రామాన్ని, దేశాన్ని ఎలా గుర్తించగలం? మన ఇంటినుండి వెలువడే రేడియో లేదా టివి నుండి వచ్చే పాటలు లేదా మాటలు, ఇంట్లో విడుదలయ్యే బీడి, సిగరెట్టు, చుట్టల పొగలు, మత్తుపానీయాల దుర్గంధం, మన స్కూటరు, కారు మొదలైన వాటినుండి వెలువడే వాయువులు, పాడైన ఆహార పదార్థాలు విడుదల చేసే దుర్వాసనలు ఇవన్నీ పర్యావరణానికి శత్రువులు కావా?

ఇటువంటి విషయాల గురించి తోటివారిలో అవగాహన కల్గించే విధంగా ప్రతిఒక్కరూ మాట్లాడాలి. పర్యావరణ పరిరక్షణ అందరి సమిష్టి బాధ్యత అని గుర్తు ఎరగాలి.

మీ ఇంటిని, గ్రామాన్ని శుభ్రంగా ఉంచండి. ప్రతి ఇంటిలోను కనీసం ఒక చెట్టయినా నాటాలి. నడచి వెళ్లగలిగేటప్పుడు వాహనం వాడకండి. టివి సౌండ్ తగ్గించండి. ఇలాంటి పనులు ఎవరికి వారే చేయగలరు.

## జనం - పర్యావరణం

ఆదిమానవుడు పర్యావరణ వ్యవస్థను దుర్వినియోగం చేయలేదు. కారణం ఆనాడు అతడికి సాంకేతిక పరిజ్ఞానం ఏమాత్రం అందుబాటులో లేకపోవడం. మనిషి పారిశ్రామిక యుగంలో ప్రవేశించాక సాంకేతిక విజ్ఞానంతో భూవనరులను తన సుఖజీవన పద్ధతుల కొరకు దుర్వినియోగం చేయడం ప్రారంభించాడు.

అధిక జనాభా వల్ల కనీస జీవన అవసరాలకు అభివృద్ధి చెందుతున్న దేశాలవారు అడవులను నరికి విస్థాపన వ్యవసాయం చెయ్యడం, గృహనిర్మాణం, కాలుష్యంతో కూడిన వాహనాలను నడపడం, జీవనోపాధి కొరకు పట్టణాలకు తరలివెళ్లి గుడిసెలతో కూడిన మురికి వాడలను పెంచడం ద్వారా నేల, నీరు, గాలిని కలుషితం చేస్తున్నారు.

అధిక జనాభా గల అభివృద్ధి చెందుతున్న దేశాలు యుద్ధ ప్రాతిపదికపై జనాభా పెరుగుదలను అరికట్టాలి. జనన మరణాల స్థాయి ఒకే విధంగా ఉంటే శూన్యజనాభా పెరుగుదల అవుతుంది. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు ఖచ్చితంగా అమలుచేయాలి.

జనాభా పెరిగేకొలది వనరులను ఎక్కువగా వినియోగించాల్సి వస్తుంది. ఎరువులను, క్రిమిసంహారక మందులను అధికంగా వాడాల్సి వస్తుంది. అధిక దిగుబడి పంటలు పండించడం వల్ల కొంతకాలానికి భూమి నిస్సారమయి బంజరు భూమిగా మారుతుంది. ఈవిధమైన అస్థిర వ్యవసాయం వల్ల క్రమంగా జనజీవనం దుర్లభమవుతుంది.

ప్రకృతి పట్ల మనిషికి అవగాహన సమగ్రంగా నేటికీ లేదు. పర్యవసానంగా మనిషి, శాస్త్రవేత్త, రాచరికం ప్రకృతిలో ఆడే ప్రతి



SthanikaPalanaTel_February_2011_B&W_2.pm10 2/1/2011, 8:33 PM

చెలగాటం ప్రాణసంకటంగా తయారవుతోంది. ప్రకృతిని అదుపు చేయలేని మానవుడు ప్రకృతితో ఎందుకు చెలగాటమాడుతున్నాడో తెలియడం లేదు. మొత్తం మానవాళికి ప్రకృతి వరం కావలసింది బదులు, నరకం కానుంది.

## పర్యావరణ పరిణామాలు

మానవ మనుగడకు కల్పతరువుగా నిలచిన ప్రకృతి పట్ల మనిషి నిర్లక్ష్యానికి సాక్ష్యం మనం ప్రస్తుతం ఎదుర్కొంటున్న కాలుష్యభూతం. పర్యావరణ పరిరక్షణ పట్ల నేటి మనిషి ఎంత జాగరూకత వహిస్తే రాబోయే తరాలకు అది అంతమేలు. కలుషిత పదార్థాలను గుర్తించడం అంత తేలికైన విషయం కాదు. బ్యాక్టీరియాల సహాయంతో పరిసరాల్లో ఉండే కలుషిత పదార్థాలను తేలికగా గుర్తించే వినూత్న విధానాన్ని బ్రిటిష్ శాస్త్రవేత్తలు రూపొందించారు. పర్యావరణ పరమయిన పరిణామాలకు అనుగుణంగా ఆ బ్యాక్టీరియా మిణుకుమిణుకుమంటూ వెదజల్లే వెలుగులు ఇందులో విశేషం.

బ్యాక్టీరియాల్లో సహజసిద్ధంగా ఉండే వాతావరణ మార్పులను గుర్తించగలిగే లక్షణం ఆధారంగా శాస్త్రవేత్తలు దీనిని సాధించారు. చుట్టూ ఉండే పరిసరాల్లో జరిగే వివిధ మార్పులకు అనుగుణంగా మనగలిగే సామర్థ్యం బ్యాక్టీరియాలకు సహజంగానే ఉంటుంది. ఇందుకుగాను బ్యాక్టీరియాలో ఉండే అనేక పదార్థాలతో పాటు ముఖ్యంగా కొన్ని ప్రోటీన్లు ఎంతో ఉపకరిస్తాయి. వీటికి బయోసెన్సార్లు అమర్చారు. వివిధ పర్యాణపరమయిన మార్పులను గుర్తించగలిగే బయోసెన్సార్ల రూపకల్పనలో మరొక ముఖ్యమైన అంశం బ్యాక్టీరియాలు ఆయా మార్పులకు అనుగుణంగా ప్రకాశించగల్గడం. దీనిని జనిటిక్ ఇంజనీరింగ్ సహాయంతో సాధించారు.

ఈ బయోసెన్సార్లు కేవలం వాతావరణపరమైన అంశాలను గుర్తించడమే కాకుండా వాతావరణ పీడనంలో జరిగే మార్పులను కూడా పసిగట్టగలవు. ఉష్ణోగ్రతలోని మార్పు చేర్పులను పసిగట్టగలవు. వీటి సహాయంతో అమ్ల లక్షణాలను కూడా నమోదు చేయడం సాధ్యమవుతుంది.

కాలుష్య పదార్థాలను, యుద్ధరంగంలో వెలువడే జీవ, రసాయన ఔషధాలను గుర్తించడంలో కూడా ఇవి ఉపకరిస్తాయి. దీని ఆధారంగా కలుషిత పదార్థాల నిర్మూలనకు మరిన్న పటిష్టమైన విధానాలు రూపొందించడం సాధ్యమవుతుంది.

## భూతాపం

భూతాపం మన మనుగడకు ఎంతో అవసరం. కాకపోతే అతి తోనే సమస్య. సూర్యకిరణాలు భూమిపై పడి వేడిని పుట్టిస్తాయి. ఈ వేడి పరారుణ కిరణాల రూపంలో ఉంటుంది. ఈ కిరణాలు భూమి మీద పరావర్తనం చెంది తిరిగి అంతరిక్షంలోకి వెడతాయి.

వాతావరణంలో వున్న కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, ఓజోన్, నీటి ఆవిరి (గ్రీన్‌హౌస్ వాయువులు) మొదలయినవి ఈ పరారుణ కిరణాలు అంతరిక్షంలోకి వెళ్లకుండా పట్టి ఉంచుతాయి. ఫలితంగా భూమి ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది. గ్రీన్‌హౌస్ వాయువులు లేకపోతే పరారుణ కిరణాలు పైకి వెళ్లిపోయి భూమి ఉష్ణోగ్రత ఇప్పటికన్నా 30 డిగ్రీల సెలిసియస్ మేర తగ్గిపోయి ఉండేది. అటువంటి పరిస్థితులలో జీవజాలం ఉనికే ప్రశ్నార్థకం అవుతుంది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉపకారం వల్లనే భూతాపం స్థిరంగా ఉండి జీవజాలం హాయిగా జీవించగల్గుతోంది.

ఈ గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణం 19వ శతాబ్దం నుండి అసహజమైన స్థాయిలో పెరగడం వల్ల పరారుణ కిరణాలను అవి మరింత ఎక్కువగా పట్టి ఉంచుతున్నాయి. ఫలితంగా భూతాపం పెరుగుతోంది. భూతాపం పెరగడం వల్ల ఎన్నో సమస్యలు మన ముందు సవాళ్లుగా నిలుస్తున్నాయి.

## సమస్యలు - పరిష్కారాలు

- ★ సముద్రజలాల ఉష్ణోగ్రత కూడా పెరుగుతోంది. ఫలితంగా వ్యాకోచించడం ఆపైన వాటి మట్టం పెరగడం ఒక పరిణామం. ఈ పెరుగుదల ఒకటి లేదా రెండు మీటర్లకు చేరిందంటే లోతట్టు దేశాలన్నీ జలమయం అయిపోతాయి.
- ★ వేసవిలో ధ్రువప్రాంతాల్లోని మంచు, హిమాలయాలు వంటి మంచు కొండలలోని మంచు కరిగి వరదలు సంభవించే ప్రమాదం అధికమవుతోంది.
- ★ అతివృష్టి లేదా అనావృష్టిల కారణంగా వ్యవసాయం సంక్షోభంలో పడిపోతోంది.
- ★ మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు భవిష్యత్‌లో విజృంభించే అవకాశం హెచ్చుగా ఉంటుంది.
- ★ అందుకే పర్యావరణానికి హానిచేయని జల, సౌర, పవన, అణువిద్యుత్ ఉత్పత్తిని అధికం చేయాలి.
- ★ జీవ ఇంధనాలయిన బయోడీజిల్ వంటి వాటి వాడకంపై దృష్టి అందరూ సారించాలి.
- ★ ఆఫీసులు, ఇళ్లల్లో ఫ్లోరసెంట్ బల్బులు వాడడం అలవరచుకోవాలి. అవసరం లేనపుడు వాటిని, ఇతర విద్యుత్ ఉపకరణాలను ఆపివేయాలి.

ఒకప్పుడు పర్యావరణ సమస్య సైన్స్‌కు సంబంధించినదని భావించారు. దీనివల్ల సంభవిస్తున్న ప్రమాదాలు గురించి తెలిశాక ప్రజల దృష్టి ఈ అంశం మీద కేంద్రీకృతమై అది ప్రజా అంశంగా రూపుదాల్చింది. ఇప్పుడిది రాజకీయ సమస్య కూడా అయి కూర్చుంది.

ఎవరో ఏదో చేస్తారని ఎదురు చూడడం కన్నా పర్యావరణ పరిరక్షణలో ఎవరికి వారే తమదైన శైలిలో కృషిచేయాల్సిన అవసరం ఉంది.

**- సి.వి. సర్వేశ్వర శర్మ**



SthanikaPalanaTel_February_2011_B&W_2.pm11 2/1/2011, 8:33 PM



# శాంతి దూత, ఆదర్శ మూర్తి మహమ్మద్



**మానవజాతి సంస్కరణకు ఎంతో మంది మహనీయులు, మహాత్ములు, ప్రవక్తలు ఈ పుడమిపై ప్రభవించారు. సృష్టి ప్రారంభంనుండి ఈనాటి వరకు అన్ని కాలాల్లో, అన్ని జాతుల్లో, అన్ని దేశాల్లో, అన్ని ప్రాంతాల్లో ఈ మహనీయులు మానవుల సంస్కరణకు విశేషంగా కృషి చేశారు.**

ఆది మానవుడు ఆదం అలైహిస్సలాం మొదలు నేటి వరకు దాదాపు ఒక లక్షా ఇరవై నాలుగు వేల మంది దైవ ప్రవక్తలు ఈ పుడమిపై ప్రభవించినట్లు ధర్మశాస్త్ర గ్రంథాల ద్వారా మనకు తెలుస్తోంది. ఈ ప్రవక్తల పరంపరలోని చిట్ట చివరి దైవ ప్రవక్తే మహమ్మద్ సల్లల్లాహు అలైహిసల్లం. ఈ మహనీయుని జన్మదినాన్నే 'మిలాదున్నబి' అంటారు.

'మిలాదున్నబి' అంటే ముహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు అని అర్థం. ఈయన జననం మానవాళికి శుభోదయం. సమస్త సృష్టికీ కారుణ్యం. ఎందుకంటే అజ్ఞానాంధకార విషవలయంలో కొట్టుమిట్టాడుతున్న మానవ జాతికి ఆయన వెలుగు బాట చూపారు. ఈనాటి ప్రపంచ పరిస్థితులు, పరిణామాల దృష్ట్యా ఇస్లామి ధర్మ ఉద్యమ సందేశప్రదాత అయిన మహమ్మద్ ప్రవక్త (స)ను గురించి, ఆయన సందేశాన్ని గురించి 'మిలాదున్నబి' సందర్భంగానైనా మరోసారి మననం చేసుకోవడం సమంజసం, సముచితం కూడా!

క్రీ. శ. 571 ఏప్రిల్ మాసం ఇరవయ్యో తేదీన, సోమవారం నాడు అరేబియా దేశంలోని మక్కా నగరంలో ముహమ్మద్ ప్రవక్త (స) జన్మించారు. ఈయన తల్లి పేరు ఆమినా, తండ్రి పేరు అబ్దుల్లాహ్. ఈ మహోన్నత వ్యక్తి జన్మించక ముందే తండ్రినీ, ఆరేళ్ళ ప్రాయంలో తల్లినీ కోల్పోయారు. అనాథ అయిన ఆరేళ్ళ బాబును తాతయ్య అబ్దుల్ మతల్లిబ్ అక్కున చేర్చుకున్నారు. ఆయన తరువాత మహమ్మద్ ప్రవక్త (స) పోషణ, సంరక్షణా బాధ్యతను బాబాయి అబూతాలిబ్ స్వీకరించి అల్లారుముద్దుగా పెంచి పోషించారు. చిన్నతనం నుంచే బాలమహమ్మద్ సుగుణాల రాసిగా ప్రశంసించబడ్డారు.

నీతి, నిజాయితీ సేవాతత్పరత, సత్యసంధత, విశ్వసనీయత ఆయనకు ఉగ్గుపాలతోనే అలవడ్డాయి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించడం లాంటి అనేక సుగుణాల రీత్యా ఆయన ప్రజల మనసులు చూరగొని సాదిఖగా, అమిన్‌గా అంటే సత్య సంధునిగా, విశ్వసనీయునిగా పిలవబడ్డారు.

ఆయనకు ఊహ తెలిసే నాటికి ఒక్క అరేబియా దేశమంతా అజ్ఞానంలో కూరుకుపోయి ఉంది. అనాగరికం, ఆటవికత రాజ్యం చేస్తున్నాయి. నీతి, నిజాయితీలు, సిగ్గు, సౌశీల్యం అంటే ఏమిటో వారికి తెలియదు. న్యాయా న్యాయాలను, ధర్మా ధర్మాలను పక్కన పెట్టి, అన్యాయంగా, అధర్మంగా, దుర్మార్గంగా ప్రవర్తించేవారు. వారి దృష్టిలో స్త్రీకి అసలు విలువే ఉండేదికాదు. అమెకంటూ ఒక వ్యక్తిత్వం ఉందన్న విషయాన్ని వాళ్ళు పట్టించుకునేవారు కాదు. ఆడ పుట్టుకను అపశకునంగా భావించి పురిట్లోనే పీక పిసికి చంపేవాళ్ళు, సారాయి, జూదం, వ్యభిచారం వారిదృష్టిలో చాలా సామాన్య విషయాలు. ఆనాటి ప్రజలు జూదంలో ధన సంపదలే కాకుండా, ఆలుబిడ్డలను కూడా పణంగా పెట్టేవారు.

ఇంతే కాదు, ఇంకా ఇలాంటి అనేక అవలక్షణాల కారణంగా వారి హృదయాలు బండబారి పొయ్యాయి. మానవ రూపంలో ఉన్న దానవులుగా వారు తయారయ్యారు.

ఈ విధంగా వారి పరిస్థితి అధమాతి అధమంగా దిగజారి పోవడంవల్ల నైతికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా అన్ని విధాలావారి జీవన వ్యవస్థ పతనానికి గురై పోయింది. ప్రతినిత్యం కలహాలు, కలతలే చిన్న చిన్న తగాదాలు చిలికి చిలికి, చిలువలు పలవలై భీకర సంగ్రామాలకు దారి తీసేవి. కక్షలు, కార్పణ్యాలు తరతరాలుగా నరనరాల్లో జీర్ణించుకుపోయి సమర రంగాల పరంపర సాగుతూండేది. సరైనటువంటి ధార్మిక అవగాహన, రాజకీయ చైతన్యం లేని కారణంగా ఒక సమగ్రమైన, సంపూర్ణ సామాజిక జీవన వ్యవస్థ వారిలో ఉనికిలోకి రాలేక పోయింది.

అటువంటి పరిస్థితుల్లో, అటువంటి వాతావరణంలో జన్మించారు ముహమ్మద్ ప్రవక్త(స). సమస్త రంగాల్లో పతనానికి గురైన జాతిని సంస్కరించడానికి అవిరామంగా కృషిచేశారు. ఈ క్రమంలో ఆయన అనేక కష్ట నష్టాలను ఎదుర్కొన్నారు. అనేక చేదు అనుభవాలను చవి చూశారు. అయినా మొక్కవోని ధైర్యంతో, ఒకే దేవునిపై విశ్వాసమున్న ఒకే ఒక్క విప్లవ నినాదంతో సమాజంలోని రుగ్మతలన్నింటినీ సమూలంగా నిర్మూలించారు. ముహమ్మద్ మహనీయులు గొప్ప దైవ ప్రవక్త అయినప్పటికీ, ఒక సామాన్య సామాజిక కార్యకర్తలా సమాజానికి సేవ చేస్తూ, ప్రజల్ని ఇహ, పర వైఫల్యాలనుండి రక్షించడానికి శక్తి వంచనలేని కృషి చేశారు.

సమాజంలోని అన్ని రకాల అసమానతలు, అమానవీయతలతోపాటు, సమస్త రుగ్మతలను దూరం చేయడానికి చివరి శ్వాసవరకూ ప్రయత్నిస్తూనే ఉన్నారు. కనుక ఆ మహనీయుని ప్రతి ఆచరణ, ప్రతి ఉద్దేశమూ మానవాళికి మార్గదర్శకం కావాలి. పేద సాదల పట్ల, అనాథలు, అన్నార్తుల పట్ల బడుగు బలహీన వర్గాల పట్ల ఆయన చూపిన ప్రేమానురాగాలు, సమానత్వ భావన, స్త్రీ జాతి పట్ల ఆయన



Sthanka_Feb.colo.indd 30 01/02/11 6:35 PM

చూపిన గౌరవ మర్యాదలు తల్లి పాదాల క్రింద స్వర్గమున్నదని చెప్పి స్త్రీ జాతి ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటిన తీరు, తల్లిదండ్రులను గౌరవించనిదే, సేవించనిదే స్వర్గ ప్రవేశం దుర్లభమన్న ఆయన ఉపదేశం ప్రజలదరికీ ఆచరణీయం కావాలి.

అజ్ఞానం, అంధకారంతో కూరుకుపోయిన నాటి సమాజంలో ముహమ్మద్ ప్రవక్త(స) జ్ఞానజ్యోతులు వెలిగించారు. విద్యాకుసుమాలను వికసింపజేశారు. విద్యార్జన ప్రతి ఒక్కరి విధి అని ఆయన నిర్దేశించారు. 'జ్ఞానం జీవితం, అజ్ఞానం మరణం' అని విశదీకరించారు. జ్ఞాన సంపన్నులు, జ్ఞాన విహీనులు సమానం కాజాలరని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ సంతానానికి విద్యనేర్పించాలని, మీ కోసం కాకపోయినా ముందుతరాల సంక్షేమానికి ఇది చాలా అవసరమని నొక్కిచెప్పారు.

ఆ కాలంలో అనాథలు చాలా నిరాదరణకు గురయ్యేవారు. శిక్షణ, సంరక్షణ పేరుతో వారిని పీడించడం జరిగేది. మహమ్మద్ ప్రవక్త (స) ఈ దిశగా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అనాథలను నిరాదరించేవారిని మహాపాపాత్ములుగా పరిగణించారు. వారిని ఆదరించి, సంరక్షించేవారిని స్వర్గవాసులని శుభవార్త నిచ్చారు. వారితో సత్ ప్రవర్తన కలిగి ఉండాలని, వారి ఆస్తిని కబళించరాదని స్పష్టంగా ఆదేశించారు. అదే విధంగా ఖైదీల పట్ల కూడా కరుణతో వ్యవహరించాలని, వారిని హింసించ కూడదని, అన్యాయంగా శిక్ష అనుభవిస్తున్న వారి విడుదలకు కృషి చేయాలని ఆజ్ఞాపించారు.

వితంతువులను చిన్న చూపు చూడకూడదని, సమాజంలో వారికి గౌరవ ప్రదమైన స్థానం దక్కాలని, శుభకార్యాల్లో వారిని ఆహ్వానించకపోవడం అన్యాయమని, ఈ అమానవీయ దురాచారాన్ని మానుకోవాలని ఉపదేశించారు. అవసరం, అవకాశం ఉన్నవారి పునర్వివాహాలకు ప్రయత్నించాలని, అలాంటి వారిని నిర్లక్ష్యం చేసిన సమాజం అధోగతి పాలవుతుందని ఆయన హెచ్చరించారు. వృద్ధులను ఆదరించాలని, వారిని ఛీత్కరించుకోరాదని, ఒకనాటికి అందరూ ఆ దశకు చేరుకునే వారేనని ఆయన (స) హితవు పలికారు.

సమాజంలో మానవ సంబంధాల పటిష్టతకు ముహమ్మద్ ప్రవక్త (స) చేసిన కృషి అనుపమానం. సంఘంలో ఒకరిపై ఒకరికున్న హక్కుల్ని, బాధ్యతల్ని విశదీకరించి, వాటిని సక్రమంగా పాటించాలని బోధించారాయన. ప్రవక్త మహనీయులు ప్రజలకు చెప్పిన ప్రతి విషయాన్నీ స్వయంగా ఆచరించి చూపారు. అందుకే ఆయన మానవ జాతికి ఆదర్శమయ్యారు. ఆచరణ లేని హితబోధ జీవంలేని కళేబరం లాంటిదని ఆయన చెబుతుండేవారు.

దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం తప్ప కరవాలం ఎత్తడానికి వీల్లేదని శాసించారాయన. రణరంగానికే మానవతను నేర్పిన మహనీయుడు ముహమ్మద్ ప్రవక్త(స). సమర రంగంలో ఆయన గాని, ఆయన అనుచరులుగాని పాటించిన యుద్ధనీతి అజరామరం. అలాంటి నీతి ప్రపంచంలో ఎక్కడా మనకు ఈనాటి వరకూ కనిపించలేదు. తమ, పర బేధాలకు అతీతంగా అందరికీ ఆయన కరుణా సముద్రుడే.

ఎన్ని కష్టానష్టాలు ఎదురైనా, ప్రజా సంక్షేమాన్ని, వారి ఇహపర సాఫల్యాలను ఆయన ఏనాడూ విస్మరించలేదు. ప్రజలకు సత్యాన్ని, ధర్మాన్ని బోధించినందుకు, ప్రయత్నించినందుకు ఆయన్ని 'తాయిఫ్' అనే పట్నంలో రక్తసిక్తమయ్యేలా కొట్టారు. 'దారున్నద్వ' లో ఆయన్ని హతమార్చడానికి కుట్రలు, కుతంత్రాలు పన్నారు. 'నమాజు' చేస్తున్న సమయంలో పశువుల పేగులు తెచ్చి ఆయనపై వేశారు. అయినా ఆ మహనీయుడు సహనాన్ని వీడలేదు. శాపనార్ధాలు పెట్టలేదు. తనపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నవారు అజ్ఞానంతో, అమాయకత్వంతో అలా చేస్తున్నారని, వారిని క్షమించి, సద్బుద్ధిని ప్రసాదించమని దైవాన్ని వేడుకున్నారు. ఎంతో వివేకంతో వ్యవహరించి ప్రజల హృదయాల్లో విజేతగా నిలిచారు. చివరికి మానవ జీవితంలోని సమస్త రంగాలనూ సంపూర్ణంగా సంస్కరించి ఒక ఉత్తమ నైతిక, మానవీయ విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించారు.

కాబట్టి మహనీయ ముహమ్మద్ ప్రవక్త వారి ప్రతి ఆదేశం, ప్రతి ఆచరణ నేడు మనందరికీ ఆదర్శంకావాలి. ఈనాడు మానవ సమాజం ఇంతగా కలుషితమై పోయిందంటే, ప్రవక్తలు, సంస్కర్తల మాటను, బాటను అనుసరించకపోవడమే, ఈనాడు కూడా మన సమాజంలో ఇంచుమించు ముహమ్మద్ ప్రవక్త జననానికి ముందున్న పరిస్థితులే ఉన్నాయంటే అతిశయోక్తికాదు, నేటి మన సమాజంలో అన్యాయం, అక్రమం, అవినీతి, లంచగొండి తనం వేళ్ళూనుకుపొయ్యాయి. వరకట్నం, హింస, అశ్లీలం, హత్యలు, అత్యాచారాలు రోజు రోజుకూ పెరిగి పోతున్నాయి.

మహిళామణుల మాన ప్రాణాల రక్షణ ప్రశ్నార్ధకమై పోయింది. స్వేచ్ఛ పేరుతో, కళల పేరుతో స్త్రీ జాతిని అంగడి సరుకుగా మార్చింది మన పురుషాధిక్య సమాజం. అనాధలు, వృద్ధులు ఏ విధంగా నిరాదరణకు గురవుతున్నారో, రోజురోజుకూ పెరిగిపోతున్న అనాధ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలే సాక్ష్యం చెబుతున్నాయి, ప్రవక్త ప్రవచించిన 'జకాత్' వ్యవస్థను కాదన్న ఫలితంగా, పేదవాడు మరింత పేదవాడుగా, ధనవంతుడు మరింత ధనవంతుడుగా తయారవుతున్నాడు, నైతిక, ఆధ్యాత్మికత సామాజిక, రాజకీయ రంగాలన్నీ కలుషితమై పొయ్యాయి.

అందుకని, ఇలాంటి పరిస్థితుల్లోనైనా ముహమ్మద్ ప్రవక్త(స) బోధనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే, ఆయన సమస్త మానవాళికీ కారుణ్యంగా పంపబడిన దైవ ప్రవక్త. మానవులు తమ నిత్యజీవితంలో ఎదుర్కొనే అన్ని సమస్యలకూ ఆయన ఉపదేశాల్లో పరిపూర్ణ పరిష్కారం ఉంది. అందుకే జార్జ్ బెర్నార్డ్ షా ఇలా అన్నాడు. 'మహమ్మద్‌ను మానవాళిపాలిట రక్షకునిగా అభివర్ణించవలసి ఉంటుంది. ఆయన లాంటి ఓ వ్యక్తి నేటి ఆధునిక ప్రపంచానికి పాలకుడిగా ఉంటే, అతను నేటి ప్రపంచ సమస్యలన్నింటినీ పరిష్కరించి, మానవులకు అన్నిటికన్నా ప్రధానంగా కావలసిన శాంతి, సంతోషం, సౌభాగ్యాలను అందించగలడని నేను దృఢంగా నమ్ముతున్నాను.

కనుక, నేడు మన సమాజం శాంతి, సౌభాగ్యాలతో అలరారాలంటే, అన్నిరకాల అసమానతలు అంతమై, సమస్త మానవాళి సుఖసంతోషాలతో వర్ధిల్లాలంటే, వారి ఇహ, పరలోక జీవితాలు సఫలం కావాలంటే ముహమ్మద్ ప్రవక్త (స) ఆచరించి చూపిన మార్గాన్ని అనుసరించడం తప్ప మార్గంలేదు. దైవం మానవాళి కంతటికీ ప్రవక్త వారి ఉపదేశాలను, అర్ధం చేసుకొని, ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

- మహమ్మద్ ఉస్మాన్‌ఖాన్



Sthanka_Feb.colo.indd 31 01/02/11 6:35 PM

# గాలివాన

పాలగుమ్మి పద్మరాజు

**వాళ్లిద్దరికీ ఒకరి మాటలు ఒకరికి వినిపించడం లేదు. ఉన్నది ఒకే గదిలో. కాస్త ఎడంగా. కాని ఎంత పెద్దగా అరిచినా వినిపించడం లేదు. కారణం? బయట భయంకరమైన వర్షం, గాలి, ఊళలతో నిండిన హోరు. ఆ రాత్రి ఏవో కొన్ని క్రూరశక్తులు విజృంభించి, ఈ భూమిని కబళిద్దామా అని నిశ్చయించుకుని పూనకం పోతున్నాయి.**

అంతటి గాలివానలో, మనిషిజాడ కూడా లేని అతి చిన్న స్టేషనులో, మరికాసేపటికో, యింకాసేపటికో కూలిపోతుందేమో అనిపించే వెయిటింగ్ రూములో ప్రాణాలు అరచేత పెట్టుకొని కూచుని ఉన్నారు రావుగారు. ఆయన గతంలో పెద్ద అడ్వకేటు. ఇప్పుడు కొడుక్కి తన వృత్తిని అప్పగించి, బోలెడంత తీరిక కలిగి, ఈ సమాజాన్ని రిపేరు చేసే పనిలో పడ్డారు. ఊరూరా తిరిగి ఉపన్యాసాలు ఇస్తూ ఇల్లంటే ఇలా ఉండాలి, భార్య అంటే ఇలా ఉండాలి, పిల్లలంటే ఇలా ఉండాలి, పౌరుడంటే ఇలా ఉండాలి, జీవితం అంటే ఇలా ఉండాలి... అని అన్నిటి పట్లా నిక్కచ్చి అభిప్రాయాలను వ్యక్తపరుస్తుంటాడయన. ఆ అభిప్రాయాలకు ఎవరైనా భంగం వాటిల్లజేస్తే ఆయనకు కోపం. ఛీ అనుకుంటాడు. ఎవరైనా ఛీకొట్టాల్సిన మనుషులు ఎదురుపడితే ఛీకొట్టే తీరుతాడు.

అయితే - ఇవాళ, ఇంత గాలివానలో, మరికాసేపట్లో ఈ భూమి మొత్తాన్ని గాలి ఎక్కడికో ఎగరేసుకొని పోతుందనిపించేంత భయంలో రావుగారు ఆ గదిలో కేవలం ఒక ఛీకొట్టాల్సిన మనిషితో కూర్చుని ఉన్నారు. ఆ మనిషి ఒక ముష్టిది. ముష్పయ్యేళ్ల ముష్టిది.

ట్రైనులో రావుగారు పరుపుల పెట్టి ఎక్కి ఈ ఊళ్లో దిగే ముందు ముష్టిది ఆయనకు తారసపడింది. 'ఒక్క డబ్బు ఇప్పించండి బాబూ' అని వేడుకుంది. రావుగారు విదల్చలేదు. ఎందుకంటే మనిషనేవాడు ముష్టెత్తకూడదు అనేది ఆయన రూలు. కాని ఇప్పుడు ఆయన ఆ ముష్టిదానితోటే ఉన్నారు. రావుగారు దిగిన స్టేషనులోనే ముష్టిదాన్ని కూడా బలవంతంగా దింపేయడం వల్ల ముష్టిది గాలివానలో చిక్కుకుంది. అదే గదిలో తల దాచుకుంది. నీళ్లు కారే ఒంటితో మూల కూచుని ఉంది.

ఇంకా రాత్రయ్యింది. ఇంకెంతో చీకటయ్యింది. మరెంతో భయమైంది. ఉన్నట్టుండి-గాలి-ఒక్కసారిగా రాక్షసాకారం పొంది కాలితో ఒక్కతాపు తన్నింది వెయిటింగ్ రూమ్ తలుపుని. తలుపు చీలిక పేలికలయ్యింది. బొయ్‌మని గాలి జొరబడింది. గది ఊగింది. ఆ దెబ్బకు రావుగారు, తను ఇంతకాలం పెట్టుకున్న నియమ నిబంధనలను, వ్యక్తిగతమైన నిశ్చితాభిప్రాయాలను, ఎదుటి వ్యక్తుల్లో ఆశిస్తున్న సంస్కరణను గాలికి వదిలిపెట్టి, చిన్నపిల్లవాడిగా మారి, బోరున విలపిస్తూ ఒక్క ఉదుటున వెళ్లి ముష్టిదాని సమీపంలో పడ్డారు.



ఆ ముష్టిది, ఇద్దరు చిన్న చిన్న బిడ్డల్ని గుడిసెలో ఒంటరిగా వదిలిపెట్టి, పావలా డబ్బుకోసం రైలెక్కి, ఆ పిల్లలేమైపోయారో, తన గుడిసె ఏమైందో అన్న ఆవేదన ఉన్నా, బతుకు మీద పెద్దగా అంచనాలు లేనట్లుగా, నిశ్చింతంగా, ఒక తల్లిలా మారి, తన శరీరాన్ని నెగడులా మార్చి, రావుగారిని హత్తుకుంది. 'నా సుట్టూ సేతులేసుకోండి బాబూ కాంత ఎచ్చగుంటది పాపం' అని ధైర్యం ఇచ్చింది.

అరవై ఏళ్ల రావుగారు, ఈ సంఘంలో పెద్దమనిషి. సంఘాన్ని చెక్కడానికి ప్రయత్నించే రావుగారు, ఎదుటివారి బతుకును నిశితంగా విమర్శించే రావుగారు, ముష్పయ్యేళ్ల ముష్టిదాని ఒడిలో నిస్సహాయంగా ఒదిగిపోయారు. పసిబాలుడిలా ఒదిగిపోయారు. ఏడుస్తూ ఒదిగిపోయారు. నిర్మలంగా ఒదిగిపోయారు. ఆ క్షణంలో ఆయనకు జీవితం మీద ఉండే నిశ్చితాభిప్రాయాలన్నీ చెరిగిపోయాయి. ఒకరి జీవితం పట్ల నిశ్చితాభిప్రాయాన్ని ఏర్పరుచుకునే అహంకారం అణిగిపోయింది.

ఎవరి జీవితానికి ఎవరు తీర్పరులు? ఎవరి జీవితాన్ని ఎవరు వేలెత్తి చూపగలరు?

ప్రతి ఒక్కరి జీవితమే ఒక గాలివాన. ఆ గాలివానను తట్టుకుంటూ. సముద్రంలో అలలను తప్పుకుంటూ, బలంగా తెడ్డు వేసి, ధైర్యంగా తెడ్డు వేసి, వీలు కాకపోతే వంచన చేత కుట్ర చేత సర్దుబాటు చేత, ఊడిగం చేత, ఒకరికి సాగిలపడటం చేత, ఒకరి పాదాలు పట్టుకోవడం చేత, ఒకరి దగ్గర ముష్టెత్తుకోవడం చేత... ఎలాగైనా సరే ఈ బతుకు పడవను ఒడ్డెక్కించాలని ప్రతి ఒక్కరూ పోరాడుతుంటే ఒడ్డున కూర్చుని వీడు ఫలానా, వాడు ఫలానా అని పేరు పెట్టడానికి సరిగ్గా బతకడం లేదు అని ఆక్షేపించడానికి మీరెవరు, వారెవరు, రావుగారెవరు, అసలు ఎవరైనా ఎవరు?

భయంకరమైన గాలివాన గడిచిపోయింది.

తెల్లారేసరికి అన్నీ కూలిపోయి కనిపించాయి రావుగారికి, ముష్టిది లేదు. ఎటో పోయింది. జేబులో తన పర్సు? లేదు. టికెట్ల కౌంటరు కూలిపోయి ఉంటే, ఆ కౌంటరు డబ్బు దొంగిలించి, నోట్లను చేతిలో పట్టుకొని, మరో చేతిలో పర్సుతో, కూలిన గోడ కింద చనిపోయి కనిపించింది ముష్టిది.

రావుగారు ఆమె నుదురు తాకి చూశారు. చల్లగా ఉంది. నిర్జీవంగా ఉంది. గాలివాన ముగిసినట్టుగా ప్రశాంతంగా ఉంది. రావుగారికి ఎందుకనో ఏడుపు వచ్చింది. ముష్టిదాని మీద వాత్సల్యం కలిగింది. ఆమెను ఛీ కొట్టాలనిపించలేదు. ఆమె చేసిన దొంగతనం తప్పు అనిపించలేదు. ఆమె మొత్తంగా ఏమి చేసినా ఎందుకు చేసినా అదంతా తనకు సమ్మతమే అన్నట్టుగా ఆయన బోరుబోరుమని ఏడ్చాడు. ఆ క్షణంలో ఆయన - ఈ జగతిలోని ప్రతి మనిషినీ అతడి తప్పొప్పులతో పాటు సమ్మతించేలా కనిపించాడు.

☆



Sthanka_Feb.colo.indd 32 01/02/11 6:35 PM

# వినూత్న అకౌంటింగ్ విధానంతో పంచాయితీరాజ్ సంస్థలకు పునరుజ్జీవనం



స్థానిక స్వపరిపాలనకు కూకటివేళ్ళుగా పంచాయితీరాజ్ సంస్థలు ఏర్పాటు కాబడి సుమారు 50 సంవత్సరాలు పూర్తి కావడం జరిగింది. ఈ 50 సంవత్సరాల కాలంలో పంచాయితీరాజ్ సంస్థలలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. అశోక్ మెహతా కమిటీ సిఫార్సుల ప్రకారం, దేశంలోని పలు రాష్ట్రాలలో మండల స్థాయి పంచాయితీలు, కొన్ని రాష్ట్రాలలో పూర్వపు బ్లాకు పంచాయితీలు ప్రస్తుతం అమలులో వుండటం అతిముఖ్యమైన మార్పులలో ఒకటి. అలాగే 1992 సం॥లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగంలోని 11వ షెడ్యూలు ప్రకారం 29 విధులు, అధికారాల బదలాయింపు మరొక ముఖ్యఘట్టం. ఈ కార్యక్రమంలోనే 11వ ఆర్థిక సంఘం సిఫార్సుల ననుసరించి పంచాయితీరాజ్ సంస్థల యొక్క జవాబుదారీనాన్ని, పరిపాలనలో పారదర్శకతను పెంపొందించడానికి అవసరమైన మోడల్ అకౌటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడం మరొక ముఖ్యమైన అంశం.

2002 సం॥లో కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ప్రవేశ పెట్టబడిన నూతన అకౌటింగ్ విధాననాన్నే మరిన్ని మార్పులు, చేర్పులతో సరళీకరించి, ప్రాథమిక స్థాయిలోని పంచాయితీరాజ్ సంస్థలు కూడా అనుసరించే విధంగా ఈ నూతన మోడల్ అకౌంటింగ్ విధానాన్ని రూపొందించారు. ఆర్థిక ప్రణాళిక, సామాజిక న్యాయం అనేది పంచాయితీరాజ్ సంస్థల ప్రధాన నినాదం. పంచాయితీరాజ్ సంస్థలలో ఈ మోడల్ అకౌంటింగ్ విధానాన్ని అమలు పరచడం ద్వారా పారదర్శకత, ఆర్థిక వనరుల సక్రమ వినియోగం, ఆర్థిక పరిపుష్ఠి, సదరు సంస్థలపై విశ్వసనీయతను ఇనుమడింప చేయవచ్చును.

అంతే కాకుండా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు, ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో సులభతరంగా ఆర్థిక వనరుల లావాదేవీల తాలూకు నివేదికలను సత్వరమే అందించే విధంగా ఇన్ఫర్మేషన్ మరియు కమ్యూనికేషన్ టెక్నాలజీ సహాయంతో ఈ అకౌంటింగ్ విధానానికి సాఫ్ట్ వేర్ రూపొందించడం జరిగింది. అదే ప్రియసాఫ్ట్. దీనిని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ వారు రూపొందించారు. ప్రియసాఫ్ట్ అనగా పంచాయితీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్. ఈ సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టడం వెనుక వున్న ముఖ్య కారణమేమిటంటే మోడల్ అకౌంటింగ్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు మాత్రమే పెర్‌ఫార్మెన్స్ ఆధారిత గ్రాంటును విడుదల చేయవలసినదిగా 13వ ఆర్థిక సంఘం తన సిఫారసులలో పేర్కొనడం.

రాజ్యాంగంలోని 11వ షెడ్యూలులో పొందుపరచిన 29 విధులను 23 అంశాలు (మేజర్‌హెడ్స్) గా వర్గీకరించారు. గతంలో నూతన అకౌంటింగ్ విధానంలోని 4 అంచెల వర్గీకరణకు, 16 నమూనాలకు స్వస్తి చెప్పి మరింత సరళీకృతమైన విధానంలో 3 అంచెల వర్గీకరణ ద్వారా లావాదేవీలను గుర్తించటం, ఇందుకు సంబంధించిన నివేదికలను 6 ఫార్మాట్లలో రూపొందించడానికి వీలుగా ఈ మోడల్ అకౌంటింగ్ ప్రియసాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.

ప్రియసాఫ్ట్‌వేర్ ద్వారా జిల్లా మండల గ్రామపంచాయితీలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని అనగా ట్రెజరీ లేదా బ్యాంకు లావాదేవీల ఖాతాల వివరాలు, ఇతర ముఖ్య వివరాలను పొందుపరచవచ్చు. ఈ సాఫ్ట్‌వేర్‌లో ఆదాయ వ్యయాల తాలూకు అకౌంట్ హెడ్‌లు అంతర్గతంగా ఇమిడి వున్నాయి. మనం చేయవలసినదేమిటంటే ఆదాయ వ్యయాల నమోదుకు అవసరమైన ఖచ్చితమైన హెడ్‌ఆఫ్ అకౌంటును ఎంచుకోవడం.

**ప్రియసాఫ్ట్‌వేర్‌ను ప్రధానంగా 4 విభాగాలుగా విభజించటం జరిగింది.**

1. మాస్టర్ ఎంట్రీ
2. బడ్జెట్ ఎస్టిమేట్లు
3. ట్రాన్సాక్షన్స్
4. రిపోర్టులు

## ప్రియా సాఫ్ట్



SthanikaPalanaTel_February_2011_Colour_1.pmd 2/1/2011, 10:00 PM

ఇవే కాకుండా పర్సనలైజ్, హెల్ప్ అనే అంశాలు కూడా వున్నాయి. హెల్ప్ అనే అంశం ప్రియసాఫ్ట్‌వేర్‌లోని ప్రతి ఒక్క అంశాన్ని ఉపయోగించే విధానాన్ని చాలా కూలంకషంగా తెలియజేస్తుంది. దీని ద్వారా ప్రియసాఫ్ట్‌వేర్‌ను ఏ విధంగా ఉపయోగించాలో చాలా విపులంగా అర్థమయ్యే రీతిలో మనకు తెలియజేస్తుంది.

పర్సనలైజ్ అనే అంశం ద్వారా, మనం పని చేసే స్క్రీన్ తాలూకు రంగులను మనకు నచ్చిన విధంగా మార్చుకోవచ్చు. అంతేకాకుండా ఈ అంశంలోని యూజర్ ప్రొఫైల్‌ను ఉపయోగించే వారి వివరాలతో పూర్తిచెయ్యటం వల్ల మనం చేసే ప్రతి ట్రాన్సాక్షన్ (లావాదేవీ) వివరాలు ఒకే ఒక యస్.యం.యస్. (మేసేజ్) ద్వారా తెలియజేస్తుంది. దీని వల్ల ఒక వేళ లావాదేవీలలో ఎటువంటి పొరబాటు జరిగినా మనకు తెలుస్తుంది. వెంటనే సరిదిద్దుకునే అవకాశమూ మనకు కలుగుతుంది.

## ప్రధాన విభాగాలలోనికి వెళితే...

మాస్టర్ ఎంట్రీ అనే అంశం ద్వారా పంచాయితీరాజ్ సంస్థలకు సంబంధించిన ప్రాథమిక వివరాలను (పంచాయితీరాజ్ సంస్థలలో లావాదేవీలు కలిగియున్న కాంట్రాక్టర్లు, ఏజెన్సీల వివరాలు, పంచాయితీరాజ్ సంస్థల వద్ద నున్న వివిధ సామాగ్రుల తాలూకు వివరాలు (స్టాక్ - ఎలక్ట్రికల్, ప్రజారోగ్య సామాను, నీటి సరఫరా విడిభాగాలు మరియు స్టేషనరీ వగైరా), పంచాయతీరాజ్ చేపట్టబోయే వివిధ పనుల తాలూకు వివరాలు (వన్‌టైమ్ ఎంట్రీ) ఒకే ఒక్కసారి నమోదు చెయ్యటం ద్వారా పంచాయితీరాజ్ సంస్థల లావాదేవీలను మరింత విస్తృతంగా కొనసాగించే అవకాశం ఏర్పడుతుంది.

మాస్టర్ ఎంట్రీకి సంబంధించినంత వరకు జిల్లా పంచాయితీ పాత్ర అతి ముఖ్యమైనది. ఆయా జిల్లాలలోని ట్రెజరీలు, బ్యాంకు బ్రాంచీల వివరాలు నమోదు చేసే బాధ్యత జిల్లా పంచాయితీలదే. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కీముల వివరాలను ఈ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసే బాధ్యత ఆయా ప్రభుత్వాలదే. ప్రతిస్థాయిలోని పంచాయితీరాజ్ సంస్థలు ఈ సాఫ్ట్‌వేర్‌లో ముందుగా ఆర్థిక సంవత్సరాన్ని ఎంచుకోవాలి. తమకు సంబంధించిన స్కీములను మ్యాప్‌లో ఎంచుకొని లింక్ చేసుకోవాలి. మండల, గ్రామ పంచాయితీలు, ముందే జిల్లా పంచాయితీచే నమోదు చేయబడిన ట్రెజరీ, బ్యాంకుల జాబితా నుండి తమకు సంబంధించిన ట్రెజరీ, లేదా బ్యాంకులను మాత్రమే ఎంచుకుని (మ్యాప్) లింక్ చేసుకోవాలి. అలాగే ట్రెజరీ, లేదా బ్యాంకుల చెక్కుబుక్కుల వివరాలను కూడా నమోదు చేసి ఫ్రీజ్ చేసుకోవాలి. తదుపరి ఆయా పంచాయితీరాజ్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను నమోదు చేయాలి. అలాగే పంచాయితీరాజ్ సంస్థలలో వివిధ పథకాల క్రింద లబ్ది పొందుతున్న లబ్దిదారులు, పన్ను చెల్లింపు దారుల వివరాలను నమోదు చెయ్యాలి.

2వ అంశమైన బడ్జెట్ ఎస్టిమేట్ల ద్వారా పంచాయితీరాజ్ సంస్థలకు అవసరమైన సాంవత్సరిక బడ్జెట్‌ను, సప్లిమెంటరీ బడ్జెట్‌ను తయారు చేసుకోవచ్చు.

3వ అంశం ట్రాన్సాక్షన్స్ (లావాదేవీలు) చాలా కీలకమైనది. పంచాయితీరాజ్ సంస్థల తాలూకు ఆర్థిక లావాదేవీలన్నీ ఈ అంశం ద్వారానే నమోదు చెయ్యాలి. లావాదేవీలను ముఖ్యంగా 4 భాగాలుగా విభజించారు.

| | | |
|---|---|---|
| 1 | రిసీప్ట్ వోచర్ | (జమలు, ఆదాయ వివరాలు) |
| 2 | పేమెంట్ వోచర్ | (ఖర్చుల వివరాలు) |
| 3 | కాంట్రా వోచర్ | (చలానులు, సెల్ఫ్ చెక్కులు) |
| 4 | జర్నల్ వోచర్ | (అడ్జస్టుమెంటు) |

**1. రిసీప్ట్ వోచర్:** పంచాయితీరాజ్ సంస్థలకు లభించిన వివిద రకాల ఆదాయాన్ని (గ్రాంట్లు, పన్నులు, పన్నేతరములు) సంబంధిత పద్దులకు రిసీప్ట్ ఓచర్‌లో తెలిపిన దిగువ అంశాల ద్వారా జమచేయటానికి ఎంట్రీ చెయ్యాలి.

- డైరెక్ట్ (స్వంత ఆదాయ వనరులు, గ్రాంట్లు వగైరాలు)ట్రాన్స్‌ఫర్ (బదిలీ)
- అడ్వాన్స్ రిసీప్ట్ (ముందస్తు చెల్లింపు)
- రిఫండ్ ఆఫ్ అడ్వాన్సు (తీసుకున్న అడ్వాన్సును తిరిగి చెల్లించటం)
- కాన్సిలేషన్ ఆఫ్ చెక్ (ఇచ్చిన చెక్కును రద్దు చేయటం)
- రిఫండ్ ఆఫ్ ఎక్సెస్ పేమెంట్ (అధికంగా చెల్లించిన మొత్తాన్ని తిరిగి రాబట్టటం)
- రిఫండ్ ఆఫ్ ఓ.బి. అడ్వాన్సు

- డైరెక్ట్ రిసీప్ట్ ఓచర్ అనగా పంచాయితీరాజ్ సంస్థలకు లభించే వివిధ రకాలైన ఆదాయాన్ని సంబంధిత పద్దులకు జమచేయటం.

- అనగా స్వంత ఆదాయం మరియు స్కీములు (గ్రాంట్లు) గా విభజించి పద్దుల వారిగా.

- ట్రాన్స్‌ఫర్ మరియు అడ్వాన్స్ రిసీప్ట్ అనే అంశాలు యితర పంచాయితీరాజ్ సంస్థల నుండి సొమ్ము మొత్తం ట్రాన్స్‌ఫర్ చేసినప్పుడు, పనుల నిమిత్తం అడ్వాన్సుగా ఇచ్చినప్పుడు మాత్రమే వర్తిస్తాయి. అనగా జిల్లా / మండల పంచాయతీల నుండి మండల / గ్రామ పంచాయతీలకు సొమ్ము మొత్తాన్ని బదలాయించినప్పుడు లేదా అడ్వాన్సుగా యిచ్చినప్పుడు ఈ అంశాలను ఉపయోగించి సంబంధిత పద్దులకు జమచేయటానికి ఎంట్రీ వెయ్యాలి.

- రిఫండ్ ఆఫ్ అడ్వాన్సు అనే అంశం పంచాయితీరాజ్ సంస్థలు ఇచ్చిన అడ్వాన్సులను తిరిగి చెల్లించినప్పుడు సంబంధిత పద్దుకు జమ చేయటానికి ఉపయోగపడుతుంది. ఉదా :- పండుగ, వెహికల్, భవన నిర్మాణాల నిమిత్తం, ఇతర పన్నుల నిమిత్తం అవసరార్ధం ఇచ్చే అడ్వాన్సులు.

- పంచాయతీరాజ్ సంస్థలు చెక్కుల ద్వారా చేసిన చెల్లింపులకు సంబంధించిన అంశం "కాన్సిలేషన్ ఆఫ్ చెక్." అనగా చెల్లింపు చేసిన చెక్కు కాలపరిమితి ముగిసినప్పుడు లేదా చెక్కు పోయినప్పుడు ఈ అంశాన్ని ఉపయోగించి తిరిగి సదరు మొత్తాన్ని పంచాయతీరాజ్ సంస్థల నిధులకు కాన్సిలేషన్ ఆఫ్ చెక్ ద్వారా జమ చెయ్యాలి. ఇక్కడ గమనించదగిన మరొక విషయమేమిటంటే చెక్కు పోయిన సందర్భంలో మాస్టర్ ఎంట్రీలోని చెక్కు బుక్కు అంశానికి సంబంధించి "మోడిఫై చెక్ బుక్ లీఫ్ స్టేటస్" అనే అంశంలో సదరు విషయాన్ని


SthanikaPalanaTel_February_2011_Colour_1.pmd 2/1/2011, 10:00 PM

నమోదు చెయ్యాలి. ఇందువల్ల నిధులు నష్టపోయే అవకాశం ఉండదు.

- కాంట్రాక్టరు / ఏజన్సీలు లేదా ఇతరులకు పనుల నిమిత్తం చేసిన చెల్లింపులలో అధిక మొత్తం చెల్లించినట్లు కనుగొనబడిన యెడల, సదరు చెల్లించిన మొత్తాన్ని "రిఫండ్ ఆఫ్ ఎక్సెస్ పేమెంటు" అనే అంశం ద్వారా పంచాయతీ రాజ్ సంస్థల నిధులకు తిరిగి జమచేసి, మరలా వారికివ్వవలసిన మొత్తాన్ని చెల్లించాలి.

- గత సంవత్సరంలో ఇచ్చిన అడ్వాన్సులు తాలూకు తిరిగి రాబట్టవలసిన బకాయిలను ప్రారంభ నిల్వలో నమోదు చేసినప్పుడు, సదరు మొత్తాలను జమ చేయటానికి "రిఫండ్ ఆఫ్ ఓ.బి. అడ్వాన్సు" ను ఉపయోగించి ఎంట్రీవెయ్యాలి.

**2. పేమెంట్ ఓచర్ :** పంచాయతీరాజ్ సంస్థలు వివిధ అంశాలకు సంబంధించి చేసే ఖర్చులను సంబంధిత పద్దులకు పేమెంట్ ఓచర్‌లో తెలిపిన దిగువ అంశాల ద్వారా నమోదు చెయ్యాలి.

ఎ) ఎక్స్‌పెండిచర్ (ఖర్చు)

బి) ట్రాన్స్‌ఫర్ (బదిలీ)

సి) అడ్వాన్సు (ముందస్తు చెల్లింపు)

డి) రిసీప్ట్ కాన్సిలేషన్ (వచ్చిన ఆదాయాన్ని రద్దు చేయటం)

**ఎ) ఎక్స్‌పెండీచర్:** పంచాయతీ రాజ్ సంస్థలు జరిపే వివిధ రకాల చెల్లింపులను ఎక్స్‌పెండిచర్ అంశాన్ని ఉపయోగించి సంబంధిత పద్దులలో నమోదు చెయ్యాలి. సెల్ఫ్ చెక్ ద్వారా డ్రా చేసిన మొత్తానికి కూడా ఈ అంశాన్నుపయోగించే ఖర్చు నమోదు చెయ్యాలి. ఖర్చు అనేది స్కీముల తాలుకు లేదా స్వంత వనరుల తాలుకు మొత్తాల నుండి కూడా కావచ్చు.

**బి) ట్రాన్స్‌ఫర్ :** ఇతర పంచాయతీరాజ్ సంస్థల నుండి మనకు వచ్చిన మొత్తాలకు సంబంధించి ఖర్చు కాగా, మిగిలిన మొత్తాన్ని తిరిగి వారికి చెల్లించవలసి వచ్చినప్పుడు ఈ ట్రాన్స్‌ఫర్ అనే అంశాన్ని ఉపయోగించి ఖర్చును నమోదు చెయ్యాలి. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే ట్రాన్స్‌ఫర్ అనే అంశం అటు రిసీప్ట్‌లోను, ఇటు పేమెంటులో కూడా ఉంది. అయితే ఒక సంస్థను ట్రాన్స్‌ఫర్ ద్వారా ఖర్చు అయినప్పుడు మరొక సంస్థకు ట్రాన్స్‌ఫర్ ద్వారా అది ఆదాయం అవుతుంది.

**సి) అడ్వాన్సు :** పంచాయతీరాజ్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు లేదా చేపట్టే పనులకు సంబంధించి, ఇతర సంస్థలకు వివిధ రకాలైన అడ్వాన్సులు చెల్లించవలసి వచ్చినప్పుడు ఈ అంశాన్నుపయోగించి ఖర్చును నమోదు చెయ్యాలి. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే ఈ అంశం కూడా ఇటు పేమెంటులోను, అటు రిసీప్ట్‌లోను కన్పిస్తుంది. అయితే ఒక సంస్థ అడ్వాన్సు అంశం ద్వారా మరొక సంస్థకు అడ్వాన్సు చెల్లించినప్పుడు అడ్వాన్సు తీసుకున్న సంస్థకు ఆదాయంగాను, చెల్లించిన సంస్థకు ఖర్చుగాను మారుతుంది. అంతే కాకుండా ఉద్యోగులకిచ్చే వివిధ రకాల అడ్వాన్సులను ఈ అంశం ఉపయోగించి ఖర్చుగా నమోదు చెయ్యాలి. చెల్లించిన అడ్వాన్సును తిరిగి రాబట్టేటప్పుడు రిఫండ్ ఆఫ్ అడ్వాన్సు ద్వారా తిరిగి పంచాయతీరాజ్ నిధులకు జమచెయ్యాలి.

**డి) రిసీప్ట్ కాన్సిలేషన్ :** ఒక పంచాయతీ రాజ్ సంస్థ నిధులు మరొక సంస్థకు అనుకోని విధంగా జమ కాబడి, వారి లెక్కలలో నమోదు కాబడినప్పుడు రిసీప్ట్ కాన్సిలేషన్ అనే అంశాన్నుపయోగించి సదరు జమను రద్దు చేయుటం ద్వారా ఖర్చును నమోదు చెయ్యాలి. ఒక రకంగా మనది కాని మొత్తాన్ని తిరిగి చెల్లించటం. ఇతరుల నుండి రిసీప్ట్ ఓచర్లు వున్నప్పుడు మాత్రమే ఈ అంశాన్నుపయోగించి లావాదేవీలను నమోదు చేసే అవకాశం వుంది.

**3. కాంట్రా ఓచర్ :** పంచాయతీరాజ్ సంస్థలకు పన్నులు, అద్దెలు యితర వనరుల నుండి వచ్చిన ఆదాయాన్ని చలాను ద్వారా ట్రెజరీ / బ్యాంకులో జమ చేయటానికి ఈ ఓచర్‌ను ఉపయోగించవచ్చు. అలాగే పంచాయతీరాజ్ సంస్థల నిత్యావసరాలకు, సిబ్బంది జీత భత్యాల చెల్లింపులకు అవసరమైన మొత్తాన్ని ట్రెజరీ / బ్యాంకు నుండి సెల్ఫ్ చెక్ ద్వారా డ్రా చేయటానికి ఈ ఓచర్ ఉపయోగపడుతుంది. అంతే కాకుండా ఒక స్కీముకు సంబంధించిన నిధులను ఇదే బ్యాంకులోని మరొక అకౌంటుకు లేదా వేరొక బ్యాంకులోని అకౌంటునకు మార్పు చేయుటకు కాంట్రాఓచర్‌నుపయోగించ వచ్చును. ఒక స్కీము తాలూకు మొత్తాన్ని, వేరొక స్కీము తాలూకు అకౌంటులోకినికి మార్పు చేయుటకు కాంట్రా ఓచర్ ఉపయోగపడదు.

**4. జర్నల్ ఓచర్ :** ఇది ఒక అడ్జెస్ట్‌మెంట్ ఓచర్. ఈ ఓచర్ ద్వారా ఆర్థిక లావాదేవీలు జరపడానకి వీలుపడదు. తప్పుగా నమోదు చేయబడిన హెడ్ ఆఫ్ అకౌంటును సరిచేయటానకి, ఒక పద్దు నుండి మరొక పద్దుకు మొత్తాన్ని బుక్ అడ్జస్టుమెంట్ చేయటానికి మాత్రమే జర్నల్ ఓచర్ ఉపయోగపడుతుంది. ఒక రోజు తాలూకు డే బుక్ మూసివేయబడిన తరువాతనే జర్నల్ ఓచర్ ఉపయోగించి లావాదేవీలు జరుపడానికి వీలవుతుంది.

ఎ) రిసీప్ట్ రెక్టిఫికేషన్

బి) ఎక్స్‌పెండిచర్ రెక్టిఫికేషన్

సి) అడ్వాన్స్ రెక్టిఫికేషన్

డి) అడ్వాన్సు అడ్జస్టుమెంటు

ఇ) డిడక్షన్

**రిసీప్ట్ ఎక్స్‌పెండిచర్, ఎక్స్‌పెండిచర్ రెక్టిఫికేషన్, అడ్వాన్సు రెక్టిఫికేషన్ ...**

అనే అంశాలు సంబంధిత ఓచర్ల తాలూకు హెడ్ ఆఫ్ అకౌంట్లను సరిచేయటానికి మాత్రమే ఉపయోగపడుతుంది.

**డి) అడ్వాన్సు అడ్జస్టుమెంటు :** ఈ అంశం ద్వారా పనుల నిమిత్తం చెల్లించిన అడ్వాన్సు మొత్తాలను, సదరు పనుల తాలూకు హెడ్ ఆఫ్ అకౌంట్లకు బదిలీ చెయవచ్చు. ఉదాహరణకు ఏదేని పని నిమిత్తం ఇచ్చిన అడ్వాన్సును సదరు పని నిమిత్తం చెల్లించే ఫైనల్ బిల్లుకు అడ్జస్టు చేయవచ్చు.

**ఇ) డిడక్షన్ :** పనుల తాలూకు బిల్లుల నుండి వివిధ ఛార్జీల క్రింద



SthanikaPalanaTel_February_2011_Colour_1.pmd 2/1/2011, 10:00 PM

మినహాయించబడిన మొత్తాలను సస్పెన్స్ అకౌంటు నుండి సంబంధిత పద్దులకు ఈ ఆదాయన్నుపయోగించి మార్పు చేయవచ్చు. అలాగే ఉద్యోగుల (నాన్ & ప్రావిన్షియలైజ్డ్) జీతాల నుండి మినహాయించిన గ్రూప్ ఇన్సూరెన్స్, వృత్తి పన్ను, ప్రావిడెంటు ఫండు వంటి మొత్తాలను కూడా సస్పెన్స్ అకౌంటు నుండి సంబంధిత పద్దులకు జమ చేయవచ్చును.

**- బుక్స్ క్లోజింగ్ :** ఇందులో 3 అంశాలు ఇమిడి వున్నాయి. పంచాయతీరాజ్ సంస్థల యొక్క లావాదేవీలు నమోదు చేసిన తరువాత అకౌంటును ముగింపు చేయాలి. దీనిని రోజువారీ / నెలవారీ / సంవత్సరాల వారీగా "బుక్స్ క్లోజింగ్" ఆప్షన్ ఉపయోగించి చెయ్యాలి. రోజు వారీ లావాదేవీలన్నీ పూర్తి అయిన వెంటనే ఓచర్లన్నిటినీ ఫ్రీజ్ చేసి డే బుక్ క్లోజ్ చెయ్యాలి. అలాగే మంత్లీ / ఇయర్లీ డే బుక్స్‌ను కూడా క్లోజ్ చెయ్యాలి. ఒక్కసారి డే / మంత్లీ / ఇయర్లీ బుక్స్ ముగించిన తరువాత అంతవరకు జరిపిన లావాదేవీలలో ఎటువంటి మార్పులు, చేర్పులు చేయడానికి వీలు పడదు. అందువల్ల అకౌంట్సు ముగించే ముందు ఒకటికి రెండు సార్లు సరిచూసుకొని లావాదేవీలను ముగించాలి.

**- బ్యాంక్ / ట్రెజరీ రికన్సిలేషన్ స్టేట్‌మెంట్ :** పంచాయతీరాజ్ సంస్థల తాలూకు ఆర్థిక లావాదేవీలన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో గమనించుకోవటానికి ట్రెజరీ / బ్యాంకు రికన్సిలేషన్ ఉపయోగపడుతుంది. ప్రతి నెల తాలుకు ఆర్థిక లావాదేవీలు పూర్తి అయిన తరువాత, మరుసటి నెల మొదటి వారం పూర్తయ్యే లోపుగా అకౌంట్సును రికన్సిలియేషన్ చేయ్యాలి. దీనివల్ల ట్రెజరీ / బ్యాంకు పాసు పుస్తకానికి నగదు పుస్తకానికి మధ్య ఏమైనా తేడా వున్నప్పుడు మనకు వెంటనే తెలుస్తుంది. తద్వారా మన అకౌంటును సరిచేసుకోవడానికి వీలు పడుతుంది.

**రిపోర్టులు :** ప్రియ సాఫ్ట్‌లోని రిపోర్టులు అనే అంశం ద్వారా మనకు కావలసిన అనేక రకాల నివేదికలు లభిస్తాయి. మనం చేసే ట్రాన్సాక్షన్ ద్వారా, మనం తయారు చేసే వీలు లేకుండా రిపోర్టులు ఆటోమాటిక్‌గా జనరేట్ అవుతాయి. రిపోర్టులలో ముఖ్యమైనవి.

1. డే బుక్ (రోజువారీ ఆర్థికలావాదేవీల వివరాలు)

2. మంత్లీ క్యాష్ బుక్ (ప్రతి నెల తాలూకు నగదు పుస్తకం)

3. స్కీము వైజ్ క్యాష్ బుక్ (ప్రతి స్కీముకు సంబంధించిన ఆదాయ, వ్యయాలలో కూడిన నగదు పుస్తకం)

4. లెడ్జర్ బుక్ (హెడ్ అకౌంట్ (మేజర్ హెడ్) వారీగా ఆదాయ వ్యయాలను తెలిపే నివేదిక)

5. జర్నల్ బుక్ (జర్నల్ ఓచర్ ఉపయోగించి మనం చేసే లావాదేవీలన్నీ ఈ నివేదిక తెలియజేస్తుంది)

6. స్కీము వైజ్ చెక్ రిసీప్ట్ రిజిష్టర్ (వివిధ పథకాలు / గ్రాంట్లకు సంబంధించిన వచ్చిన చెక్కుల తాలూకు వివరాలు తెలిపే నివేదిక)

7. స్కీము వైజ్ చెక్ ఇష్యూ రిజిష్టర్ (వివిధ పథకాలు / గ్రాంట్లను ఖర్చు చేయటానికి జారీ చేసిన చెక్కుల వివరాలను తెలిపే నివేదిక)

8. రిజిష్టర్ ఆఫ్ అడ్వాన్స్ (కాంట్రాక్టర్లు, ఏజెన్సీలకు, ఉద్యోగులకు ఇచ్చిన అడ్వాన్సులు వారి నుండి తిరిగి రాబట్టబడిన అడ్వాన్సు మొత్తాల తాలుకు నివేదిక)

9. రిజిష్టర్ ఆఫ్ రిసీవబుల్స్ మరియు పేయబుల్స్ : (రిసీవబుల్స్ అనగా పంచాయతీరాజ్ సంస్థలకు రావాలసిన మొత్తములు, పేయబుల్స్ అనగా పంచాయతీరాజ్ సంస్థలు చెల్లించవలసిన మొత్తములు తెలిపే నివేదిక.)

10. యాన్యువల్ రిసీప్ట్ మరియు పేమెంట్స్ అకౌంట్సు : ఒక ఆర్థిక సంవత్సరం తాలూకు లావాదేవీల ద్వారా ఆ సంవత్సర ఆదాయ, వ్యయాలను తెలిపే నివేదిక.

11. కన్సాలిడేటెడ్ అబ్‌స్ట్రాక్ రిజిష్టర్ : ఇందులో హెడ్ వారీగా ఆదాయ, వ్యయాలను తెలియజేస్తూ, ఆ హెడ్‌లో ఆ నెల / సంవత్సరం ఆఖరుకు ఉన్న నిల్వ మొత్తాన్ని, (బ్యాలన్స్ షీట్) తెలియజేస్తుంది.

12. మంత్లీ రికన్సిలేషన్ స్టేట్‌మెంట్ : నెలవారీ అకౌంట్లను సరిచూసి మనం తయారు చేసిన రికన్సిలేషన్ స్టేట్‌మెంట్లను తెలియజేసే నివేదిక.

13. స్టాక్ రిజిష్టర్ : పంచాయతీరాజ్ సంస్థలు కొనుగోలు చేసే వివిధ వస్తువుల జమ, ఖర్చు, నిల్వలను తెలియజేసే నివేదిక. (ఉదా :- స్టేషనరీ, ప్రజారోగ్యం, నీటి సరఫరా, విద్యుత్ విడి భాగాలు)

14. రిజిష్టర్ ఆఫ్ డిమాండ్ కలెక్షన్, బ్యాలెన్స్ కలెక్షన్, బ్యాలెన్స్ : పన్నులు, పన్నేతర తాలుకు డిమాండు, వసూలు, నిల్వలను తెలియజేసే నివేదిక

15. ఓపెనింగ్ బ్యాలెన్స్ రిపోర్టు : పంచాయతీరాజ్ సంస్థల తాలుకు ఆర్థిక లావాదేవీల నిర్వహణకు అవసరమైన ప్రారంభ నిల్వ వివరాలను తెలియజేసే నివేదిక.

16. రిజిష్టర్ ఆఫ్ మూవబుల్ ప్రాపర్టీ : పంచాయతీరాజ్ సంస్థల తాలూకు చరాస్తుల వివరాలను తెలియ పరిచే నివేదిక.

17. రిజిష్టర్ ఆఫ్ ఇమ్మూవబుల్ ప్రాపర్టీ : పంచాయతీరాజ్ సంస్థల తాలూకు స్థిరాస్తుల వివరాలను తెలియపరిచే నివేదిక.

పైన తెల్పిన అంశాలు కాకుండా ప్రియసాఫ్ట్‌లో ట్రాన్సాక్షన్స్ చేయడానికి ఈ దిగువ అంశాలు కూడా ఉపయోగపడతాయి.

**1. యాడ్** (Add) : ఈ ఆప్షన్‌ను ఉపయోగించే అన్ని ట్రాన్సాక్షన్స్‌ను చేయాలి.

**2. మోడిఫై** (Modity) : చేసిన ట్రాన్సాక్షన్స్‌లో మార్పులు, చేర్పులు చేయడానికి ఈ ఆప్షన్ ఉపయోగించాలి.

**3. డిలీట్** (Delete) : ఈ ఆప్షన్‌ను ఉపయోగించి అవసరం లేని ఎంట్రీలను తొలగించాలి.

**4. ఫ్రీజ్** (Freeze) : ఈ ఆప్షన్‌ను ఉపయోగించి ప్రతి ఓచర్ తాలూకు ఎంట్రీలకు ఫ్రీజ్ చేయాలి. డేబుక్ క్లోజ్ చేయడానికి ఓచర్లు ఫ్రీజ్ చేయడం తప్పనిసరి.



SthanikaPalanaTel_February_2011_Colour_1.p10d 2/1/2011, 10:00 PM

**5. అన్‌ఫ్రీజ్** (Unfreeze) : ఫ్రీజ్ చేసిన ఓచర్లలో మార్పులు చేయవలసినప్పుడు ఈ ఆప్షన్‌ను ఉపయోగించి ఓచర్లను అన్‌ఫ్రీజ్ చేసి అప్పుడు మార్పులు చేయాలి. డే బుక్ క్లోజ్ చేసిన తరువాత ఓచర్లను అన్‌ఫ్రీజ్ చెయ్యలేము.

**6. వ్యూ** (View) : ట్రాన్సాక్షన్ల తాలూకు ఓచర్లన్నిటిని ఈ ఆప్షన్‌ను ఉపయోగించి చూడవచ్చును.

జిల్లా / మండల/ గ్రామ పంచాయితీల తాలూకు రోజు వారీ లావాదేవీలను రోజు పూర్తి కాబడిన తరువాత ఓచర్ల వారీగా సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చడం ద్వారా ప్రజలలో పంచాయతీరాజ్ సంస్థలపై విశ్వసనీయత సాధించవచ్చును. ఈ విధానం ద్వారా పంచాయతీరాజ్ సంస్థల లావాదేవీలన్నీ కూడా పౌరులందరికీ అందుబాటులో వుండటం వల్ల పారదర్శకతను కలిగి వుంటాయి. అంతే కాకుండా పంచాయతీరాజ్ సంస్థలపై ప్రస్తుతం ప్రజలలో వున్నటువంటి దురభిప్రాయాన్ని తొలగించటానికి ఈ విధానం ఎంతో తోడ్పడుతుంది.




దేశంలో మొట్టమొదట గా ఈ విధానాన్ని అవలంబించి, మిగతా రాష్ట్రాలకు ఆదర్శవంతంగా నిలిచిన రాష్ట్రం ఒరిస్సా. రెండవ స్థానంలో మహారాష్ట్ర, మూడవ స్థానంలో ఆంధ్రప్రదేశ్‌లు వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రియాసాఫ్ట్ (మోడల్ అకౌటింగ్ విధానం)ను నవంబర్ 22, 2010వ తేదీన ఎ.ఎమ్.ఆర్. అపార్డు లో లాంఛనంగా ప్రారంభించి, ఇప్పటి వరకు సుమారు 170 మందికి, శిక్షణ ద్వారా అవగాహన కల్పించటం జరిగింది. అంతేకాకుండా ప్రతి స్థాయిలో ఉద్యోగులకు ఈ విధానంపై సమగ్రమైన అవగాహనను కల్పించడానికి గాను ప్రాంతీయ విస్తరణ కేంద్రాలలో కూడా అట్టడుగు స్థాయి ఉద్యోగి వరకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

శిక్షణా కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ విస్తరణ శిక్షణ కేంద్రం, రాజేంద్రనగర్‌లో డిసెంబర్ 2, 2010వ తేది నుండి శిక్షణా తరగతులు ప్రారంభించటం జరిగింది. దేశంలోనే ఈ తరహా శిక్షణా కార్యక్రమం ప్రారంభించటంలో ఇ.టి.సి. రాజేంద్రనగర్ ముందజలో వుంది. జిల్లా స్థాయి ఉద్యోగులకు మొదటి బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసి, ప్రస్తుతం గ్రామపంచాయితీ స్థాయిలోని ఉద్యోగులకు శిక్షణ ఇవ్వటం ప్రారంభించటం జరిగింది.

అయితే ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే, ఒరిస్సా రాష్ట్రంలో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా అందించిన 29 అంశాల తాలూకు నిధులు, విధులు, అధికారాలు అన్నీ పంచాయతీరాజ్ సంస్థలకే వున్నాయికానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా నిధులు, విధులు, అధికారాల అప్పగింత పూర్తి స్థాయిలో జరగని కారణంగా కేవలం పంచాయతీరాజ్ సంస్థల ఆర్థిక వనరుల నిర్వహణకే ఈ విధానం పరిమితం అయ్యే అవకాశం వుంది. అలాకాకుండా ఒరిస్సా, ఇతర రాష్ట్రాల స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయతీరాజ్ సంస్థలకు కూడా 29 అంశాల తాలూకు నిధులు, విధులు, అధికారాల అప్పగింత జరిగినప్పుడే మరింత పారదర్శకత, జవాబుదారీ తనం వహించే వీలు వుంటుంది.

మోడల్ అకౌంటింగ్ విధానం (ప్రియసాఫ్ట్)ను అన్ని స్థాయిలలో సక్రమంగా, సమర్థవంతంగా అమలు చేయటం అనేది అత్యున్నత స్థాయిలో సమీక్ష నిర్వహించి, తగిన చర్యలు తీసుకున్నప్పుడే సాధ్యపడుతుంది. ఒరిస్సా రాష్ట్రం ఈ విషయంలో మనందరికీ ఆదర్శనీయం. ఎందుకంటే ఆ రాష్ట్రంలో అత్యున్నత స్థాయి అధికారి కార్యక్రమం మొత్తాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమీక్షిస్తూ మొత్తం 3 అంచెల పంచాయతీరాజ్ సంస్థలలో 90 శాతం ప్రియ సాఫ్ట్‌లో తమ వివరాలను పొందుపరిచే విధంగా ప్రగతి సాధించారు.

మన రాష్ట్రంలో కూడా ఇదే తరహా పద్ధతిని అవలంబించి అన్ని స్థాయిలలోని పంచాయతీరాజ్ సంస్థలు సాధ్యమైనంత త్వరగా తమ తమ ఆర్థిక లావాదేవీలను ప్రియసాఫ్ట్‌లో పొందుపరిచే విధంగా ఆదేశాలను, సహాయ సహకారాలను అందిస్తే బాగుంటుంది. తద్వారా పెర్‌ఫార్మెన్స్ ఆధారిత గ్రాంటును రాష్ట్రానికి సాధించడం ద్వారా పంచాయతీరాజ్ సంస్థలు మరింత బలోపేతం అయ్యే అవకాశం కూడా వుంది కాబట్టి మనందరం మన రాష్ట్ర పురోగతికి, తద్వారా స్థానిక ప్రగతికి మనవంతు సహకారాల నందించి పంచాయతీరాజ్ సంస్థలపై వున్న దురభిప్రాయాన్ని తొలగించడానికి పాటుపడదాం. ఎవరో చేసిన తప్పులకు మనం బాధ్యులం కాకుండా తల ఎత్తుకుని సగర్వంగా జీవిద్దాం.

**- జి. సత్యవాణి**

*ఫ్యాకల్టీ, ఇ.టి.సి, రాజేంద్రనగర్, హైదరాబాద్*

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**



SthanikaPalanaTel_February_2011_Colour_1.pmd 2/1/2011, 10:00 PM

# ఫిబ్రవరి 2 - ప్రపంచ చిత్తడి నేలల సంరక్షణ దినోత్సవం



**మడ అడవులని కాపాడుదాం-తీరప్రాంతాన్ని సంరక్షిద్దాం**

RNI No. APTEL / 2009/27888

# మిలాదున్నబి శుభాకాంక్షలు

